
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ fb.com/vaartha
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-2-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 3 పేజీలు: 12 వెల: 6.50

మన నేవిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-2 క్షేమం
ప్రచారం సమాప్తం.. ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం 9లో




## ఎమ్మెల్సీ సీట్లకు 27న పోలింగ్

### మార్చి 3న కౌంటింగ్

### నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ.ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికలసంఘం, గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎన్నికలు 2025 ఫిబ్రవరి 27న జరగనుండగా, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఫిబ్రవరి 3న నుంచీ నామినేషన్ల స్వీకరణ ప్రారంభమయ్యాయి. అభ్యర్థులు ఫిబ్రవరి 10వ తేదీ వరకు తమ నామినేషన్లు సమర్పించవచ్చు.ఈ నామినేషన్ల స్వీకరణ అనంతరం, ఫిబ్రవరి 11వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఉపసంహరించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను ఫిబ్రవరి 27న నిర్వహించనున్నారు. ఆ తరువాత, మార్చి 3వ తేదీన కౌంటింగ్ జరుగుతుంది. దీనితో ఈ ఎన్నికలకు సంబంధించిన పూర్తి కార్యాచరణ పూర్తవుతుందని ఎన్నికలసంఘంతెలిపింది. ఈఎన్నికల్లో >>2



సోమవారం వసంతపంచమి సందర్భంగా మహాకుంభ్‌కు పోటెత్తిన భక్తులు

## 'మహాకుంభ్'కు పోటెత్తిన భక్తులు 2లో



## పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం

### హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### బెదరింపులకు భయపడబోమన్న పనామా అధ్యక్షుడు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 3:** అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందే పొరుగుదేశాలపై హెచ్చరికలతో కయ్యానికి కాలు దువ్విన అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు అన్నంత పనీ చేసేలాగే కన్పిస్తున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనాలపై సుంకాలతో విరుచుకుపడిన ఆయన.. తాజాగా 'పనామా కాలువ'పై కీలక వ్యాఖ్యలుచేశారు. ఈకాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్న ట్రంప్.. త్వరలోనే ఇందుకు సంబంధించి కీలక పరిణాలు ఉంటాయన్నారు. బలవం తపు చర్యలు ఉండొచ్చనే సంకేతాలి >>2



సోమవారం ఢిల్లీలో అరవింద్ పనగరియాతో సీఎం చంద్రబాబు సమావేశ దృశ్యం

## మరిన్ని నిధులివ్వండి..

### 16 ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియాను కోరిన సిఎం చంద్రబాబు

### గత ఐదేళ్లుగా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని వివరణ

**విజయవాడ.ఫిబ్రవరి 3, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గత అయిదేళ్లలో ఆర్థికంగా తీవ్ర నష్టపోయిందని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమాభివృద్ధి ముందుకు నడిపిస్తునే ఆర్థికంగా శక్తి వంతంగా చేయాల్సి ఉందన్నారు. ఇందుకు వీలుగా ఎపికి అవసరమైన నిధులను అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసారు. సిఎం చంద్రబాబు ఢిల్లీలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఎపి ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైకాంగ్రెస్ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సిఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.

201419 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక >>2

## టాలీవుడ్ నిర్మాత కెపి చౌదరి ఆత్మహత్య 2లో

# రాష్ట్ర రైల్వే అభివృద్ధికి రూ. 9471 కోట్లు



### వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

### 73 స్టేషన్లకు కొత్త రూపు

### మరిన్ని నమోభారత్, వందేభారత్ రైళ్లు

### కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, అండర్ పాస్‌ల నిర్మాణాలు అనేకం ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడి

**విజయవాడ ఫిబ్రవరి3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి కి రూ.9417 కోట్లు కేటాయించామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల స్విట్జర్లాండ్ వెళ్లి అక్కడి రైల్వే ట్రాక్‌లను పరిశీలించాం. రైల్వే ట్రాక్‌ల నిర్వహణలో స్విట్జర్లాండ్ వ్యవస్థను పాటిస్తున్నాం. వందే భారత్ ట్రైన్లలో స్లీపింగ్ సీట్లపై ట్రయల్ జరుగుతోంది. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్ ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణలో 1326 కి.మీ మేర ప్రస్తుతం కవచ్ టెక్నాలజీ ఉంది. మరో 1026 కి.మీ.మేర ఈ టెక్నాలజీ ఏర్పాటు చేస్తున్నాం. 2026 లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తాం. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తాం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని రైల్వేలైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. పేద వర్గాల కోసం నమో భారత్ రైళ్లను నడుపుతున్నాం. త్వరలో దేశమంతా దాదాపు 100 నమోభారత్ ఎక్స్‌ప్రెస్‌లు తీసుకురానున్నాం. ఈ రైళ్ల ద్వారా పేద ప్రజలు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు అని కేంద్ర మంత్రి తెలిపారు. యూపీఏ హయాంతో పోల్చితే ఈ కేటాయింపులు 11 రెట్లు ఎక్కువన్నారు. రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్ల రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నామని ఈస్టేషన్ల ఆధునికీకరణకు >>2

## ప్రభుత్వ పథకాల పక్కా అమలుకు నిరంతర అభిప్రాయ సేకరణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో ఎక్కడా అలసత్వం, అవినీతి, నిర్లక్ష్యం కనిపించకూడదని సిఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు సక్రమంగా జరగాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ ఆధారంగా అవసరమైన మార్పులు చేసుకుని పనిచేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నిర్వహణపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపై సిఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష చేశారు. పింఛన్ల పంపిణీ, అన్న క్యాంటీన్, ఎరువులు >>2

# ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత పెంచండి

### కేలండర్ ప్రకారం రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదలకు చర్యలు : మంత్రి లోకేష్



**విజయవాడ.ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో నాణ్యత పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలో తన నివాసంలో ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలుసమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రాథమికస్థాయి నుంచే పరివర్తన తేవాలన్నది తమ లక్ష్యమని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో గత 10 సంవత్సరాలుగా సంస్కరణలు లేవు, తాను హెచ్‌ఆర్‌డి మంత్రి అయ్యాక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెరగాల్సి ఉందన్నారు. తమ ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది ఆర్‌టిఎఫ్ స్కాలర్ షిప్ లకు సంబంధించి తొలివిడతలో రూ.788 కోట్లకు గాను, ఇప్పటికే 571.96 కోట్లు విడుదల చేశా మని, రెండు, మూడు రోజుల్లో మిగిలిన 216.04 కోట్లు కూడా విడుదల చేస్తామని తెలిపారు. ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, ఆర్ అండ్ డి, ఇన్నొవేషన్స్ పై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్లేస్ మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ముగిసిన తరువాత ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించి ఇంజనీ రింగ్ విద్య నాణ్యత పెంచేందుకు అందరి అభిప్రా యాలు తీసుకుంటాం అని లోకేష్ అన్నారు.ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు మాట్లా డుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీఇంబర్స్ మెంట్ సొమ్మును ఎప్పటికప్పుడు క్యాలండర్ ప్రకారం విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఫీజులు గిట్టుబాటుగా లేవని, వాటిని సవరించాలని కోరారు. ఈ విష యంలో ముందస్తుగా కసరత్తు ప్రారంభించాల న్నారు. ఎంసెట్ షెడ్యూలును నిర్ణీత సమయం ప్రకారం విడుదలచేయాలని, ఎంసెట్‌లో 3 కౌన్సిలింగ్స్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థుల ప్లేస్ మెంట్స్ విషయంలో ప్రభుత్వం చొరవచూపాలని, ఇందుకోసం స్టేట్‌లెవల్ జాబ్‌మేళాతో సహా యూని వర్సిటీల్లో ఆయా కంపెనీలను రప్పించి జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. అటెండెన్స్ విషయంలో వెయిటేజి విధానాన్ని అమలుచేస్తే సత్ఫలితాలు ఉంటాయని సూచించారు. రాష్ట్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రిసర్చ్ (ఎన్ఐటిటిపిఆర్)ను పునరుద్ధరించాలని, వీలైతే 3చోట్ల ఈ కేంద్రాలను ఏర్పాటుచేసి అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేషనల్ క్రెడిట్ అండ్ క్వాలిటీ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌సిక్యుఎఫ్)కు లోబడి మైక్రో సర్టిఫికేషన్ ను అమలుచేయాలని సూచించారు.

# సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోండి

### ఎపి, తెలంగాణకు సూచించిన కేంద్ర హోంశాఖ

### విభజన అంశాలపై జరిగిన ప్రత్యేక సమావేశం

**విజయవాడ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఎపి విభజన అంశాలపై ఢిల్లీలోని కేంద్రహోంశాఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎపి, తెలంగాణ సిఎస్‌లు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా పరిష్కారం కాని ప్రధానాంశాలపై అధికారులు చర్చించారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఎఎస్ అధికారి గోవింద్ మోహన్ తొలిసారి ఎపి విభజన చట్టంపై సమీక్ష చేపట్టారు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత విభజన చట్టం అమలుపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి లోతుగా సమీక్షించారు. విభజన చట్టం 9, 10 షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజన, ఆస్తులు, అప్పుల పంపకాలపై ఎక్కువ చర్చ జరిగినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాలు సమన్వయంతో అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో ఉన్నాయన్నట్లు వెల్లడించారు. వాతావరణం సానుకూలంగా ఉన్నప్పుడే సమస్యలు కూడా త్వరగా పరిష్కారం అవుతాయని అధికార వర్గాలు >>2

4-2pg2exHMNWJQE.qxd:4-2pg2exHMNWJQE.qxd 01/01/01 9:54 AM Page 1





సోమవారం సచివాలయంలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన సోనూసూద్

# నాలుగు అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన సూద్ చారిటీ ఫౌండేషన్

## సిఎం చంద్రబాబుతో సోనూ సూద్ భేటీ

**విజయవాడ.ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యంసామాజిక సంక్షేమం విషయంలో సేవలు అందించే సూద్ చారిటీ ఫౌండేషన్ రాష్ట్రంలో ప్రజారోగ్య సంరక్షణ కోసం నాలుగు అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ఈ మేరకు నటుడు, సూద్ ఛారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోనూ సూద్ మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్‌లకు సంబంధించిన తాళాలు,లోగోలు,ఇతరత్రాలు సిఎం చంద్రబాబు సమక్షంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముడ్వా తిరుమల కృష్ణబాబుకు అందజేసారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు, సుదూర ప్రాంతాల్లో క్లిష్టమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా అంబులెన్సులు ఇచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం అత్యవసర వైద్య చికిత్సలు, అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం అందేలా ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఆశయంలో సూద్ ఛారిటీ ఫౌండేషన్ భాగస్వామి కావడంపై ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇతర ఆరోగ్యసేవాల విషయంలో సోనూసూద్ సహకారాన్ని సిఎం చంద్రబాబు అందించాలని కోరారు. తమ ప్రభుత్వం పేదరిన నిర్మూలన, విద్యా, వైద్యరంగాల్లో అందిస్తున్న సేవలను వివరించారు. తాము అందించిన అంబులెన్సులతో ఆపదలో ఉన్నవారికి భరోసా లభిస్తుందని సోనూసూద్ ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక ఆరోగ్య సేవల విషయంలో తబ ఫౌండేషన్ అన్ని విధాలుగా ప్రజలకు సహకరిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్యసేవల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ ప్రసంసనీయమన్నారు.

# నేడు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

## ఉదయం 10 గంటలకు కేబినెట్ భేటీ

## కులగణన నివేదిక, ఎస్సీవర్గీకరణ అమలుపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి3:** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నేడు ఉదయం 10 గంటలకు సమావేశం కానుంది. కులగణన సర్వే నివేదిక, ఎస్సీ వర్గీకరణ అమలు అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కేబినెట్ భేటీ తర్వాత 11 గంటలకు అసెంబ్లీలో వాటిపై చర్చించి ఆమోదించనున్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించనుంది. శాసనమండలి, శాసనసభలో ఈ రెండు నివేదికలను ప్రవేశపెట్టి చర్చించనున్నారు. కేంద్ర ప్రభుత్వానికి బిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలుచేసింది. అందులో బిసి రిజర్వేషన్లను 34 శాతంనుంచి 23శాతానికి తగ్గించింది. ఆ విధానం లోనే 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అయితే బిసిలకు రిజర్వేషన్లను తగ్గించడంపై రాష్ట్ర హైకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారించిన హైకోర్టు రిజర్వేషన్‌లను తగ్గించి ఎన్నికలు జరపాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని అభిప్రాయపడింది. అంతేకాకుండా రిజర్వేషన్లను పాటించని ఎన్నికలను ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించింది.

అయితే సుప్రీం మార్గదర్శకాల ప్రకారం చేయాలంటే అందుకు రాష్ట్రంలోని బిసిల జనాభాను తేల్చాలి. బిసి గణన జరిపి జనాభాలో వారి శాతాన్ని ఖరారుచేయాలి. ఈ నేపథ్యంలోనే డెడికేషన్ కమిషన్‌నివేదిక ఆధారంగా బిసిల రిజర్వేషన్‌లను ప్రభుత్వం ఖరారు చేయనుంది. కులగణన నివేదికపై చర్చ అనంతరం సభ ఆమోదం తెలపనుంది. మార్చి 5 నుంచి ఇంటర్, మార్చి 17 నుంచి పదోపరీక్షల షెడ్యూల్ ఉంది. పంచాయతీ ఎన్నికలు ఫిబ్ర వరిలో నిర్వహిస్తే పరీక్షల నిర్వహణకు ఏమైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందా? అనే కోణంలో ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే స్థానిక ఎన్నికలతో ఇంటర్ పరీక్షలకు పెద్దగా ఇబ్బంది ఉండదని, పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నందున ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు పెడితే సమస్య లేదని అధికారులు సీఎంకు రేవంత్‌కు సూచించినట్లు సమాచారం.

ఇదే సమయంలో ఎస్సీ వర్గీకరణ అమలు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 12న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చైర్మన్‌గా.. వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహ కో చైర్మన్‌గా, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవిలను సభ్యులుగా క్యాబినెట్ సబ్ కమిటీ నియమించింది.

# రూ. 9417 కోట్లు

>> నిధులు కేటాయించామన్నారు. ఏపీకి మరిన్ని నమో భారత్ , వందేభారత్ రైళ్లు కేటాయించామన్నారు. రైళ్ల వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆదునిక సాంకేతికత సాయంతో రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో ఇప్పటికే అనేక రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని అందుకే ఏపీ రైల్వే ప్రాజెక్టుల గురించి బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుదీకరణ వందశాతం పూర్తి చేశామన్నారు. ప్రయాణీకుల డిమాండ్ మేరకు అదనంగా వందే భారత్ రైళ్లను ఉత్పత్తి చేయడం తోపాటు, పేద మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం మరో 17,500 సాధారణ బోగీలను తయారు చేస్తున్నామన్నారు. అలాగే 2014 నుంచి 1,560 కిలోమీటర్ల నూతన రైలు మార్గాలను నిర్మించామన్నారు. రూ.80,097 కోట్ల రూపాయల వ్యయంతో 5,560 కిలోమీటర్లు గల 43 నూతన రైలు మార్గాల ప్రాజెక్టులకు, రూ.2,051 కోట్ల రూపాయల వ్యయంతో 73 అమృత భారత్ స్టేషన్ లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 770 రైల్ ఫ్లైఓవర్ లను, ఆర్ యు బి లను నిర్మించడం తోపాటు 65 లిఫ్టులను, 34 ఎస్కలేటర్ లను, 509 రైల్వే స్టేషన్ లలో వైఫై సౌకర్యం కల్పించామన్నారు.

రాష్ట్రంలో రూ.84,559 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రం మీదుగా 15 జిల్లాలను కవర్ చేస్తూ 8 వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. రూ.446 కోట్ల రూపాయల వ్యయంతో విశాఖపట్నం, 103 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు, రూ.312 కోట్ల రూపాయల వ్యయంతో తిరుపతి, రూ.271 కోట్ల రూపాయల వ్యయంతో రాజమండ్రి రైల్వే స్టేషన్‌లను రూ.1,132.43 కోట్ల రూపాయల వ్యయంతో స్టేషన్లలో పునర్నిర్మాణం చేపట్టామని తెలిపారు. అలాగే నూతన రైలుమార్గాలు, డబ్లింగ్, క్వాడ్రప్లింగ్, కొత్త నిర్మాణాలు, స్టేషన్ల అభివృద్ధి, పునర్నిర్మాణం, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయన్నారు.

స్లీపర్, చైర్‌కార్ లతో రెండు 100 అమృత్ భారత్, 50 నమో భారత్, 200 వందే భారత్ రైళ్లను రాబోయే రెండుమూడేళ్లలో తయారు చేయనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలనుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతామని రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని వివరించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధిచేస్తున్నామని కొన్నిపనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు.

# టాలీవుడ్ నిర్మాత కెపి చౌదరి గోవాలో ఆత్మహత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి, 3, ప్రభాతవార్త:** టాలీవుడ్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సుంకర కృష్ణప్రసాద్ చౌదరి, అలియాస్ కెపి చౌదరి (48) గోవాలో సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చౌదరి మృతదేహం గోవాలోని సియోలిమ్‌లో గల అతని నివాసంలో వుండగా ఇంట్లో పని మనుషులు కనుగొని దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఖమ్మం జిల్లాకు చెందిన కెపి చౌదరి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బిటెక్ చదివి పలుచోట్ల ఉద్యోగం కూడా చేశాడు. 2016లో తెలుగు సినీ రంగంలో డిస్ట్రిబ్యూటర్‌గా ప్రయాణం ప్రారంభించిన కెపి చౌదరి ఆ తరువాత పలు తెలుగు, ఇతర భాషల సినిమాలకు నిర్మాతగా వ్యవహరించాడు. రజనికాంత్ నటించిన కబాలి తెలుగు వర్షన్‌కు ఇతను నిర్మాతగా వున్నాడు. దీంతో పాటు సర్దార్ గబ్బర్ సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె పువ్వు, అర్జున్ సుర వరం సహా పలు చిత్రాలు నిర్మించాడు. అయితే కెపి చౌదరి నిర్మించిన సినిమాల్లో కొన్ని ఆర్థికంగా నష్టం కలిగించడంతో అతను తన మకాంను గోవాకు మార్చి అక్కడ ఒక క్లబ్‌ను తెరిచాడు. అయితే క్లబ్ ఆశించినంత మేరకు లాభాలు తేకపోవడంతో టాలీవుడ్‌లో తనకు పరిచయం వున్న ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేశాడని పోలీసులు చెబుతున్నారు. 2023లో రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్ వద్ద కారులో వంద ప్యాకెట్ల కొకైన్‌తో వస్తుండగా ఇతను పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన తరువాత పలు ఇతర కేసులు కూడా ఇతని మెడకు చుట్టుకున్నాయి. దీంతో కెపి చౌదరి పూర్తిగా గోవాకు పరిమితమయ్యాడు. అయితే గోవాలో ప్రారంభించిన క్లబ్ నష్టాలు తేవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. గోవాలో డ్రగ్స్ డాన్ ఎడ్విన్ సహా పలువురు డ్రగ్స్ సరఫరాదారులతో కెపి చౌదరికి సంబంధాలున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో వున్న కెపి చౌదరి గోవాలోని సియోలిమ్‌లో తాను వుంటున్న ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా ఇతని మృతదేహాన్ని గోవా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్‌లా కేంద్ర సహాయం

## నిధుల కేటాయింపు ఆశాజనకమే: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం లభిస్తుందనే నమ్మకం తమకు ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కేటాయింపు విషయంలో ఆశాజనకమైన పరిస్థితులున్నాయన్నారు. రాష్ట్రానికి ఇచ్చే నిధులకు సంబంధించిన అన్ని ప్రస్తావనలు ఆర్థిక ప్రణాళికలో ఉండాలని ఎక్కడ లేదన్నారు. రాజధాని నగరం అమరావతి, పోలవరం ప్రాజెక్ట్. విశాఖ స్టీల్స్ తదితరంశాల్లో కేంద్రం మంచి సాయం అందిస్తుందన్నారు. ఇక తాజా ఆర్థిక ప్రణాళికలోను ఏపీకి భారీగానే నిధులు కేటాయించారు. వికసిత్ భారత్ 2047 గమ్యాన్ని చేరుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు చూస్తే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన ఆక్సిజన్‌లా ఉంది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యం అని సిఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడారు. 202526 బడ్జెట్, ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని వివరించారు. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీకి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు కేటాయించబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్ లో రూ. 5,936 కోట్లు కేటాయించిందన్నారు.



సోమవారం మహా కుంభ్‌మేళాలో హెలికాప్టర్ల నుంచి పూలవర్షం కురిపిస్తున్న దృశ్యం

# 'మహాకుంభ్'కు పోటెత్తిన భక్తులు

## వారిపై పూలజల్లు కురిపించిన హెలికాప్టర్లు

## భారీగా వసంతపంచమి రద్దీ

**మహాకుంభ్‌నగర్, (యూపి),ఫిబ్రవరి 3:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మికమేళా మహాకుంభమేళాలో వసంతపంచమి సందర్భంగా సోమవారం అమృతస్నానాలకు భక్తులుపోటెత్తారు. సోమవారం తెల్లవారు ఝామునే త్రివేణి సంగమంలో పెద్దఎత్తున భక్తులు పుణ్యస్నానాలుచేశారు. వసంతపంచమిని పురస్కరించుకుని సోమవారం ఆరుకోట్లమందికిపైగా పవిత్రస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేసారు. మౌని అమావాస్యరోజున చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలోకుంభమేళా ప్రాంతంలో భద్రతను మరింత పటిష్టంచేసారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేసారు. అటుయూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తెల్లవారుజామున 3.30 గంటలనుంచేపరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉదయం ఆరుగంటల్లోపే కొంతమంది అఖాడాలు అమృతస్నానం చేసారు. నాగసాధువులుకూడా మరింతగా వచ్చారు. త్రివేణి సంగమం వద్దభక్తులపై హెలికాప్టర్లతో పూలవర్షం కురిపించారు. తెల్లవారుఝామున నాలుగు గంటలవరకూ 16.58 లక్షలమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న కుంభమేళా ప్రారంభంకాగా ఇప్పటివరకూ 34.97 కోట్లమంది పుణ్యస్నానాలుచేసినట్లు అధికారులు తెలిపారు. 144 ఏళ్లకోసారివచ్చే ఈ మహాకుంభ్‌మేళా ఫిబ్రవరి 26 వరకూ కొనసాగుతుంది. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే భక్తులకోసం 84 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. 54 అతిజనసాంద్రత నియంత్రణ కేంద్రాలు కూడా ప్రారంభించారు.

# పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం

>> వ్వడం గమనార్హం. 'పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోంది. మేం దాన్ని చైనాకు ఇవ్వలేదు. కానీ, ఒప్పందాన్ని పనామా ఉల్లంఘిస్తోంది. అందుకే కాలువను తిరిగి తీసుకోవాలనుకుంటున్నాం. లేదా త్వరలోనే దీనిని సంబంధించి శక్తిమంతమైన చర్య ఉండబోతోంది' అని ట్రంప్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే, దీనికి బలగాల అవసరం ఉండకపోవచ్చని అన్నారు. ఇదిలా ఉండగా.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారం పనామా అధ్యక్షుడు జోస్‌రౌల్ ములినోతో భేటీ అయిన సంగతి తెలిసిందే. 'పనామా కాలువ విషయంలో చైనా జోక్యాన్ని, నియంత్రణను అడ్డుకోవాలి. లేదంటే తగిన చర్యలు తీసుకుంటుంది' అని ములినోతో అగ్రరాజ్య విదేశాంగ మంత్రి గట్టిగా చెప్పారు. ఈ భేటీ అనంతరం పనామా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 'అమెరికా దురాక్రమణకు మేం భయపడబోం' అని తెలిపారు. చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

**చైనా డీల్ నుంచి వెనక్కి..**

మరోవైపు చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి తాము వెదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ చేరేందుకు 2017లో చైనాతో చేసుకున్న ఒప్పందాన్ని తాము పునరుద్ధరించబోమని ఆయన వెల్లడించారు. పనామా కాలువను 1914లో అమెరికా నిర్మించింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు 1999 డిసెంబరులో దీన్ని పనామాకు ఇచ్చేసింది. అయితే, అమెరికా వాణిజ్య, నావికాదళ నౌకల నుంచి పనామా దేశం భారీగా ఫీజులు వసూలు చేస్తోందని.. వీటిని తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేశారు. లేదంటే ఆ కాలువను తిరిగి వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రాజుకుంది.

# ఎమ్మెల్సీ సీట్లకు 27న పోలింగ్

>> కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజా అధికారికంగా ఈ స్థానాన్ని సాధించేందుకు కూటమి పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన అనేక మంది మద్దతుదారుల నుంచి రాయలసీమలో బలమైన స్థానం పొందేందుకు సన్నద్ధంగా ఉన్నారు. పిడిఎఫ్ పక్షం నుంచి ఎంపికైన అభ్యర్థి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఉన్నారు. ఆయన గతంలో కూడా పలు సంక్షేమ కార్యక్రమాలలో ప్రాథమికంగా వ్యవహరించారు. ఈసారి ఆయన తమ పార్టీ ప్రాథమిక అంశాలను ముందుంచి ప్రచారం చేస్తున్నారు.



# వెయిట్ లిఫ్టర్ సత్యజ్యోతికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ ఫిబ్రవరి 03 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన 38వ జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ఎపి క్రీడాకారిణి విజయనగరానికి చెందిన టి.సత్య జ్యోతి ప్రతిభ కనబర్చడం పట్ల సిఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయాలు రాష్ట్రానికి గర్వకారణమన్నారు. క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ఆమెను అభినందించారు. శాప్ చైర్మన్ రవినాయుడు ఆమెకు అభినందనలు తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ 87 కేజీల మహిళా విభాగంలో బ్రాంజ్ మెడల్ విజయవనగరానికి చెందిన టి.సత్య జ్యోతి సాధించింది. క్రీడాకారిణి ఫోన్ ద్వారా శాప్ చైర్మన్ రవినాయుడు అభినందనలు తెలిపారు. ఆమెకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకరిస్తామని హామీఇచ్చారు. సత్యజ్యోతి విజయంరాష్ట్రంలోని క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు.

## వారం - వర్జ్యం

తేది : 04-02-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
సప్తమి రా.2.31
అశ్వని రా.9.49
వర్జ్యం : సా.6.54-8.25
దు.ము.9.04-9.50, 2) రా.10.46-11.32
శుభసమయం : ఉ.8.00-8.30,
సా.7.50-8.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు నిలకడగా ఉండవు. ధనవ్యయం పెరుగుతుంది. ప్రయాణాలు.

**వృషభం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం. వాహనయోగం.

**మిథునం:** ప్రయాణాలు లాభసాటిగా ఉంటాయి. శుభవార్తలు వింటారు. సోదరులను కలుస్తారు.

**కర్కాటకం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**సింహం:** గృహనిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. నూతన వస్తు, వస్త్రాలాభాలు పొందుతారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**తుల :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. దైవ దర్శనాలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** ఖర్చులు అధికమవుతాయి. మిత్రులను కలిసి కష్టసుఖాలు పంచుకొంటారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకొంటారు. శుభవార్తలు అందుకొంటారు.

**మకరం:** అనారోగ్యం. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చిక్కులు పెడతాయి. బంధువుల నుండి సాయం అందుతుంది.

**కుంభం:** రుణాలు చేస్తారు. ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. సోదరుల కలిక.

**మీనం :** మిత్రుల నుండి వత్తిడులు ఎదురైన అధిగమిస్తారు. శ్రమ ఎక్కువ. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దృక్పథంతో పరిష్కరించుకోండి

>> వెల్లడించినట్లు తెలుస్తోంది. విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ భేటీలో అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగినా కొన్ని ముఖ్యమైన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. విభజన చట్టంలోని 9,10 షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. దాదాపు రెండేళ్ల తర్వాత విభజన చట్టంఅమలుపై హోంశాఖ లోతుగా సమీక్షించింది. సమన్వయంతో ఇరు రాష్ట్రాలు సమస్యలు పరిష్కరించుకోవాలని హోంశాఖ సూచించింది. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతలు ప్రాజెక్టులకు మద్దతు ఉంటుందని తెలిపింది. నిధుల పంపకాల్లో సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉండాలని హోంశాఖ సూచించింది. తమకే ఎక్కువ కావాలని పట్టుబడితే ఇద్దరికీ నష్టం వస్తుందని చెప్పినట్లు సమాచారం. 9,10 షెడ్యూల్‌లోని సంస్థల విషయంలో న్యాయ సలహాలు తీసుకొని ముందుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. విదేశీ సంస్థల నుంచి ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న అప్పుల వ్యవహారంలో న్యాయ సలహ ప్రకారం వెళ్లాలని హోం శాఖ కార్యదర్శి సూచించారు.

దీనికి ఇరు రాష్ట్రాలు తమ అడ్వకేట్ జనరల్ నుంచి అభిప్రాయం తీసుకుంటామని చెప్పగా, త్వరగా తీసుకోవాలని హోం కార్యదర్శి చెప్పినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాల ఏజీలు చెప్పే అభిప్రాయానికి అనుగుణంగా తదుపరి భేటీలో ఒక నిర్ణయం తీసుకుందామని వెల్లడించిన హోం శాఖ కార్యదర్శి. విభజన, ఆస్తులు, అప్పుల పంపకాల విషయంలో రెండు రాష్ట్రాలకు హోం కార్యదర్శి కీలక సూచనలు చేసినట్లు సమాచారం. తదుపరి భేటీలో ఒక నిర్ణయం తీసుకుందామని హోంశాఖ కార్యదర్శి చెప్పినట్లు తెలిసింది. 20 సంస్థలకు సంబంధించిన నిధుల పంపకాల్లో ఉన్న సమస్యలపై ఇరువురు సానుకూల దృక్పదంతో ఉండాలని కేంద్ర హోం కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల స్థాయిలోనే అవకాశం ఉన్నంత వరకు పరిష్కారానికి ప్రయత్నం చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వాధినేతతో చర్చించి కొలిక్కి తీసుకురావాలని సూచించారు. ఒకరి అభిప్రాయం మరొకరు కాదని కోర్టుకు వెళితే, కేంద్రంగా తాము ఏమీ చేయలేమని, ఎప్పటికి తేలుతుందో కూడా చెప్పలేని పరిస్థితి రావొచ్చని హోం శాఖ కార్యదర్శి వ్యాఖ్యానించినట్లు సమాచారం. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతుల ప్రాజక్టులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ స్పష్టం చేసినట్లు సమాచారం.

# నిరంతర అభిప్రాయ సేకరణ

>> పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వంటి అంశాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో పాటు పలు మార్గాల్లో నిర్వహించిన సర్వే నివేదికలపై సిఎం సమీక్షించారు. కొన్ని ప్రభుత్వ పథకాల అమలులో అక్కడక్కడా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఫీడ్ బ్యాక్‌పై సమగ్రంగా విచారించి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి పింఛను ఇంటి వద్ద అందడం లేదని ఫిర్యాదు చేసినా, దీపం పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీలో సమస్యలు వచ్చినా, అవినీతి ఉన్నా, ఆసుపత్రిలో సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసినా వాటిపై చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలపై ప్రజల స్పందనలో అసంతృప్తి వ్యక్తం చేసిన సదరు లబ్ధిదారుల వద్దకు వెళ్లి కారణాలు విశ్లేషించాలని సూచించారు. వ్యక్తుల వల్ల గాని, వ్యవస్థలో లోపాల వల్లగాని సమస్య ఉన్నట్లు తేలితే....ప్రతి కాల్‌పై విశ్లేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దాలని..అయితే ఉద్యోగుల నిర్లక్ష్యం, అవినీతి ఉంటే మాత్రం సహించవద్దని సిఎం స్పష్టం చేశారు. గ్యాస్ పంపిణీ విషయంలో ఎక్కడైనా అవినీతి జరిగితే...గ్యాస్ ఏజెన్సీలను బాధ్యులను చేయాలని సిఎం సూచించారు.

**రసాయన ఎరువుల వాడకం, పురుగు మందుల వినియోగం తగ్గించాలి**

రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై సమీక్ష సందర్భంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంపై అధికారులతో సిఎం చర్చించారు. రాష్ట్రంలో పంటల సాగు విషయంలో రైతులను కొత్త సాగు పద్ధతుల వైపు తీసుకువెళ్లాలని సిఎం సూచించారు. తక్కువ పెట్టుబడి. ఎక్కువ లాభాలు సాధించే దిశలో పంటల సాగులో మెళుకువలు పాటించాలన్నారు. టెక్నాలజీ ఉపయోగాలు రైతులకు వివరించి..వారిని ప్రోత్సహించాలన్నారు. ఏపీ పంటలకు ఎంత మొత్తంలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు...వాటి ప్రభావం వంటి అంశాలపై సమాచారం సేకరించాలన్నారు. మితిమీరిన స్థాయిలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించాలన్నారు. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో విపరీతంగా పురుగు మందులు వాడడం వల్ల క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిందని, ఇది ఎంతో ప్రమాదకరం అన్నారు. పురుగు మందులతో పాటు డ్రోన్ల ద్వారా లిక్విడ్ రూపంలో ఎరువులను పిచికారీ చేసే విధానాలను అమలు చేయాలన్నారు. తద్వారా తక్కువ ఎరువులు, పురుగు మందులతో సాగు సాధ్యం అవుతుందని సిఎం అన్నారు. ఈ విధానాల అమలుకు పంటలు, రైతులు, ప్రాంతాల వారీగా సమాచారం సేకరించి..వాటిని డాటా ఎనలటిక్స్ ద్వారా విశ్లేషించి రైతులకు సూచనలు చేయాలని సిఎం అన్నారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్లు ఉదయం 7 గంటలకు పింఛన్లు పంపిణీ మొదలు పెట్టాలన్నారు. ఉదయం 5 గంటలకు, 6 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలు పెట్టాల్సిన అవసరం లేదని సిఎం స్పష్టం చేశారు. ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలుపెట్టి...సాయంత్రం 6 లోగా పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. పింఛను పంపిణీ సక్రమంగా జరగాలన్నదే తన ఆలోచన అన్నారు...ఆ పేరుతో అనవసర నిబంధనలతో ఉద్యోగులను ఇబ్బందిపెట్టాల్సిన అవసరం లేదని సిఎం అన్నారు. ఇదే సమయంలో ఇంటి వద్దనే పింఛను అనే విధానం పక్కాగా అమలు కావాలని సిఎం సూచించారు.

# మరిన్ని నిధులివ్వండి

>> విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సిఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు. పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సిఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే. అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు.

ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు. బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014-19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు. ఈ సమావేశంలో రాష్ట్రం ఆర్థిక స్థితిగతులు. ఎపికి రావాల్సిన పెండింగ్ నిధులపై సిఎం చంద్రబాబు అరవింద్ పనగడియాకు వినతి పత్రం అందించారు.

04-02Pg3exHMNWJQEC.qxd:04-02Pg3exHMNWJQEC.qxd 01/01/01 8:33 AM Page 1



## ఎన్ఆర్ఐ, ఆదిత్యలకు డీమ్డ్ యూనివర్శిటీ హోదాపై విచారణ జరపాలి:

### మంత్రి లోకేష్‌కు పిడిఎస్‌యు రామకృష్ణ వినతి

**విజయవాడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు రాకముందే యూనివర్శిటీ స్థాయి హోదాతో కట్టడాలు, ముఖద్వారాలు నిర్మించి హోదా వచ్చిందంటూ విస్తృత ప్రచారం చేసి విద్యార్థులను ఆకర్షించి వ్యాపారమే లక్ష్యంగా ముందస్తు యాజమాన్య సీట్ల భర్తీకి ప్రయత్నాలు చేస్తున్న ఆగిరిపల్లి లోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల, తూర్పుగోదావరి జిల్లా ఆదిత్య విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరిపించాలని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం రామకృష్ణ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం పంపారు. డీమ్డ్ యూనివర్శిటీగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదన రాష్ట్ర ఉన్నత విద్యామండలికి, మంత్రి నారా లోకేష్‌కు అందినట్లు మా దృష్టికి వచ్చిందని, యూజిసి నుండి ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలకు వచ్చిన తనిఖీ బృందాలను సదరు యాజమాన్యం ప్రలోభాలకు గురిచేసి వారికి అనుకూలంగా రాయించుకున్నట్లు తమకు తెలిసిందని, డీమ్డ్ యూనివర్శిటీ హోదా రాకుండానే ప్రచారం చేసిన యాజమాన్యం ప్రలోభాలతో, డబ్బులతో మేనేజ్ చేసి సమస్య బయటకు రాకుండా తప్పించుకోటానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కోర్సులకున్న డిమాండ్‌ను బట్టి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేసిందే కాకుండా అక్కడ చేరిన విద్యార్థులను ఏదోఒక సబ్జెక్టులో ఒక్క మార్కులో ఉద్దేశ్యపూర్వకంగా ఫెయిల్‌చేసి తిరిగి అధికమొత్తం ఫీజులు కట్టించుకుని పరీక్షలు రాయించి పాస్ చేస్తుండడం వంటి దుర్మార్గపు ఆనవాయితీగా మారిందంటూ ఆరోపణలు సంధించారు. ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఎటువంటి ప్రతిభ లేకపోవడంతో చిరుద్యోగాలు చేసుకుంటున్నారని, ఇటువంటి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూన్న సంస్థలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఎన్ఆర్ఐ కాలేజ్ యాజమాన్యం స్లీపింగ్ పార్టనర్లు విదేశాల్లో వుండగా ఇక్కడి యాజమాన్యం చేస్తున్న వారు విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తు విద్యార్థుల జీవితాలను అగమ్యగోచరం చేస్తుండడంతో సదరు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, కావున తప్పక విచారణ జరిపించాలన్నారు.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక



**నెల్లూరు,ఫిబ్రవరి3 ప్రభాతవార్త-విద్య** సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. గత మూడు రోజులుగా నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న ఆ పార్టీ 27వ మహాసభల్లో చివరిరోజైన సోమవారం సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న శ్రీనివాసరావుకు రెండవ సారి కార్యదర్శి పదవి దక్కింది. అలాగే 14 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులకు కూడా అధినాయకత్వం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. నూతన కార్యదర్శి వర్గ సభ్యుల్లో ఏవి.నాగేశ్వరావు, మూలం రమేష్,వై.వెంకటేశ్వరావు, సిహెచ్.బాబురావు, కే.ప్రభాకర్‌రెడ్డి, డి.రమాదేవి, బి.తులసీదాస , వి.వెంకటేశ్వర్లు, కే.లోకనాథం, కిల్లో సురేంద్ర, కె.సుబ్బరావమ్మ, వి.రాంభూపాల్,వి.ఉమా మహేశ్వరరావు, బి.బలరాంలు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతు తనపై నమ్మకంతో రెండవసారి అవకాశం ఇచ్చినవారికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని, ప్రజా మస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విదానాలను ఎప్పటి కప్పుడు ఎండగడతామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ బేబీ, బివి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# రథసప్తమికి భారీ ఏర్పాట్లు



**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘ మాసం సప్తమితిధి (నేడు)మంగళవారం సూర్య జయంతి(రథసప్తమి) వేడుకలకు తిరుమలకొండ సిద్ధమైంది. అధికారయంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుని జాగ్రత్తలతో అప్రమత్తమయ్యారు. నేడుఒకరోజే ఉదయం నుండి రాత్రి వరకు వరుసగా ఏడు వాహనాలపై ఏడుకొండల స్వామి దర్శనమివ్వనుండటం విశేషం. నేటి ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనంపై శ్రీమన్నారయణుడు విశేష అలంకరణలో వాహనమండపం నుండి బయలుదేరి 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తారు. ఆతరువాత ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్న శేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నాం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నాం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నాం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభ వాహనసేవలు వరుసగా జరుగుతాయి. ఈ వాహనసేవల వీక్షణకు తిరుమలకు తరలివచ్చే 2లక్షలమందికిపైగా భక్తులకు చిన్నపాటి

> **ఉదయం నుంచి రాత్రి వరకు వాహనసేవలు**
>
> **అన్ని ప్రత్యేక దర్శనాలు, సేవలు రద్దు**

అసౌకర్యం కలగకుండా, లోటుపాట్లు తెలియకుండా టిటిడి అధికారయంత్రాంగం స్దిదమైంది. నేడు ఈ ప్రత్యేక ఉత్సవాల కారణంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు.రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ఇప్పటికే టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మణికంఠచందోలు, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ,విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు సమన్వయంతో స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లలోనికి ఉదయం 3గంటల నుండి భక్తులను అనుమతిస్తారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులు సిద్ధమయ్యారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు. అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు.

# తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నికలో కుట్ర

### - కూటమి దాడితో సొమ్మసిల్లిన వైసిపి కార్పొరేటర్



**తిరుపతి,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిమున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఖాళీఅయిన రెండవడిప్యూటీ మేయర్ ఎన్నికలకు కొన్నిగంటల ముందే తిరుపతిలో కూటమి పార్టీల నేతలు కుట్రలు చేశారనే బలమైన ఆరోపణలు వైసిపి నేతలు వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో కార్పొరేటర్ల బలం లేకున్నా కూటమి పార్టీల నేతలు, తిరుపతి ఎంఎల్ఎ అక్రమంగా, బెదిరించి వైసిపి కార్పొరేటర్లను ప్రలోభపెట్టారని ఆరోపించారు. డిప్యూటీమేయర్ ఎన్నిక జరిగే తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సెనెట్‌హాల్‌కు పద్మావతిపురంలోని భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటివద్ద నుండి 28మంది వైసిపి కార్పొరేటర్లు, ఎంపి, ఎంఎల్‌సితో కలసికట్టుగా బయలుదేరిన వాహనాన్ని కూటమిపార్టీల నేతలు అడ్డుకుని దాడికి దిగారు. ఈ దాడిలో వైసిపి మహిళ కార్పొరేటర్ రత్నకుమారి సొమ్మసిల్లిపోయారని వైపిసి నేతలు తెలిపారు. తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యంపై కూడా దాడికిపాల్పడ్డారనేది బలమైన ఆరోపణలు . ఒక్కసారిగా వైసిపి కార్పొరేటర్ల ప్రయాణిస్తున్న బస్సును అడ్డుకుని రాళ్ళతో దాడిచేయడంతో ఏం జరగుతుందనే దిక్కుతోచక ఆందోళనకు గురయ్యారు. కూటమి దాడి బారినుండి తప్పించుకుని గంట ఆలస్యంగా సెనెట్‌హాల్ వద్దకు చేరుకునే సమాయానికి కోరం లేకుండా డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదావేస్తున్నట్లు తిరుపతి జెసి శుభంబన్సల్ తెలిపారు. ఇదిలా ఉండగా గత వారంరోజులుగా తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలో ఎడతెగని ఉత్కంఠత నెలకొంది. కార్పొరేషన్‌లో పటుకోల్పోకూడదని వైసిపి నేతలు కార్పొరేటర్లను కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. చివరకు సోమవారం ఉదయం పద్మావతిపురంనుండి బయలుదేరిన వైసిపి కార్పొరేటర్లను అడుగడుగునా అడ్డుకున్నారని ఆందోళన చెందారు. తొలిసారిగా తిరుపతి మున్సిపాల్టీ నుండి తిరుపతి నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చెంది 2021 ఏప్రిల్‌లో జరిగిన తొలి కౌన్సిల్ ఎన్నికల్లో 50 మంది కార్పొరేటర్లకుగాను అప్పటి అధికారంలో ఉన్న వైసిపి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 22 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లను ఏకగ్రీవం చేసుకున్నారు.మిగిలిన 28 డివిజన్లకు ఎన్నికలు జరగ్గా ఒక డివిజన్‌లో కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదాపడింది.ఇప్పటికీ ఆ డివిజన్ ఎన్నికలు జరగలేదు.

కాగా ఏడాదిన్నర క్రిందట 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతనాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు 48మందిలో ఒక టిడిపి కార్పొరేటర్, మరో 10మంది వైసిపి కార్పొరేటర్లు స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీష, ఉప మేయర్‌గా ఉన్న ముద్రనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్లే. వైసిపికార్పొరేటర్లు కొందరు పార్టీని వీడేందుకు సిద్దంగా ఉన్నా వైసిపికి బలంగా 37మంది కార్పొరేటర్లు ఉన్నారనే విశ్వాసం ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవు తోంది. మొత్తం మీద సోమవారం కోరంలేక వాయిదాపడటంతో మరోసారి ఏంజరగనుందనేది వైసిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

# నలుగురు వైఎస్సార్సీ కార్పొరేటర్లు కిడ్నాపంటూ పుకార్లు

### - తిరుపతి నగరపాలికలో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా - ఆలస్యంగా హాజరైన వైఎస్సార్సీ కార్పొరేటర్లు

**తిరుపతి,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** తొలినుండి ఉద్రిక్తతలు...ఉత్కంఠత మధ్య కొనసాగుతున్న తిరుపతినగరపాలక కౌన్సిల్‌లో రెండవడిప్యూటీ మేయర్ ఎన్నిక వ్యవహారం సోమవారం ఉదయం నిర్దేశిత సమయంలోపు అధికమంది వైసిపి కార్పొరేటర్లు చేరుకోలేకపోవడంతో కోరం లేక వాయిదాపడింది. కౌన్సిల్‌లో ప్రస్తుత మేయర్ డాక్టర్ శిరీషతోబాటు వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి లడ్డూభాస్కర్‌రెడ్డి ,ప్రత్యేక సభ్యులుగా ఉన్న తిరుపతి ఎంపి, ఎంఎల్‌సితో బాటు మరో 22మందివరకు వైసిపి కార్పొరేటర్లు సోమవారం మధ్యాహ్నాం 12.10గంటల వరకు ఎన్నిక జరిగే సెనెట్‌హాల్‌కు చేరుకోలేకపోవడంతో కోరంలేక వీగిపోయింది. దీంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తిరుపతి జెసి శుభంబన్సల్ వాయిదావేస్తున్నట్లు ప్రకటించారు. తిరుపతి నగరపాలకసంస్థకు 2021లో తొలిసారిగా కౌన్సిల్ ఎన్నికలు జరగడం, 50మంది కార్పొరేటర్లకు 48మంది వైసిపి వారే ఎన్నికకావడం తెలిసిందే. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతి ఎంఎల్ఎ అభ్యర్థిగా వైసిపి తరపున రెండవ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పోటీచేయడంతో ఆ పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఎనిమిదినెలల తరువాత రాష్ట్రంలో ఖాళీఅయిన మున్సిపల్ ఛైర్మన్లు, వైస్‌ఛైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నికకు తాజాగా నోటిఫికేషన్ వెలువడటంతో తిరుపతిలో వైసిపి బలంగా ఉన్నా కూటమినేతలు ఆ పదవి కోసం ప్రాకులాడారు.గత నాలు గైదురోజులుగా తిరుపతిలో అనూహ్యనాటకీయ రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉన్న ఏడాదికాలంలో కౌన్సిల్‌లో పూర్తి పట్టుకోల్పోకుండా సత్తా చాటాలనే బలమైన విశ్వాసంతో వైసిపి నేతలు తమ కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నంలో క్యాంపులకు తరలించారు. ఏకంగా విప్ కూడా జారీచేవారు. ఆ పార్టీ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా శేఖర్‌రెడ్డిని ప్రకటించారు. కానీ మరుసటిరోజే అతని నిర్మాణం ఇంటిపై కన్నేసి నిబంధనలుకు విరుద్ధమంటూ పడగొట్టడంతో ఆయన పోటీనుండి బయటకు వచ్చేశారు. దీంతో ఆదివారం సాయంత్రానికి లడ్డూభాస్కర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. కూటమిపార్టీలు మాత్రం తమ అభ్యర్థి ఎవరనేది ప్రకటించలేని పరిస్థితి నెలకొంది. సోమవారం ఉదయం డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా ముందుగానే వైసిపి కార్పొరేటర్లు బయలుదేరిన బస్సును కూటమి నేతలు అడ్డుకుని దాడిచేశారని, దీంతో భయపడిన వైసిపి నేతలు గంట ఆలస్యంగా ఎస్వీయూవద్దకు చేరు కున్నారు. అప్పటికే ఎన్నిక కోసం వైసిపికి చెందిన 20మంది కార్పొరేటర్లు, టిడిపి ఒక కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణతోబాటు జనసేన పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మొత్తం 22మంది హాల్‌లో సిద్దంగా ఉన్నారు. అయితే వీరిలో కూడా 7మంది వరకు కార్పొరేటర్లు కూటమికి మద్దతునిస్తున్నారనేది సమాచారం. ఈ నేపధ్యంలో వైసిపి కార్పొరేటర్లు 26మంది, ఎంపి,ఎంఎల్‌సి కూడా సమయానికి రాకపో వడంతో కోరంలేక ఎన్నిక మంగళవారం ఉదయానికి వాయిదాపడింది.



డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఆలస్యంగా వచ్చి వాయిదాతో వెనుదిరిగిన వైసిపి కార్పొరేటర్లు

# స్టయిపెండ్ పెంచాలని నిరసన దీక్షలు

**గరివిడి (విజయనగరం జిల్లా ) ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నాలుగు పశువైద్య కళాశాలల విద్యార్థులు స్టయిఫండ్ పెంపుదల కోరుతూ వీధికెక్కారు. పుష్కర కాలం పెంచిన స్టయిఫండ్ పైకాన్నే ఇప్పటికీ అదే స్టయిఫండ్‌ని కొనసాగించడం పట్ల విద్యార్థులు పోరుబాట పట్టారు. విద్యార్థులకు చాలీచాలని స్టయిఫండ్ చెల్లిస్తుండటంతో తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు వైద్య శిద్యాలయం పరిధిలో గల గరివిడి, ప్రొద్దూటూరు, గన్నవరం, తిరుపతి పశు ఐవద్య కళాశాలలకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు సోమవారం నుంచి తరగతులు బహిష్కరించి నిరశన దీక్షలకు ఉపక్రమించారు. పశు వైద్య విద్యలో నాలుగేళ్ళు పూర్తయి ఇంటర్న్‌షిప్‌కి వెళ్లే విద్యార్థులకు నెలకు 7240 రూపాయలు స్టయిఫండ్ ప్రభుత్వం చెల్లిస్తుంది. 2013కి ముందు 4,500 చెల్లించే స్టయిఫండ్ 2013లో 7240కి పెంపుదల చేశారు. ప్రస్తుతం 7240 స్టయిఫండ్‌నే చెల్లిస్తున్నారు. పుష్కర కాలంగా స్టయిఫండ్ పెంపుదల జరగకపోవడం దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. ఎబిబిఎస్ విద్యార్థులకు స్టయిఫండ్ చెల్లించే మాదిరిగానే 25 వేలు స్టయిఫండ్ చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎంబిబిఎస్ విద్యార్థులు మాదిరిగానే తాము వైద్య సేవలు అందిస్తున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. అలాగే మేము చెల్లించే ఫీజులు మాత్రం నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని విద్యార్థిలోకం పేర్కొంటూ, తక్షణమే స్టయిఫండ్ పెంపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం నిరసన దీక్షలకు దిగిన విద్యార్థులు చేసిన నినాదాలతో కళాశాల నిరసన దీక్షల శిబిరాల్లో మార్మోగాయి. కాగా గతంలో తాము నిరసన దీక్ష చేపట్టిన సందర్భంలో అప్పటి పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమస్య పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన హామీ మేరకు నిరసన దీక్షలు విరమించామని విద్యార్థులు పేర్కొన్నారు. అయితే ఆయన హామీ నెరవేరలేదని వారు తెలిపారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తమ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్రంలో 1500 మంది పశువైద్య విద్యార్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



నాలుగు కళాశాలకు చెందిన అన్ని బ్యాచ్‌ల 1500పై చిలుకు విద్యార్థులు ఉద్యమం బాట పట్టి తమ నిరసన గళం విప్పడంతో కళాశాలల ప్రాంగణాల్లో వాతావరణం వేడెక్కింది తమ సమస్యలు పరిష్కరించేటంతవరకు నిరాహారదీక్ష విరమించే ప్రశ్నే లేదని విద్యార్థి లోకం స్పష్టం చేసింది. పశువైద్య విద్యార్థులు స్టయిఫండ్ సమస్యతో పాటు ఇతర సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి విద్యార్థుల ఉద్యమానికి తెరదించాల్సిన అవశ్యం ఎంతైనా ఉంది. పశువైద్య విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ దృష్టా ప్రభుత్వం వారి సమస్యలపై దృష్టి సారిస్తుందని విద్యార్థులు గంపెడశతో ఉన్నారు. కాగా ఆయా కళాశాలల అసోసియేట్ డీన్‌లకు విద్యార్థులు స్టైక్ నోటీసులను అందించారు.

# తిరుమల సమాచారం

## వసంతపంచమిన శాస్త్రోక్తంగా వార్షిక విశేషపూజ



**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాత వార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంతపంచమి పర్వదినాన సోమవారం ఉదయం వార్షిక విశేషపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇకపై ప్రతి ఏడాది వసంతపంచమి పర్వదినాన ఈ పూజను సర్కార్(ఏకాంతంగా)టిటిడి నిర్వహించనుంది. గతంలో ప్రతి సోమవారం ఉదయం దేవదేవుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి విశేషపూజ ,స్నపనతిరుమంజనం జరిపించేవారు. ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలని జీయంగార్లు,అర్చకులు, ఆగమపండితుల సూచనలతో ఏడాదికోసారి జరిపించాలని నిర్ణయించారు. ఈ మేరకు తొలిసారిగా ఈ విశేషపూజను శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో సోమవారం ఉదయం వైభవంగా వేదోక్తంగా నిర్వహించారు. ఆలయఅర్చకులు ముందుగా ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామిని వేంచేపుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్థశ కళశావాహనంతో పుణ్యాహవచనం, వివిధ క్రతువులను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ పూజాకార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నడకదారిలో సౌకర్యాలు బావున్నాయి

### - ఆకస్మిక తనిఖీల్లో టిటిడి ఇఒతో భక్తులు




**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** రథసప్తమిపర్వదినానికి ముందుగానే కాలినడకన తిరుమలకు అలిపిరి మార్గంలో నడచివచ్చే భక్తులను సౌకర్యాలపై, వసతులపై టిటిడి ఇఒ జె.శ్యామలరావు పలకరించి ఆరా తీశారు. సోమవారం ఉదయం ఇఒ శ్యామలరావు ఎలాంటి హంగు, ఆర్బాటం లేకుండా సామాన్య భక్తుడిలా నడకదారిలో వచ్చారు. మోకాళ్ళ పర్వతం వద్ద, అలిపిరి గాలిగోపురం ప్రాంతాల్లో ఇఒ భక్తులను పలకరించారు. భక్తులకు నడకమార్గంలో భద్రత, సౌకర్యాలపై విచారణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, అంబులెన్స్ సర్వీస్‌ను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. నడకమార్గంలో పరిశుభ్రతతోబాటు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతపై అభిప్రాయాలు సేకరించారు.

## ఎస్వీసర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.50లక్షలు విరాళం

**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లలో భాగంగా దాతలు అన్ని పథకాలకు విరాళాలందిస్తున్నారు. తాజాగా సోమవారం ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రేణిగుంటకు చెందిన సి.మోహన 50లక్షలు రూపాయలు

విరాళాల చెక్కును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఆమె బ్రిటీష్‌ఛారిటీస్‌లో యుఎన్‌లో పనిచేస్తు న్నారు. దాత విరాళంపై




అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ప్రత్యేకంగా అభినందించారు.

## అన్నప్రసాదాలు రుచికరంగా ఉన్నాయా?

### - భక్తులను పలకరించిన ఇఒ



**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** రథసప్తమి వేడుకలకు అశేషసంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయనే కోణంలో సోమవారం మధ్యాహ్నాం టిటిడి ఇఒ శ్యామలరావు తనిఖీలు చేశారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం చేరుకుని అక్కడ భక్తులతో కలసి అన్నప్రసాదాలు స్వీకరించారు. అంతేగాక ఇప్పుడు ఎలా ఉన్నాయి. రుచికరమేనా...ఇంకా ఎలాంటి మార్పుచేయాలా అని అభిప్రాయాలు సేకరించారు. పలువురు భక్తులు గతంకంటే ఇప్పుడు నాణ్యత,రుచికరంగా ఉందని తెలిపారు.

## ప్రయాగ్‌రాజ్‌లో వేడుకగా ప్రత్యేక ఊంజల్‌సేవ



**తిరుమల,ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరప్రదేశ్‌ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభేళాలో భాగంగా వసంతపంచమిన సోమవారం ఉదయం ప్రత్యేక ఊంజల్‌సేవ నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లోని శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం మలయప్పస్వామిని సరస్వతిదేవి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అన్నమాచార్యప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ఊంజల్‌సేవను తిలకించి భక్తితో పరవశించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ శివప్రసాద్, హెచ్‌డిపిపి అదనపు కార్యదర్శి రామ్‌గోపాల్, ఎఇఒ రవి తదితరులు పాల్గొన్నారు.

# వందశాతానికి చేరువలో రైల్వే విద్యుదీకరణ

### - గుంతకల్లులో విద్యుదీకరణ వందేళ్ల వసంతోత్సవం

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త** భారతీయ రైల్వే భవిష్యత్తు విద్యుత్ రంగానిదేనని వక్తలు పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ రానున్న కొద్దిరోజుల్లో వంద శాతానికి చేరుకుంటుందని వారు తెలిపారు. భారతీయ రైల్వేలో విద్యుదీకరణ ప్రారంభమై వందేళ్లైన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో రైల్వే విద్యుదీకరణ వందేళ్ల వసంతోత్సవం వేడుకలు ఆనందోత్సహాలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ రైల్వే ప్రాంతాల మీదుగా జంక్షన్ ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్,సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ డిఈఈలు సుదర్శన్‌రెడ్డి,యల్లయ్య,సీనియర్ డిఎంఈ మంగాచార్యులు,డిఈఈ ఆర్ నాగేశ్వరరావు,మధుసూదనరావు,మురళీధర్ తదితరులు మాట్లాడుతూ భారతావనిలో రైల్వే విద్యుదీకరణ ప్రస్థానం ప్రప్రథమంగా తొలి విద్యుత్ రైలు 1924ఫిబ్రవరి 3న బొంబాయి వీటి-కుర్లా స్టేషన్ల మధ్య ప్రారంభమైందన్నారు. నాడు 16కి.మీలతో ప్రారంభమైన రైల్వే విద్యుదీకరణ ప్రయాణం నేడు దేశవ్యాప్తంగా విస్తరించిదన్నారు.




రైల్వే విద్యుదీకరణ వంద వసంతాల వేడుకల దృశ్యం

వినడంలో మనిషి తొందర పడాలి. కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.

-జేమ్స్ జ్యాడిత్

# అక్రమ వలసదారుల కట్టడికిది తగునా?

అక్రమ వలసదారులను 'గ్వాంటానామో బే'కి తరలించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సిద్ధమైనట్లే ఉంది. కాదు..కాదు..ఆయన స్పష్టంగానే చెప్పారు. ఆ మేరకు ప్రెసిడెన్షియల్ మెమోరండంపై సంతకం కూడా చేసేయడంతో ప్రపంచమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది.30 వేలమందిసామర్థ్యమున్న గ్వాంటానామో బేలో ఇప్పటివరకు ఉగ్రవాదులను మాత్రమే నిర్బంధించేవారు. అది భూతల నరకమని పెద్దగా చెప్పుకోనక్కరలేదు. ముందస్తు హెచ్చరికలున్నాఅక్రమ వలసదారులు పట్టించుకోవడం లేదని అభియోగాలుండబట్టే ట్రంప్ ఇలాంటినిర్ణయాని కొచ్చేశారు.తాజాగా అక్రమ వలసదారులను ఆయా దేశాలు కట్టడి చేస్తాయనేనమ్మకం లేకనే, విధి లేక ఇలా వ్యవహరించ తప్పలేదని ట్రంప్ చెప్పకనే చెప్పారు. వీసా గడువు ముగిసినా ఏడు వేల మంది భారతీయులు ఇంకా అమెరికాలోనే ఉన్నారని అమెరికా కాంగ్రెస్ ఏర్పాటు చేసినకమిటీ దృష్టికి సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ జెస్సికా. ఎం.వాఘన్ తీసుకువెళ్లారు. వీరంతా స్టూడెంట్(ఎఫ్-1, ఎం-1) వీసాలు, ఎక్స్చేంజ్ విజిటర్ వీసా(జే వీసా)లపై అమెరికాకు వచ్చారని, 2023లో వీరి వీసాల గడువు ముగిసిందని స్పష్టం చేశారు. విద్యార్థి, ఎక్స్చేంజ్ వీసాలపై అమెరికాకు వస్తున్న చాలా మంది వీసాలగడువు 2023లోనే ముగిసినా అమెరికాలో అక్రమంగా ఉంటున్నారు. వారిలో 7 వేల మంది, భారతీయులే. వీరిలో2 వేల మంది విద్యార్థులున్నట్లు లెక్కలు తేల్చారు. బ్రెజిల్, చైనా,కొలంబియా, భారత్ నుంచి రెండేసి వేల మందికి పైగా విద్యార్థులు గడువు ముగిసినా అమెరికాలోనే నివసిస్తున్నట్లు కాంగ్రెస్ దృష్టికి తీసుకువచ్చారు. 32 దేశాలకు చెందిన విద్యార్థులు, ఎక్స్చేంజ్ విజిటర్లలో 20 శాతానికి పైగా వీసా గడువు దాటినా అమెరికాను వదిలి పెట్టడంలేదు. ప్రధానంగా ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు తీసుకున్నవారే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని వాఘన్ అభియోగం. కాగాహెచ్-1 వీసాలను అమెరికా విశ్వ విద్యాలయాల్లో పూర్తి కాలపు కోర్సులు చేసేవారు, స్కూళ్లు,కాలేజీల్లో చదువుకునే వారికి జారీ చేస్తారు. వృత్తివిద్య, నాన్-అకడమిక్ ప్రోగాములు చదివేవారికి ఎం1 వీసాలను అందజేస్తారు. వీసాల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో వ్యవస్థలో, చట్టాల్లో ప్రక్షాళన అవసరమని వాఘాన్ అభిప్రాయపడితే మంచిదే .కాదనలేం. వీసా గడువు ముగిశాక మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న వారిని సైతం కూడా గుర్తించి, వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్ఫోర్స్మెంట్ ను బలోపేతం చేయాలని ఆఘ మేఘాలపై నిర్ణయించేయడం ఒక్కటే భారతీయ విద్యార్థుల్ని ఇబ్బందిపెడుతోంది.ఇందుకోసం కాంగ్రెస్ చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. ఈలోగానే ట్రంప్ దూకుడు. ఇప్పటికే కొలంబియా వంటి దేశాలు తమ విద్యార్థులను వెనక్కి రప్పించేసుకుంటున్నాయి. ప్రతి విద్యార్థి చదువు పూర్తవ్వగానే వారి సొంత దేశాలకు వెళ్లేందుకు సిద్ధపడాలి'.కానీ వారి ఆలోచనలు ఎలా లేవు. ఒకసారి వెళితే ఏదో ఓ మిష మీద ' అక్కడే ఉండాలనుకోవడం,అది అమెరికన్ల ఉపాధిని దెబ్బ తీస్తోందనే ఆలోచన చేయబట్టి తాజా విధానాలకుపురికొల్పాయి. అమెరికాలో వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీ ఇకపై మరింత కఠినతరం చేస్తారు. "రీసెర్చ్, నాన్ ప్రాఫిట్ వంటివీసాలు అపరిమితంగా ఉండకూడదు.వాటి సంఖ్యను 75 వేల లోపునకు కుదించాలి. ఒకవేళ వీసా సబ్స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే అధికంగా వేతనాలు చెల్లించే సంస్థలకు ప్రాధాన్యమివ్వాలి.హెచ్-1బీ గడువును రెండేళ్లకు నిర్ణయించాలి. అవసరాన్ని బట్టి మాత్రమే నాలుగేళ్లకు పొడిగించే వెసులుబాటు ఉండాలి. గ్రీన్ కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే ఆటోమేటిక్‌గా పొడిగించే హెచ్-1బీ విధానం ఉండరాదు. ఇవన్నీ వాఘన్ సిఫార్సులుకూడా. స్టెమ్ కోర్సులు చేసిన అమెరికన్లలో ఆరింట ఒక వంతు మంది అంటే 20లక్షలమంది ఎలాంటి ఉద్యోగాలు చేయడం లేదని తేలింది. అందుబాటులో ఉన్న మానవ వనరులను వినియోగించుకునేందుకు వీసా విధానాలను ప్రక్షాళన చేయడం ఒక్కటే వారి ముందున్న ఏకైక మార్గం. అమెరికా ప్రభుత్వం ఇటీవల హెచ్1బీ వీసా వ్యవస్థలో తెచ్చిన మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని పరిశీలకులు అంటున్నారు. వీసా వ్యవస్థలో పారదర్శకత పెంపొందించేందుకు తెచ్చిన ఈ మార్పుల కారణంగా హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్ల సంఖ్య గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ మారు అమెరికా వీసా కొత్త నిబంధనల వచ్చాక హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్ల సంఖ్యలో ఈసారి ఏకంగా 38శాతం తగ్గుదల నమోద్పైంది. మునుపటి నిబంధనల ప్రకారం, ఒక్కోలబ్ధిదారుడి కోసం పలు కంపెనీలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఈ విధానమే లబ్ధిదారులకు వీసా వచ్చే అవకాశాలను గణనీయంగా పెంచింది. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం రిజిస్ట్రేషన్కు సంబంధించి కీలక మార్పు చేసింది. ఒక లబ్ధిదారుడిపై ఒకే రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతిస్తామని పేర్కొంది.అమెరికాలో ఇటీవల విడుదలైన ఓపెన్ డోర్ నివేదికలో అక్కడ మొత్తం11.26లక్షల మంది విదేశీ విద్యార్థులు ఉండగా అందులో భారతీయులే 3.30లక్షల మంది ఉన్నారు.వీరిని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధి కారులు జరుపుతున్న తనిఖీలు వీరికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తోంది.అంతకన్నా కూడా ఏమీ చేయలేని పరిస్థితి. అమెరికా ఇమ్మిగ్రేషన్ విధానంలో కీలక సంస్క రణల దిశగా అడుగులు పడుతున్నాయి.వలసదారులు ప్రశాంత వాతావరణంలో తిరిగి వెనక్కిపంపడం అమెరికా కు శ్రేయస్కరం. వివిధదేశాలతో సంబంధ బాంధవ్యాలను నెరపుకోవడానికి

గెలుపునకు తుది ఉండదు. ఓటమి ఎన్నటికీ అపాయకారి కాదు. కావలసినదంతా ధైర్యమే.



మెక్ డొనాల్డ్

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులు అవుతారు.



రాధాకృష్ణన్

# గూఢచారి కార్యకలాపాలతో పెరిగిన ఉద్రిక్తతలు

**ప్రపంచ వ్యాప్తంగా గూఢచారి సంస్థలు ఆ చట్టాలను పాటించకుండా రహస్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇవన్నీ భద్రతా వ్యూహంలో భాగమేనన్న వాదనను అనేక దేశాలు సమర్థిస్తున్నాయి. అయితే, ఇలాంటి చర్యలు నైతికంగా సమంజసమేనా? అనే ప్రశ్న ఎప్పటికీ చర్చనీయాంశంగా ఉంటుంది. భారతదేశం తన శత్రువులను ఎదుర్కోవడానికి ఈ వ్యూహాన్ని అనుసరించడం తప్పుకాదని కొంతమంది చెపుతున్నారు. ప్రపంచ దేశాలు తమ భద్రతా ప్రయోజనాల కోసం ఇలాంటి చర్యలు చేపడుతున్నప్పుడు, భారత్ మాత్రమే వెనుకబడి ఉండడం అనుచితమే అని వారి వాదన. దేశ భద్రతకోసం అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం అనివార్యం. కానీ,వాటిని ఎంత వరకు న్యాయసమ్మతంగా, వ్యూహాత్మకంగా అమలు చేస్తామన్నది రాజకీయ నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది.**

ఎం కె. కుమార్

కెనడా, భారత్ సంబంధాలు ఇటీవల తీవ్ర ఉద్రిక్తతలకు లోనయ్యాయి. కెనడా ప్రభుత్వం భారత హోం శాఖ మంత్రి అమిత్ షాపై సిక్కు ఖలీస్థాన్ నాయకులను లక్ష్యంగా చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించింది. ఈ ఆరోపణలు, 2023లో సిక్కు ఖలీస్థాన్ నాయకుడు సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించిన దర్యాప్తు నేపథ్యంలో వచ్చాయి. భారత ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది. ఈ పరిణామాలు ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. 2023 జూన్‌లో, బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లోని సుర్రే నగరంలోని గురుద్వారా వద్ద హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురయ్యాడు. నిజ్జర్ ఖలిస్థాన్ ఉద్యమానికి మద్దతు పలుకుతూ, భారత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ హత్య కెనడాలో భారత ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలకు దారితీసింది. కెనడా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తులో భారత గూఢచార సంస్థలు కెనడాలో నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని తేల్చాయి. వీటిలో హత్యలు, బెదిరింపులు,మాఫియా తరహా వత్తిళ్లు ఉన్నాయని చెప్తున్నారు. కెనడా అధికారులు ఈ కార్యకలాపాల వెనుక భారత గూఢచార సంస్థల హస్తంఉందని అంటున్నారు.2024 అక్టోబర్‌లో కెనడా ఉప విదేశాంగ మంత్రి డేవిడ్ మోరిసన్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ,హత్యాకుట్రలకు సంబంధించి ఉన్నతస్థాయి భారతీయ అధికారుల ప్రమేయం ఉందని చెప్పారు. అమిత్ షా కూడా ఇందులో భాగమని ధృవీకరించారు. అయితే,ఈ ఆరోపణల వెనుక ఉన్న ఆధారాలను మాత్రం పూర్తిగా వెల్లడించలేదు. భారత ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండిస్తూ, అవి నిరాధార ఆరోపణలని, రాజకీయ ప్రయోజనాల కోసం గూఢచార కుట్రలని పేర్కొంది. కెనడా ప్రభుత్వం ఆరుమంది భారతీయ దౌత్యవేత్తలను దేశం విడిచిపెట్టాలని ఆదేశించింది. ప్రతిస్పందనగా భారత్ కూడా ఆరు మంది కెనడియన్ దౌత్యవేత్తలను భారత్‌నుంచి పంపించింది. ఈ ఆరోపణలు కేవలం కెనడా భారత్ మధ్యే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రభావం చూపాయి. అమెరికా ప్రభుత్వం కూడా ఇదే తరహా ఆరోపణలను బయటపెట్టింది. అక్టోబర్ 2024లో, న్యూయార్క్‌లో నివసిస్తున్న మరో సిక్కు ఖలీస్థాన్ ఉద్యమ నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నున్‌ను హత్య చేసేందుకు భారతీయ గూఢచారి వికాస్ యాదవ్ కుట్ర పన్నినట్లు అమెరికాన్యాయ శాఖ వెల్లడించింది. ఖలిస్థాన్ ఉద్యమం 1980-90లలో ఉద్యమ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారింది. భారత ప్రభుత్వం దీన్ని జాతీయ భద్రతకు అతిపెద్ద ముప్పుగా పరిగణిస్తోంది. విదేశాల్లో సిక్కు ఖలీస్థాన్ ఉద్యమానికి మద్దతుగా ఉన్న కొన్ని వర్గాలను భారతదేశం శత్రువులుగా చూస్తోంది. భారతదేశం ఇలాంటి కార్యకలాపాలు చేస్తుందనే ఆరోపణలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. ఒక దేశ ప్రభుత్వం మరో దేశ భూభాగంలో నేరపూరిత చర్యలకు పాల్పడకూడదు. ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించ చట్టపరంగా చాలా తీవ్రమైన విషయం. ఈ రాజకీయ సంక్షోభం భారత్, కెనడా మధ్య సంబంధాలను మరింత బలహీనపరిచింది. ఇరుదేశాలు సంయమనంతో వ్యవహరించాలి. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి, ఇరు దేశాల న్యాయవ్యవస్థల మధ్య సహకారం అవసరం. ఇది కేవలం భారత్, కెనడా మధ్య ద్వైపాక్షిక వివాదంగా మాత్రమే కాలేదు. ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసే అంశంగా మారుతోంది. భారత గూఢచారి సంస్థలు




విదేశాల్లో నివసిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసేందుకు గతంలో చర్యలు చేపట్టాయా? ఈ ప్రశ్నకు సంబంధించి కొన్ని ఆరోపణలు, నివేదికలున్నాయి. అయితే స్పష్టమైన ఆధారాలు లేవు. 2020 నుండి పాకిస్థాన్‌లో జరిగిన 20 హత్యల్లో భారత గూఢచారి సంస్థ 'రా' ప్రమేయం ఉందని 'ది గార్డియన్' పత్రిక నివేదించింది. ఈ హత్యలు విదేశాల్లో నివసిస్తున్న ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకోవడం అనే విధానంలో భాగంగా జరిగాయని పేర్కొంది. ఈ సంఘటనలపై వివిధ ఆరోపణలున్నాయి. భారత గూఢచారి సంస్థలు విదేశాల్లో నివసిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసేందుకు చర్యలు చేపట్టాయా అనే విషయంపై స్పష్టమైన, ధృవీకరించిన ఆధారాలు లభ్యంకాలేదు. అంతర్జాతీయ సంబంధాలు, గూఢచారి కార్యకలాపాల స్వభావం కారణంగా, ఇలాంటి ఆరోపణలను నిర్ధారించడం కష్టసాధ్యం. అమెరికా, నాటో దేశాల గూఢచారి సంస్థలు విదేశాల్లో తమ శత్రువులను లక్ష్యంగా చేసేందుకు చర్యలు చేపట్టిన ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఈ చర్యలు సాధారణంగా తీవ్రవాద నేతలను లేదా తమ దేశాల భద్రతకు ముప్పుగా భావించిన వ్యక్తులను లక్ష్యంగా చేసేవి. అమెరికా గూఢచారి సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సిఐఏ ) విదేశాల్లో అనేక హత్యా చర్యలను నిర్వహించినట్లు నివేదికలు ఉన్నాయి. 2011లో పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో అల్‌ఖైదా నేత ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా నేవీ సీల్‌లు హతమార్చారు. ఈ ఆపరేషన్‌ను సిఐఏ సమన్వయం చేసింది. 2011లో యెమెన్‌లో అమెరికా డ్రోన్ దాడిలో అన్వర్ అల్‌అవ్లాకీ అనే అమెరికా పౌరుడు, అల్‌ఖైదా నేత హతమయ్యాడు.అవ్లాకీపై అమెరికా భూభాగంలో దాడులు ప్రేరేపించాడని ఆరోపణలు ఉన్నాయి. నాటో సభ్య దేశాలు కూడా తమ గూఢచారి సంస్థల ద్వారా విదేశాల్లో లక్ష్యాలను హతమార్చిన ఉదాహరణలు ఉన్నాయి. టర్కీ గూఢచారి సంస్థలు గ్రే వోల్వ్స్ అనే తీవ్రవాద గ్రూప్‌తో సంబంధాలు కలిగి, విదేశాల్లో రాజకీయ హత్యల్లో పాల్గొన్నట్లు నివేదికలున్నాయి. మార్టిన్ ఎలీ అనే మేధావి తన పరిశోధనలో టర్కీ "లోతైన రాష్ట్రం" గురించి వివరించారు. ఈ ఉదాహరణలు గూఢచారి సంస్థలు తమ దేశాల భద్రతా ప్రయోజనాల కోసం విదేశాల్లో లక్ష్యాలను ఎలా నిర్వహిస్తాయో చూపిస్తాయి. అయితే, ఇలాంటి ఆపరేషన్లు అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే ప్రమాదం ఉంది, కాబట్టి ఇవి వివాదాస్పదంగా ఉంటాయి. ప్రపంచరాజకీయాల్లో దేశాలు తమ భద్రతా ప్రయోజనాలను కాపాడుకునేందుకు గూఢచారి కార్యకలాపాలను నిర్వహించడం సాధారణమే. అమెరికా, రష్యా, ఇజ్రాయెల్, చైనా వంటి శక్తివంతమైన దేశాలు విదేశాల్లో నివసిస్తున్న తమ శత్రువులను హత్యచేయడానికి గూఢచారి ఆపరేషన్లను నడిపినట్లు అనేక ఆరోపణలున్నాయి. అలాంటి సందర్భంలో భారతదేశం తన జాతీయ భద్రత కోసం ఇదే వ్యూహాన్ని అనుసరించడం తప్పేనా? అమెరికా గూఢచారి సంస్థ సిఐఏ అనేక అంతర్జాతీయ హత్యా కుట్రలకు పాల్పడినట్లు అనేక నివేదికలు సూచిస్తున్నాయి. రష్యా కూడా తన రాజకీయ శత్రువులను లక్ష్యంగా చేసుకుని విదేశాల్లో హత్యలకు పాల్పడినట్లు అనేక సందర్భాలు ఉన్నాయి, ముఖ్యంగా 2006లో యుకెలో జరిగిన అలెగ్జాండర్ లిట్వినెంకో విష ప్రయోగ హత్య ఒక ఉదాహరణ. ఈ దేశాలు తమ భద్రతను సమర్థించుకోవడానికి విదేశాల్లో నివసిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటుంటే, భారతదేశం కూడా అదే విధంగా వ్యవహరించడంలో తప్పేముంది? ఇటీవల భారత గూఢచారి సంస్థలు కెనడా, అమెరికా, పాకిస్థాన్ వంటి దేశాల్లో హత్యా కుట్రలు చేస్తున్నాయనే ఆరోపణలువచ్చాయి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, ఒక దేశం మరొకదేశ భూభాగంలో హత్యాచర్యలు చేపట్టడం అక్రమం. కానీ, ప్రపంచ వ్యాప్తంగా గూఢచారి సంస్థలు ఆ చట్టాలను పాటించకుండా రహస్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇవన్నీ భద్రతా వ్యూహంలో భాగమేనన్న వాదనను అనేక దేశాలు సమర్థిస్తున్నాయి. అయితే, ఇలాంటి చర్యలు నైతికంగా సమంజసమేనా? అనే ప్రశ్న ఎప్పటికీ చర్చనీయాంశంగా ఉంటుంది. భారతదేశం తన శత్రువులను ఎదుర్కోవడానికి ఈ వ్యూహాన్ని అనుసరించడం తప్పుకాదని కొంతమంది చెపుతున్నారు. ప్రపంచ దేశాలు తమ భద్రతా ప్రయోజనాల కోసం ఇలాంటి చర్యలు చేపడుతున్నప్పుడు, భారత్ మాత్రమే వెనుకబడి ఉండడం అనుచితమే అని వారి వాదన. దేశ భద్రతకోసం అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం అనివార్యం. కానీ,వాటిని ఎంత వరకు న్యాయసమ్మతంగా, వ్యూహాత్మకంగా అమలు చేస్తామన్నది రాజకీయ నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. ●

# కొంత మిత్రధర్మం..మరికొంత రాజకీయ కోణం!

ఫిజిక్స్ అరుణ్ కుమార్

ఆలోచనల్లో లక్ష్యాల దార్శనికతను జోడించి, అంకెల్లో 50లక్షల కోట్లకు పైగా చూపిస్తూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మనదేశం గురించి గురజాడ వారి మాటలతో "దేశమంటే మట్టి కాదోయ్/దేశమంటే మనుషులోయ్ అంటూ 2047 వందేళ్ల స్వాతంత్ర్య భారత్ ముఖ చిత్రాన్ని ఆశావాదపు దృక్పథంతో ఆవిష్కరించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 వార్షిక బడ్జెట్ సాక్షిగా పేదలు,యువత, రైతులు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యతను చూపిస్తూ వారి ప్రసంగం కొనసాగింది. ప్రపంచం నేడు మా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి చర్చిస్తుందంటూనే, 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మధ్యతరగతి కుటుంబాలకు వార్షిక ఆదాయపు పన్ను 12 లక్షల వరకు మినహాయింపు కల్పించటం ఊరట కలిగించే విషయం. సుస్థిరాభివృద్ధిని కొనసాగించేందుకు నిర్మాణాత్మక సంస్కరణలు తప్పవంటూ,సున్నాశాతం పేదరికం వుండేలా అభివృద్ధి భారతాన్ని నిర్మించుకోవాలంటూ మన బాధ్యతను గుర్తు చేశారు. కృత్రిమ మేధ విస్తరణతో చాలా తక్కువ కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో విప్లవాత్మక మార్పులు వస్తాయి. దానికనుగుణంగా మన విధానంలో, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో మనం ముందుండాలి. అందుకే అందరికీ క్వాలిటీ విద్యలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్ బ్యాండ్ సేవలు, డిజిటల్ శిక్షణ, విద్యారంగంలో వినియోగం వంటివి స్వాగతించాల్సిన అంశాలుగా చెప్పుకోవచ్చు. పదేళ్లలో ఐఐటీల్లో విద్యార్థుల సంఖ్య పెంపు, ఐదేళ్లలో అదనంగా 75వేల మెడికల్ సీట్లు, అంగన్వాడీ కేంద్రాలకు కొత్త హంగులు, పరిశోధకులకు ఫెలో షిప్‌లు,5 ఐఐటీల ఏర్పాటు,50వేల ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ తదితర కార్యక్రమాల ప్రతిపాదనలు ఆశావాదపు అవకాశాలుగానే కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆహార కేంద్రంగా భారత్ వుండాలనే సంకల్పంతో వ్యవసాయానికి బడ్జెట్‌లో ప్రముఖ పాత్ర అందించారు. ఆహార భద్రత కోసం జీన్ బ్యాంకు ఏర్పాటు, పీఎం ధన్ ధాన్య కృషియోజన పథకంతో 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి, 3లక్షల నుంచి 5 లక్షలకు కిసాన్ కార్డుల పెంపు, పప్పు ధాన్యాల కోసం 6సంవత్సరాల ప్రణాళిక, పత్తి ఉత్పాదకతను పెంచటం, గ్రామాలన్నింటికీ మంచినీరు తదితర పథకాలతో రైతులకు లాభసాటి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను బడ్జెట్లో ప్రతిపాదించింది. ఎలక్ట్రానిక్ వాహనాలు, మొబైల్ ఫోన్ల వినియోగం పెరిగేలా ధరలు తగ్గించారు.క్యాన్సర్ మందులు,లిథియం బ్యాటరీల ధరల తగ్గుదలతో పాటు,ఉడాన్ పథకం ద్వారా 120 రూట్లలో విమాన ప్రయాణసౌకర్యం, గిగ్‌వర్కర్లకు ఆరోగ్య బీమా, గుర్తింపు కార్డులు, విద్యుత్ రంగంలో సంస్కరణలు, ఎస్సీ ఎస్టీ మహిళల కోసం కొత్త పథకం,పర్యాటక ప్రాంతాల అభివృద్ధి,అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డేకేర్ క్యాన్సర్ సెంటర్‌లు వంటి ఎన్నో వివిధ రంగాల కార్యక్రమాలతో ఆర్థిక మంత్రి బడ్జెట్ అందరినీ ఆకర్షించే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బడ్జెట్ కేటాయింపులో మిత్ర ధర్మం,రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోంది.సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. భారీ పెట్టుబడుల లక్ష్యంతో మూడో ఆర్థిక వ్యవస్థగా,గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా వుంటూ వికసిత భారత్‌గా సుదీర్ఘ ప్రయాణం ఎందాక వెళ్తుందో కాలమే నిర్ణయించాలి.స్క్రిప్ట్ బాగానే వుంది. మరి సినిమా ఎలా వుంటుందో మన భవిష్యత్తు చెప్పాలి. ●

# ప్రజావాక్కు



## ఎమ్మెల్యేలను కట్టడి చేయాలి!

రాష్ట్రంలో పలువురు కూటమి ఎమ్మెల్యేలు హద్దు దాటి ప్రవర్తించడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది! పార్టీ కార్యకర్తలనే కాకుండా అధికారులను, మీడియా వారిని కూడా బెదిరించడం పరిపాటిఅయింది! ముఖ్యంగా ఫిరాయింపుదారులు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు, కొంతమంది ఎన్ఆర్ఐ ఎమ్మెల్యేలు కన్నుమిన్ను కానకుండా ప్రవర్తిస్తున్నారు! మద్యం దుకాణాల వారిని, రియల్ ఎస్టేట్,ఇతరగుత్తేదారులను కమిషన్ల కోసం బెదిరించడం, వారిపై జులుం ప్రదర్శిస్తున్నారు! వాళ్ల ఆయా నియోజక వర్గాలకు సామంత రాజుల్లా దందాలు చేస్తున్నారు! ఈ ధోరణిఇలాగే కొనసాగితే2019పునరావృతం అవుతుంది. ఇప్పటికే చాలామంది కార్యకర్తలు నిరాశనిస్పృహలకు లోనయ్యారు.కూటమిపెద్దలు పరిస్థితినివెంటనే చక్కదిద్దాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## భక్తులను నియంత్రించాలి

నేడుప్రజలలో భక్తి ఎక్కువఅయింది.హిందువులలో పూజలు తీర్థయాత్రలు చేసే భక్తులసంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇది ఒకందుకు మంచిదే. కానీ నాణ్యానికి మరో వైపు కూడా చూడాలి. ఏది కుడా అతి కాకుంటే మంచిదే. ముఖ్యంగా భక్తిప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలి. ఈ భక్తి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. అంతే కానీ పుణ్య స్నానాలకు పోతే ప్రాణాలు పోయే పరిస్తితి రావడం దురదృష్టకరం. కానీ ఆ ప్రచార మాధ్యమాలు అక్కడ జనతాకిడి గురించి కుడా తెలుపాలి.భక్తులకు అక్కడ పరిస్థితుల పట్ల అవగాహన కల్పించాలి.

- శ్రిష్టి శేషగిరి, సికిందరాబాద్

## స్వదేశీ ఉత్పత్తులను పెంచాలి

భారత్ నేడు అయిదు వేలకోట్ల డాలర్లవిలువ చేసే కంప్యూటర్లు, మొబైల్‌ఫోన్లు, టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలను దిగుమతి చేసుకుంటోంది. ప్రతీఏడాది ఈ దిగుమతులలో 1శాతం వృద్ధిరేటు వుంటుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. దీనికి బదులుగా మన దేశంలోనే ఎలక్ట్రానిక్స్ రంగంలోవిస్తారంగా పరిశోధనలను ప్రోత్సహించి కనీసం వచ్చే అయిదేళ్ల నాటికైనా ఈ ఎలక్ట్రానిక్స్ పరికరాలను స్వదేశంలోనే ఉత్పత్తి చేయగలిగే విధంగా ప్రభుత్వం తగిన ప్రణాళికలను అమలు చేయాలి.

-సి.హెచ్.ప్రతాప్,కోటి వీధి, శ్రీకాకుళం

## అప్పుల ఊబిలో రాష్ట్రం

కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు చేసిన అప్పు ఒక కోటి యాభై లక్షలకోట్లని కొన్నిగణాంకాలు చెబుతున్నాయి.రాష్ట్రాలు తక్కువ చేసాయా అంటే లేదనేచెప్పాలి ధనికరాష్ట్రంగా చెప్పబడుతున్న తెలంగాణరాష్ట్రం అప్పుఎనిమిది లక్షలకోట్లట.విభజన తరువాత అతి బీద రాష్ట్ర మయిన ఆంధ్రప్రదేశ్ అప్పులు దాదాపు పద్నాలుగులక్షల కోట్లట.ఈ అప్పులిచ్చిన రిజర్వుబ్యాంకుకు నెలనెలా వడ్డీలే కట్టుకుంటూపోతే అసలు తీరేదెప్పుడు? ఎప్పటికీ తీరదు కాక తీరదు. ఆర్థికంగా అధమ స్థితిలో నున్న రాష్ట్రాన్ని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు దేశంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకెళ్లడానికి అధికంగాశ్రమపడుతున్నారు. ఇతర రాష్ట్రాలుకూడా అప్పులఊబిలో కూరుకుపోయాయని తెలుస్తోంది.ఈ అప్పులముప్పు నుంచి తప్పించు కోవాలంటే ప్రథమంగా ఉచితాలను ఉపసంహరించి ఉపాధి మార్గాలను చూపాలి.

-ఎన్. రామలక్ష్మి ,సికింద్రాబాద్

## కుంభమేళాలో తొక్కిసలాట విషాదకరం

మహా కుంభమేళాలో తెల్లవారు జామున భక్తులు పోటెత్తడంతో జరిగిన తొక్కి సలాటలో దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోగా60మందికి పైగా గాయపడడం అత్యంతవిషాదకరం. మౌని అమావాస్య నాడు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయనేది భక్తుల విశ్వాసం.ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందనే నమ్మకంతో బుధవారం కుంభమేళాకు భక్తులు పోటెత్తారనీ తెలుస్తుంది. త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ వద్దపుణ్యస్నానాలు చేసేందుకు వెళ్లగా కొందరు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడం దాంతో అవి విరిగిపోయాయి. ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకోవడంవల్ల పరిస్థితి చేయి దాటిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

-కామిడి సతీశ్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

## అనాథులవుతున్న తల్లిదండ్రులు

నేడు మానవుని మనసులో మార్పులొచ్చి, మనవ సంబంధాల స్థానంలో ఆర్థికసంబంధాలు రావడంతో కన్నవారిని గౌరవించడం క్రమంగా తగ్గిపోయింది.పెద్దలకు గౌరవ మర్యాదలు దక్కడంలేదు. పెద్దలంటే గౌరవం,ప్రేమ ఈనాటి పిల్లలకు లేకుండా పోతోంది. డబ్బున్న వాళ్ల వృద్ధాశ్రమంలో చేర్పిస్తే, డబ్బులేని వాళ్ల అనాథాశ్రమంలో వదిలేసి, తమ బాధ్యత తీరిందని భావిస్తున్నారు.కనీసం వాళ్ల మనసు బాధపడకుండా చూసుకోవాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

# తెలంగాణ రైజింగ్ బ్రాండ్ విశ్వవ్యాప్తం



బోరెడ్డి అయోధ్యరెడ్డి

కొంతమంది వ్యక్తులు మాటలకే పరిమితమవుతారు. మరికొంత మంది తమ పనితనాన్ని చేతల్లో చూపిస్తారు. కొంతమంది ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యతనిస్తారు. కానీ పనిమంతులైనవారు ఆచరణలో తమ గొప్పతనాన్ని నిరూపించుకుంటారు. ఈ కోవలోకి వచ్చే అరుదైన వ్యక్తులలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఒకరు. ఈయన రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఒక్కరోజు కూడా విశ్రాంతి తీసుకోకుండా నిరంతర శ్రామికుడిగా పనిచేస్తున్నారు. ప్రజలు తన భుజస్కంధాలపై ఉంచిన అతిపెద్ద బాధ్యతలను వినమ్రంగా స్వీకరించి రాష్ట్రాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలోనూ సర్వతోముఖంగా అభివృద్ధి చేయటానికి దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలవటానికి తీవ్ర కృషి సలుపుతున్నారు. గత ప్రభుత్వం సర్వనాశనం చేసిన అన్ని రంగాలను గాడిలో పెడుతున్నారు. 7లక్షల కోట్ల అప్పులు రాష్ట్రం నెత్తిన పెట్టిపోతే వాటికి అసలు, వడ్డీలు కలిపి చెల్లిస్తున్నారు. మరోవైపు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయటానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దేశ భవిష్యత్తుకు వెన్నెముకగా ఉన్న యువత శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోతే ఆదేశానికి భవిష్యత్ ఉండదు. కనుక యువతకు ఎంత ఎక్కువ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఆ దేశం అంతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా యువతకు ప్రభుత్వాలే పూర్తిస్థాయిలో ఉద్యోగాలు ఇవ్వలేవు. కనుక ప్రైవేట్ రంగంలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు కల్పిస్తేస్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కడంతోపాటు, రాష్ట్రాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. అందుకే, తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం దావోస్లో జరిగిన ప్రపంచఆర్థిక సదస్సులో పాల్గొని రూ.1,82,900కోట్ల పెట్టుబడులను సాధించారు. దావోస్లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలంగాణ రైజింగ్ పేరుతో వెళ్లిన ముఖ్యమంత్రి చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.1,82,900 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలను కుదుర్చుకున్నారు. గత సంవత్సరం దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకోగా ఈసారి అంతకు నాలుగు రెట్లు పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకొనిరికార్డు సృష్టించారు. ఈ పెట్టుబడులు అన్నీ సాకారం అయితే రాష్ట్రంలో 51,400 ఉద్యోగాలు వస్తాయి. ఇది తెలంగాణ యువతకు, విద్యార్థులకు శుభవార్తగా చెప్పవచ్చు. ఇష్టంతో, నమ్మకంతో చేసే ఏపని అయినా విజయం సాధించి తీరు





తుంది. ఎవరికైనా సరే గెలుపు తీరాలకు చేరాలనే తపన ఒక్కటే సరిపోదు. అందుకు తగ్గ కృషిచేయాలి. అప్పుడే అనుకున్నకార్యాన్ని సాధించగలగుతామని ఈ పెట్టు బడుల సాధనతో నిరూపితమైంది. గత ప్రభుత్వంలాతాము ఒప్పందాలు కుదుర్చుకోవడం వరకే తాము పరిమితం కాబోమని, కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ కార్యరూపం దాల్చేవరకు ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని ముఖ్యమంత్రి తెలిపారంటే, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయటానికి ఎంతటి కృతనిశ్చయంతో ఉన్నారో తెలుసుకోవచ్చు. కొన్ని సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. తమకు పక్క రాష్ట్రాలతో కాదు ప్రపంచంతోనే పోటీ అని ముఖ్యమంత్రి చెబుతున్న మాటలు ఈ పెట్టుబడులతో నిరూపించారు. పెట్టుబడుల రాకతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇన్నాళ్లూ ప్రతిపక్షం చేస్తున్నది తప్పుడు ప్రచారమని ప్రజలకు తేటతెల్లమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రాష్ట్రం సర్వనాశనమైందని, పరిపాలనే లేకుండా పోయిందని, రియల్ ఎస్టేట్ పడిపోయిందని, రాష్ట్రంలో ప్రగతి ఆగిపోయిందని ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇన్నాళ్లుబురద జల్లుతూ వచ్చింది. రాష్ట్రంలో పాలన సరిగ్గాలేకపోతే స్థిరమైన ప్రభుత్వం, బలమైన నాయకత్వం లేకపోతే ఈ విధంగా పెట్టుబడులు రావు. పారిశ్రామికవేత్తలకు రాష్ట్రాభివృద్ధిపై భరోసా లేకపోతే కొత్తగా పెట్టుబడులు రాకపోగా, ఉన్న పెట్టుబడిదారులు సైతంరాష్ట్రాన్ని వదిలిపెట్టి పోతారు.రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తుందని ప్రతిపక్షం చేస్తున్నది దుష్ప్రచారమని దీనితో రూఢీ అయింది. రాష్ట్రాన్ని పాలిస్తే తామే పాలించాలని, పెట్టుబడులు తెస్తే తామే తేవాలని, పాలించే అర్హత తమకే ఉన్నదని ఇన్నాళ్లూ బీఆర్ఎస్ ప్రచారం చేసుకున్నది. భారత్లో ఉన్న వెయ్యి విశ్వవిద్యాలయాలు, 40వేలకుపైగా కళాశాలతో మనదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యావ్యవస్థ కలిగి ఉంది. అసోచాం నివేదిక ప్రకారం దేశంలో ఏటా పట్టభద్రులైన 50లక్షల మంది విద్యార్థుల్లో కేవలం 20శాతం మంది మాత్రమే ఉపాధిపొందుతున్నారు. నిరుద్యోగం ఎక్కువైతే సమాజంలో అశాంతి ప్రబలుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కారణంగా రాష్ట్రంలో చదువుకున్న 15-29ఏళ్ల వయసులోఉన్న యువతలో నిరుద్యోగం తగ్గుతున్నట్లు జాతీయ కార్మిక బలగం తన నివేదికలో వెల్లడించింది. ఆరు నెలలుగా ఉద్యోగ అవకాశాలు పెరగడం, ప్రైవేటు రంగంలో అవకాశాలు పెరగడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగినట్లు ఈనివేదిక తెలుపుతున్నది. కనుకనే ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించటానికి పెద్దఎత్తున ప్రైవేట్ పెట్టుబడులనురాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. పెట్టుబడిదారులను ఆకర్షించటానికి తగిన మౌలికవసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నది. ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, మెట్రో విస్తరణను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. కొత్తగా ఏర్పడుతున్న పరిశ్రమలు, విస్తరిస్తున్న జనాభా అవసరాలకోసం రాష్ట్రప్రభుత్వం మరో 20 టీఎంసీల గోదావరి జలాలను రూ.7360 కోట్ల ఖర్చుతో హైదరాబాద్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నది. అదే విధంగా పరిశ్రమల అవసరాల కోసం విద్యుత్ ఉత్పత్తిని పెంచటం కోసం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ 2025ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసింది. ఇందుకోసం సోలార్, విండ్, హైబ్రిడ్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. ●

మన వినతి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి

## -కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వర్షాలు పడిన రోడ్లపైన వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నగరంలో ఎక్కడా కూడ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పొంగకుండా ఎప్పటికప్పుడు ఫీల్డ్ విజిట్‌లు చేస్తూ పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన బెంజసర్కిల్,రామలింగేశ్వరనగర్,నేతాజీ బ్రిడ్జి,ప్రాంతాలను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా చూసుకోవాలని,గ్రాసిటి లీకేజీలను అరికట్టాలని, కల్వర్టర్లను రిపేరు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త సేకరణ సమయానికి చేసుకుంటూ ఉండాలని,పరిస్థితి నిర్మాణంలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. రామలింగేశ్వరం నగర్ లోని ఓవర్ హెడ్‌వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి ఆ ట్యాంక్ నుండి మంచినీరు త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అందుకనుగుణంగా రిపేర్లు సత్వరమే నిర్వహించాలన్నారు. రామలింగేశ్వర నగర్ లోని ఎస్‌టిపిని పరిశీలించి అమృత్ పథకం 2.0 ద్వారా జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నేతాజీబ్రిడ్జి వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను పరిశీలించి, అన్న క్యాంటిన్ నిర్వహణ సక్రమంగా జరగాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, వాడుక నీరు,మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు నిర్వహణ చేసుకుంటూ అధికారులను పర్యవేక్షిస్తుండాలని ఆయన ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ జిజిఎస్‌వి ప్రసాద్,ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ,పి.సత్యకుమారి,అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి,సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ వార్త

# క్రైం సిబ్బందిని నగదు రివార్డులతో అభినందించిన సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన పలు చోరీ కేసుల్లో నిందితులను తక్కువ సమయంలో పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలకపాత్ర పోషించి,విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబర్చిన 10 మంది క్రైం పోలీస్ అధికారులను,సిబ్బందిని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు నగదు రివార్డులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రైం డిసిపి తిరుమలేశ్వరరెడ్డి,క్రైం ఏడిసిపి ఎం.రాజారావు, సిసిఎస్ సిఐ ఎం.రాంకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మాదక ద్రవ్య వినియోగం వ్యక్తులను మాత్రమే కాదు కుటుంబాలను,సమాజాన్ని కూడా నిర్వీర్యం చేస్తుందని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ సమస్యను ఎదుర్కోవడానికి ముందడుగు వేసే లక్ష్యంతో,విజయవాడ లోని పిబి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ పేరుతో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో గంజాయి సాగు జరుగుతోందని, గతంలో 9 వేల ఎకరాల్లో గంజాయిని పండించేవారని, ఈగల్ విభాగం ఏర్పాటైన తర్వాత గంజాయి పంటను ధ్వంసం చేశారన్నారు. ప్రస్తుతం 100 ఎకరాల్లో మాత్రమే సాగు ఉందన్నారు. డ్రోన్స్ ద్వారా గంజాయి సాగు ఎక్కడ జరుగుతుందో గుర్తిస్తున్నామన్నారు. గంజాయి సేవించిన వారికి సైతం ఎన్డీపిఎస్ యాక్ట్ ప్రకారం శిక్ష పడుతుందని, ఒకసారి గంజాయి నేరస్థుల జాబితాలో పేరు నమోదైతే పాస్‌పోర్టు సైతం




రాదని,గంజాయి కోసం చోరీలకు,నేరాలకు పాల్పడుతున్నారన్నారు. విజయవాడలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాల వెనుక గంజాయి ప్రభావం ఉందని, మత్తు పదార్థాలకు అలవాటు పడిన స్నేహితులకు దూరంగా ఉండమని హితవు పలికారు. ఎవరైనా డ్రగ్స్ సేవించాలని మిమ్మల్ని బలవంతం చేస్తే ధైర్యంగా నో అని చెప్పమని, కేవలం చట్ట అమలుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, సమాజం అందరూ కలిసి ముందుకు రావాలన్నారు. యువత మాదక ద్రవ్య రహిత జీవనానికి ఆదర్శంగా నిలవాలన్నారు. సైబర్ నేరాలు,డిజిటల్ అరెస్టుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈగల్ టీం ఐజి రవిక్రిష్ణ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో ఈగల్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్డీపిఎస్ యాక్ట్ కేసుల్లో ఇరుక్కుంటే 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని,రెండు ఎన్డీపిఎస్ కేసుల్లో నిందితులుగా ఉంటే ఎన్డీపిఎస్ చట్టం ప్రకారం కేసు తీవ్రత ఆధారంగా మరణశిక్ష వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులే ఈగల్ అంబాసిడర్లుగా ఉండాలన్నారు. గంజాయి విక్రయాలు,వినియోగాన్ని సమాచారం తెలిస్తే 1972 నెంబర్‌కు కాల్ చేయమని,గంజాయిని కట్టడి చేసేందుకు ఈగల్ విభాగం చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్ళి విలువైన భవిష్యత్తును కోల్పోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్పి కె.నగేష్‌బాబు,సెంట్రల్ ఏసిపి దామోదర్,మాచవరం సిఐ ప్రకాష్,కళాశాల డైరెక్టర్ బాబూరావు,సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# వాయిదా పడిన మునిసిపల్ ఛైర్మన్ ఎన్నిక : ఆర్డీవో బాలకృష్ణ

**నందిగామ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** అనూహ్యా పరిణామాలు మధ్య నందగామ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. నందిగామ మున్సిపాలిటీ గత ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది మొత్తం 20 మంది వార్డు కౌన్సిలర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో వైఖానస పార్టీ బలం 14 అనంతరం పరిణామాల్లో ఛైర్మన్ గా వేజెండ్లలక్ష్మీ వైస్ ఛైర్మన్ గా మాడుగుల నాగరత్నమ్మలను ఎన్నుకోగా వారు ఇరువురు అనారోగ్య కారణాలతో మరణించడం జరిగినది. అయితే వీరిద్దరూ ప్రాదినిత్యం వహించిన 12,1 వార్డులకు ఎన్నికల జరగాల్సి ఉంది. 2వ వైస్ ప్రెసిడెంట్‌గా నున్న ఇన్చార్జిగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వైసిపి నుంచి పలువురు కౌన్సిలర్లు టిడిపికి అనుకూలంగా మారడం జరిగినది. దీనితో ఉన్న 18 మంది కౌన్సిలర్లు టిడిపికి అనుకూలంగా మారడం జరిగినది. దీనితో ఉన్న 18 మంది కౌన్సిలర్లు 14 మంది బలం టిడిపికి ఏర్పడినది. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నిక ప్రకటించడం జరిగినది. చైర్మన్ పదవికి టిడిపి అభ్యర్థిగా ఫ్లోర్ లీడర్ పోటీ పడతారని భావించారు. సోమవారం ఎన్నికవ జరగవలసి ఉండగా టిడిపి అధిష్టానం శాఖమూరి



స్వర్ణలత పేరును అధికారంగా చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించినట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే చివరి క్షణంలో నందిగామ శాసన సభ్యురాల ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కౌన్సిలర్‌ల అభిప్రాయాలనుండిటిని అనుసరించి అభ్యర్థుల విషయంలో నిర్ణయం మార్చుకున్నట్లు సమాచారం ఈ విషయంలో టిడిపి నుంచి 4 గురు కౌన్సిలర్లు చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు. దానితో ఎమ్మెల్యే చైర్మన్ అభ్యర్థిని ఎన్నికను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అధిష్టానానికి తెలిపి వారి నిర్ణయం మేరకు అభ్యర్థిని నిర్ణయించాలి అనుకున్నారు. ఇదే విషయాన్ని మీడియాకు వెల్లడించారు ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల అధికార ఆర్డీవో బాలకృష్ణ సమావేశానికి తగినంత కోరం లేకపోవడంతో ఎన్నికను రేపటికి వాయిదా వేసినట్లు తన మీడియాకు వెల్లడించడం జరిగినది.

# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**నందిగామ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తాటి చెట్టు పై జారిపడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన నందిగామ మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో సోమవారం జరిగినది. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కొనగంటి చక్రబాబు గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కి గీత గీస్తుండగా ప్రమాదవశాస్తూ కాలు జారి క్రింద పడటంతో తీవ్ర గాయాలైన క్షతగాత్రుని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

# జగ్గయ్యపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్స్

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని ఏపిఎస్ ఆర్టీసి డిపో క్రీడా మైదానంలో సోమవారం జగ్గయ్యపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్స్‌ను స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, దొంతు చిన్నా, యువనేత శ్రీరాం ధనుంజయ పాల్గొన్నారు.



ఈసందర్భంగా ఎంఎల్ఏ రాజగోపాల్ మాట్లాడుతూ క్రీడల వలన స్నేహ సంబంధాలు పెరుగుతాయని, గెలుపోటములు సహజమని, నిరుత్సాహ పడకుండా ముందుకు సాగాలని సూచించారు. కాగా టిడిపి పట్టణ కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు నాయకులు సంగెపు బుజ్జిబాబు, గొట్టే నాగరాజు, గింజుపల్లి వెంకట్రావు, పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, తాళ్ళూరి వెంకటేశ్వర్లు, కారుపాటి దేవిడ్, యామర్తి బోస్‌యాదవ్, జి కృష్ణ, డి రామకృష్ణ, పి పుల్లారావు, కె సుధాకర్, డి నాగభూషణం, టి రామారావు, ఏ గోపి, జి వెంకటేష్, హరి, షబ్బు క్రికెట్ కమటి సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో చేగు విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** విజయవాడలో విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన ఎన్‌టిఆర్ జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక చేగు విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా సోమవారం విజేతలను విద్యాలయ యాజమాన్య ప్రతినిధులు తాడేపల్లి సోమేశ్వరరావు, కొత్తమాసు మల్లిఖార్జునరావు, సంయుక్త కార్యదర్శి పెనుగొండ వెంకట రాజీవ్, ప్రిన్సిపాల్ రాయపూడి నరసింహారావు అభినందిస్తూ చిరు సత్కారం చేశారు. చిన్నారులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రశంశించారు.



# శ్రీవేంకటాచల స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరువూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** తిరువూరు తిరునాళ్ళగా ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటాచల స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుండి 16వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వి ప్రసాద్ తెలిపారు. ఆ క్రమంలో సోమవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆలయ ఈవో వి ప్రసాద్ కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందచేశారు. 12న రాత్రి 10 గంటలకు స్వామివార్ల కళ్యాణ మహోత్సవానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాద్ (చిన్ని) తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొనున్నారు. పరిసర ప్రాంత భక్తులు ప్రజలు ఈ తిరువూరు తిరునాళ్లలో పాల్గొని భక్తి శ్రద్ధలతో తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామీవారి కృపకు పాత్రులు కావలసినదిగా ఆలయ ఈవో పరిసర ప్రాంత ప్రజలకు మరియు భక్తులెల్లరకు ఆహ్వానం పలికారు.



# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

**గుంటూరు తూర్పు, కార్పోరేషన్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** గుంటూరు ఏటుకూరు బైపాస్‌లో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. సంఘటనను గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# హత్యకేసులో 4గురు అరెస్టు

**నందిగామ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** నందిగామ మండల పరిధిలోని ఐతవరం గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసు పురోగతి సాధించడమే కాక ఈ కేసు నందు నలుగురుని అరెస్టు చేసినట్లు నందిగామ ఏసీపి తిలక్ మీడియాకు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మీడియాతో మాట్లాడుతూ నందిగామ మండల పరిధిలోని ఐతవరం గ్రామానికి చెందిన కోలా నరసింహారావు తన కుమార్తె 14 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నట్లు అయితే ఈ ప్రేవ వివాహానికి సహకరించిన మువ్వా గోపిని హత్య చేయాలని ప్రణాళికతో అతనిపై కక్ష పెంచుకొని హైదరాబాద్ కొత్తపేటలో ఉండే పాలంపల్లి విజయకుమార్ కి లక్ష రూపాయిలు సుఫారీ ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంక్రాంతి పండుగ సమయంలో మిగిలిన ఇద్దరు ముద్దాయిలతో కలిసి మొత్తం నలుగురు నందిగామ మండలం ఐతవరం వెళ్లి మువ్వా గోపి ఇంటి వద్ద మూడు రోజులు



రెక్కి నిర్వహించినట్లు అది కుదరకపోవడంతో మరల నిన్న మువ్వ గోపని చంపాలని ఉద్దేశంతో నందిగామ పట్టణంలో అనుమానాస్పద తిరుగుతుంటే వారిని పట్టుకుని విచారించగా ఈ సమాచారం అంతా తెలిపినట్లు ఏసిపి తిలక్ వెల్లడించాడు. ఈ నలుగురుని అదుపు తీసుకొని వారి వద్దనున్న నాలుగు కోడి కత్తులను ఒక బైకును 2000 నగదును స్వాధీన పరుచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరిపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పరుస్తున్నట్లు ఏసిపి తిలక్ వెల్లడించారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



**కంచికచర్ల ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కంచికచర్ల 65 జాతీయ రహదారి పెద్దకాలవ సమీపంలో టోల్ ప్లాజాకు చెందిననీళ్ల వాహనం, ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు. ఈ ఘటనలో లారీ నడుపుతున్న వ్యక్తికి ఒక కాలు పూర్తిగా తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు టోల్ అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంచికచర్ల పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మార్గాన్ని పునరుద్దరించారు.

# నాగ మానసాదేవికి పూలాభిషేకం

**విజయవాడ,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** వసంత పంచమి సందర్భంగా లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీ షిర్డి నాగసాయిబాబా,నాగమానసాదేవి మందిరంలో అమ్మవారు



సోమవారం సరస్వతీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున నాగమానసాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక ఆరాధన,విశేష పూజాదికాలతో పాటు పూలాభిషేకాన్ని మందిర వ్యవస్థాపక అధ్యక్షులు సుధాస్వామి,భక్తులు నిర్వహించారు. పుస్తకాలు,పెన్నులు, అమ్మవారి వద్ద పెట్టి ఆరాధించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలను నిర్వహ ఇంచారు. పూజ అనంతరతం విధ్యార్ధులకు పుస్తకాలు,పెన్నులు,స్టేషనరీని అందచేశారు. సుధాస్వామి అధ్వర్యంలో భక్తులకు చిన్నారులకు,వారి తల్లిదండ్రులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షులు సుధాస్వామి మాట్లాడుతూ అమ్మ సమక్షంలో అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు జ్ఞానరాశులవుతారని,సరస్వతీ ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుందని, సద్బుద్ధినీ పొందుతారని భక్తులు విశ్వసిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు,విద్యార్థిథనీ విద్యార్ధులు,పిల్లలు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగి నవ్య మృతి

**తిరువూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** గంపలగూడెం మండలంలోని అమ్మిరెడ్డిగూడెం గ్రామ సచివాలయంలో ఎంఎల్‌హెచ్‌పిగా విధులు నిర్వహిస్తున్న 23 సంవత్సరాల నవ్య మృతి చెందారు. గత వారం రోజులుగా ఆమె జ్వరంతో బాధపడుతూ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. ఆమె పెనుగంచిప్రోలు మండలం సుబ్బయ్యగూడెం గ్రామ నివాసిగా ఉద్యోగులు తెలిపారు. నవ్య మృతికి గంపలగూడెం మండల సచివాలయ ఉద్యోగులు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.



# ఘనంగా హజరత్ ఖాదర్ వలీ బాబా జండా గంధ మహోత్సవం

**ఎ కొండూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** హుజూర్ హజరత్ సర్కార్ బాబా ఖాదర్ ఔలియా విజయనగరం మహాత్ముల వారి జండా గంధ మహోత్సవాన్ని ఈ నెల 2న ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా అతావుల్లా బాబా దివ్య ఆశీస్సులతో ఎఎంటికె దర్బార్ బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి కులమంత వర్గ విచక్షణ లేకుండా దర్బార్ అండ్ దర్గాకు వచ్చిన వేలాది మంది బాబా భక్తులకు లంగర్ షరీఫ్ మహాదివ్య అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రముఖ వాస్తు శిల్పి దైవజ్ఞ జాఫర్ సాదిఖ్, బొగ్దాద్ తాజ్ ఖాదర్ బాబు బాబా వారి శిష్యులు భక్తబృందం పాల్గొన్నారు. అనంతరం అతావుల్లా బాబా దివ్య సమాదిని సందర్శించి బాబా పవిత్రాత్మకు శాంతి చేకూరాలని దువా జరిపారు. దర్గా సమాధిపై చాదర్ ఈతర్ పూలు సమర్పించారు.

# దద్దనాల నర్సయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**ఎ కొండూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తిరువూరు మాజీ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పిఎస్ దద్దనాల రాంబాబు తండ్రి దద్దనాల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రామచంద్రాపురం గ్రామంలో స్వర్గీయ నర్సయ్య ఇంటి వద్ద సోమవారం జరిగిన దశదిన ఖర్మ కార్యక్రమానికి తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ ఉమ్మడి కృష్ణా మాజీ జడ్పీ చైర్మన్ నల్లగట్ల సుధారాణిపాల్గొని స్వర్గీయ నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకుడు నరెడ్ల వీరారెడ్డి గంపలగూడెం జడ్పీటిసి మెంబర్ కోట శామ్యూల్ వైసిపి శ్రేణులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పాడి రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం : చైర్మన్ చలసాని

**నందిగామ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** పాడి రైతుల శ్రేయసే ప్రధాన ధ్యేయంగా కృష్ణ మిల్కు పనిచేస్తుందని కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ 60 సంవత్సరాలు పూర్తి చేసుకొని వజ్రోత్సవ వేడుకల శుభ సందర్భంగా నందిగామ మండల పరిధిలోని ఏటి పట్టు గ్రామాలైన రామిరెడ్డిపల్లి, కొనతమాత్కూరు పాడి రైతులతో చైర్మన్ చలసాని ముఖాముఖిగా మాట్లాడుతూ కృష్ణ మిల్క్ యూనియన్ పాడి రైతుల కోసం ఎన్నో వినూత్న పథకాలతో చేస్తున్నపలు సేవా కార్యక్రమాలు గురించి చైర్మన్ రైతులకు వివరించారు. అనంతరం కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవ వేడుకలు పురస్కరించుకొని పెద్ద ఎత్తున పాడి రైతులు కేకును కట్ చేసి పలు రైతులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు కే. వెంకటేవ్వరరావు పాలశీతల కేంద్ర మేనేజర్ బి నరేష్ మేడ రాధాకృష్ణ కిలారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# బిఎంఎస్ఎఫ్ వారే కిసాన్ ప్రచారం ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** వారే కిసాన్ (రైతుకు వందనం) ప్రచారాన్ని ప్రారంభించినట్లు బిఎఎస్ఎఫ్ ప్రతినిథులు తెలిపారు. పుడమిపై అతిగొప్ప పని ప్రచారంలో భాగంగా తమ సమాజంలోనూ, భారతీయ వ్యవసాయ రంగంలోనూ మార్పు తీసుకొస్తున్న ఐదుగురు రైతులను హైలేట్ చేస్తూన్న ఈ ప్రచారం అన్ను కపూర్ చే చేయిస్తున్నామన్నారు.



# పాటల పోటీలలో సత్తా చాటిన ఏకత్వా విద్యార్థులు

**వీరులపాడు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** సుమధుర స్వరం, వినసొంపైన గానంతో ప్రేక్షకుల మదిని దోచుకున్న ఏకత్వా పాఠశాల విద్యార్థులు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి బాలోత్సవ వేదికపై సుమధుర స్వరాలు పలికించి, సంగీత ప్రియుల మదిని మెప్పించి పాటల పోటీలలో ఏకత్వ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని, అలాగే వ్యాసరచన వ్యక్తిగత పోటీలలో చర్విత్ సాయి తృతీయ స్థానంలో నిలిచాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడపా నాగ సూర్యవతి తెలిపారు. ఈ సందర్భంగా వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వా పాఠశాలలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర పాల్గొని పాటల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా సింధూర మాట్లాడుతూ తమ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు ఆట పాటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుకుగా పాల్గొని విజేతలుగా నిలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా సంగీత అధ్యాపకులు తేరా రాహులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# పలు ఆలయాల్లో ఘనంగా వసంత పంచమి పర్వదిన వేడుకలు

**నందిగామ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** నందిగామ మండలంలోని పలు దేవి ఆలయాల్లో వసంత పంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. సరస్వతి అమ్మవారి జయంతి పురస్కరించుకొని వసంత పంచమి పర్వదినాన్ని సోమవారం పలు దేవి ఆలయాల్లో సరస్వతి దేవి అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు విశేష అర్చనలు పూజలు జరిగాయి. ఆలయ అర్చక స్వాములు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో సరస్వతీ అమ్మవారికి విశేష అర్చనలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, విద్యార్థులకు సరస్వతీదేవీ అమ్మవారి వద్ద పూజ చేసిన పుస్తకాలు పెన్నులు కంకణాలు పంపిణీ చేశారు ఆలయాల్లో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



# ఎంపి కేశినేని పై చేసిన ఆరోపణలో ఏమాత్రం నిజంలేదు

## -తెదేపా నాయకులు గడ్డి కృష్ణారెడ్డి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మచ్చలేని గొప్ప నిస్వార్థ ప్రజాసేవకుడు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా విరామమెరుగని గొప్ప రాజనీతి చతురుడు కేశినేశివనాథ్‌పై సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ చేసిన అర్థంపర్థం లేని ఆరోపణలో ఏమాత్రం నిజంలేదని ఎ కొండూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ గడ్డి కృష్ణారెడ్డి ఆదివారం మండల కేంద్రమైన ఎ కొండూరులో జరిగిన మీడియా సమావేశంలో తీవ్ర ఖండన చేశారు. రాష్ట్రంలో ఉన్న 25 పార్లమెంట్ స్థానాల్లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మార్చాలనేదే చిన్ని ఆశయం అని ప్రజాసేవే ఊపిరిగా పనిచేస్తున్న ఎంపి చిన్నిపై నిరాధార ఆరోపణలు చేయడం దోనేపూడి శంకర్‌కు తగదని గడ్డి కృష్ణారెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సిపిఎం చంద్రబాబు ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేసి పేద ప్రజలకు భవన నిర్మాణం ఇంకా ఇతర రంగాల కార్మికుల జీవితాలను ఆదుకున్నారని అప్పటి ప్రభుత్వంలో రూ.7వేలు ఉన్న ట్రాక్టర్ ఇసుకను కేవలం రూ.2వేలకు అందిస్తున్నారని దీనివల్ల ఆయా వర్గాల ప్రజలు వివిధ రంగాల కార్మికులు చంద్రబాబు నిర్ణయాన్ని అభినందిస్తున్నారని కృష్ణారెడ్డి తెలిపారు. సిపిఐ పార్టీ సిద్ధాంత పరంగా రాజకీయాల్లో పోరంటం ఉంటుందని కానీ దోనేపూడి శంకర్ అధికార పార్టీ నాయకులు నీకు నచ్చిన విధంగా డబ్బులు (చందాలు) ఇవ్వలేదనే ఉక్రోషంతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయడం విజయవాడ ప్రాంత ప్రజలకు తెలియని విషయం కాదని ఎంపి చిన్నిపై అసంబద్ధ ప్రేలాపనలు చేయడం మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోటానికి పార్టీ సిద్ధంగా ఉందని ఇకనైనా ఎంపి చిన్నిపై అసంబద్ధ నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అలుపెరుగని రాజకీయ యోధుడు ఎంపి చిన్నికి సహకారం అందించాలని లేని పక్షంలో శంకర్‌కు ప్రజలు తగురీతిలో బుద్ధి చెప్పడం ఖాయమని కృష్ణారెడ్డి హెచ్చరించారు.



# ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

## -వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్దంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి



రాంబాబు నాయకులకు సూచించారు. ఇటీవల నూతనంగా నియమింపబడిన జిల్లా ఉపాధ్యక్షురాలు, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఉయ్యూరు సతీష్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు అంబటిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీని గ్రామ, బూత్, వార్డు స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నూతనంగా ఎంపికైన నాయకులు, కార్యకర్తలు అందరూ సిద్దంగా ఉండాలన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడంతోపాటు, ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లోకి వచ్చేందుకు పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి కూడా ప్రణాళికలను రూపొందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్క పెన్షన్ తప్పా ఏ హామీని నెరవేర్చలేకపోయిందన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైకాపాపై విమర్శలు చేస్తూ కాలం వెళ్ళదీస్తుందన్నారు. నూతన కమిటి ఉత్సాహంగా పనిచేసి ప్రజల మద్దతును కూడగట్టాలన్నారు. నాయకులు అంబటి రాంబాబుకు పుష్పగుచ్చాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

# పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య షిర్డి సాయిబాబాను దర్శించుకున్న జనసేన నేతలు

**మంగళగిరి,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్యషిర్డి సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవ మహోత్సవానికి ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు బాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చిల్లపల్లి శ్రీనివాసరావు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి,అలాగే గోశాలను సందర్శించి గోమాతలకు ఎంతో భక్తిశ్రద్ధలతో పండ్లను సమర్పించారు.ఈ సందర్భంగా చిల్లపల్లి



మాట్లాడుతూ..ఆధ్యాత్మికత మానసిక ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.దేవునికి సంబంధించి పవిత్రతను ప్రభావితం చేసే అతీతమైన విశ్వాసానికి సంబంధించి మనిషి జీవితానికి సార్ధకత లభిస్తుందన్నారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదనరావు,ఎంటిఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు,ఎంటిఎంసీ కార్యదర్శి తిరుమలశెట్టి మురళీకృష్ణ,జనసేన నాయకులు చిట్టెం అవినాష్,మండల కమిటీ సభ్యులు,పెదవడ్లపూడి గ్రామ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్లస్థలాలు వచ్చేదాక కమ్యూనిస్టల పోరాటం

## - సిపిఐ నాయకులు తాళ్లూరి బాబూరావు

**చిలకలూరిపేట, ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలాలు ఇస్తామని ప్రకటించిందని, అర్హులైన వారందరికి ఇళ్లస్థలాలు అందేవరకు సిపిఐ పోరాటం చేస్తుందని, సిపిఐ ఏరియా ఇన్‌ఛార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు అర్హులైన పేదలనుంచి నివేశన స్థలాల కోసం అర్జీలను స్వీకరించడం జరిగిందని, సేకరించని అర్జీలను ఈనెల 5వ తేదిన తహసిల్దార్ కార్యాలయంలో అందచేయడం జరుగుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలలో పాలకులు దాటవేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, దాసరి వరహాలు తదితరులు పాల్గొన్నారు.



# వేల గొంతులు, లక్ష డప్పులు ప్రదర్శన గోడపత్రికలు ఆవిష్కరణ

**రెంటచింతల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 7న



హైదరాబాదులో నిర్వహించనున్న 'వేల గొంతులు... లక్ష గొంతుల్లు సాంస్కృతిక ప్రదర్శన గోడపత్రికలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నియోజకవర్గ నేతలు రెంటచింతలలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసుకునే అంశాన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారమిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఆదేశాలు ఇచ్చినా కొన్ని స్వార్థ శక్తులు వల్ల ఆలస్యం కావడం శోచనీయమన్నారు. ఎస్సీల్లో వెనుకబడిన మాదిగ, ఉపకులాలకు రిజర్వేషన్ల వర్గీకరణతో సమన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ, సంక్షేమ ర ంగాల్లో వారి జనాభా దామాషా ప్రకారం ఫలాలు దక్కుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను అమలుపరచి మాదిగ, ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు. వర్గీకరణ సాధన కోసం తలపెట్టిన ప్రదర్శన కోసం మాదిగ శ్రేయోభిలాషులు డప్పు తగిలించుకుని ప్రదర్శనలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా రెంటచింతల గ్రామానికి చెందిన దేగల జకరయ్యను మండల యువసేన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గడిపర్తి శ్రీనివాసరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ వెల్దుర్తి మండల అధ్యక్షుడు ఆదిరాల జకరయ్య మాదిగ, కారంపూడి మండల అధ్యక్షులు తాళ్లూరి జీవరత్నం, సీనియర్ నేత కర్ర మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాసవీ వృద్ధాశ్రమ అధ్యక్షునిగా పిచ్చయ్యగుప్తా

**గురజాల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** గురజాల పట్టణంలోని మాదుగుల రోడ్డులో గల శ్రీవాసవీ వృద్ధాశ్రమ అధ్యక్షునిగా ఆకుల పిచ్చయ్య గుప్తా ఎన్నికయ్యారు. సోమవారం ఆశ్రమంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సూర్య మల్లికార్జునరావు, కోశాధికారిగా ఊటుకూరి నరసింహారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దివ్వల సాంబశివరావు, పాదర్తి రాంబాబు, ఆత్మకూరి వెంకట పుల్లారావు, పెరుమాళ్ల సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.




# పట్టభద్రుల ఎన్నికకు శ్రీనివాసరావు నామినేషన్

**గురజాల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల మొదటి రోజు సోమవారం మండలంలోని గంగవరంకు చెందిన నేషనల్ నవక్రాంతి అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. ఈ నామినేషన్‌ను గుంటూరు జిల్లా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందించారు.



# ఎమ్మెల్యే యరపతినేనిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు : కూటమి నేతలు

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఇకనైనా పద్ధతి మార్చుకో మహేష్‌రెడ్డి.. గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావుపై అనవసర వ్యాఖ్యలు, ఆరోపణలు చేస్తే సహించేది



లేదు.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూటమి నేతలు సోమవారం గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై మండిపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికపై మహేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. మహేష్‌రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైస్ ఛైర్మన్ పదవిని గతంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కేటాయించిన విషయం తెలిసి కూడా కావాలని ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. గత నాలుగున్నర సంవత్సరాల క్రితం అధికార మదంతో పిడుగురాళ్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవాలు చేసింది మీరు కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32 వార్డుల కౌన్సిలర్లకు సఖ్యత లేక వైస్ ఛైర్మన్ పదవి కోసం తన్నుకుంటుంటే కూటమి నేతలు ఏదో కావాలని చేస్తున్నారని విమర్శించడం సరైంది కాదన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలంటూ హితవు చేశారు.

# నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటన

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గంలో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం పర్యటించారు. పట్టణంలోని రవీంద్రనగర్‌లో కాశీరావు, రావిపాడు గ్రామంలో పి.లాజర్, గుర వాయపాలెం గ్రామంలో ఆలపాటి కొండయ్యలు కనుమూశారు. వారి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి



మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఆయా కుటుంబాలకు తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందన్నారు.

పట్టణంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ...

పట్టణంలోని వరవకట్ట ప్రాంతంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పాల్గొన్నారు. డ్రైన్లలో సిల్ట్‌ను తొలగించారు. స్వయంగా చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏదో ఒక ప్రాంతంలో ప్రతి రోజు శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ నరసరావుపేటే తమ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల తనిఖీలు

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రవాణాశాఖ అధికారులు సోమవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రావ్య, ఎం.నాగేశ్వరరావులు మాట్లాడారు. 36వ రోడ్డు సేఫ్టీ తనిఖీలలో భాగంగా రావిపాడురోడ్డులో పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీ చేశామన్నారు. బస్సుల్లో సీట్ల పరిమితిని మించి విద్యార్థులను ఎక్కిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యాసంస్థలకు చెందిన బస్సులపై మొత్తం ఇరవై కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. డ్రైవర్లు



తమ ఆరోగ్య పరీక్షలను చేయించుకొని డ్రైవింగ్‌లో ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి బస్సుకు ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించి తీరాలని అధికారులు శ్రావ్య, నాగేశ్వరరావులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు సి.హెచ్.మనీషా, వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

## -ఎన్నికల అధికారి మురళీకృష్ణ




**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** పిడుగురాళ్ల పురపాలక సంఘ వైస్ ఛైర్మన్ ఎన్నికల వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ఫారం-ఏ, బిలను ముందుగా సమర్పించాలని, అలా జరగని కారణంగా ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఎన్నిక ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ముందుగా చెప్పామని, 10 గంటల లోపే ఫారాలను అధికారికి ఇవ్వాలని తెలిపారు. ఈ ఎన్నికను మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

# తిరుమలశెట్టికి ఇండియన్ ఐకాన్ పురస్కారం

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు తెలుగు వెలుగు సామితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారాన్ని సోమవారం అందజేసింది. వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేసింది. బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ



పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమాశంకర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నట్లుగా తాను తనకు తోచిన సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. సమాజానికి సేవ చేయడం మానవ ధర్మమన్నారు. బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను నడిపిస్తున్న, స్పందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మండలి లక్ష్మణ్‌బాబు, ఛైర్మన్ రాజకుమార్, జాతీయ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం : మాజీ ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిన కూటమి ఎం.పి.లు నోరు మెదపలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ 150 అడుగుల నుండి 135 అడుగులకు కేంద్రం కుదించి అన్యాయం చేసిందన్నారు. దీని వలన ఈ ప్రాజెక్ట్ బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మాత్రమే మిగిలిపోతుందన్నారు. ఏ కాలువలకు నీరు ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు.



పవర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో పని చేయదన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, రాక్‌ఫీల్డ్, కాపర్‌డ్యామ్, వంటి నిర్మాణాలకు 2017లో రూ.57 వేల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.33 వేల కోట్లకు ఆ వ్యయానికి కేంద్రం తగ్గించిందన్నారు. రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్ట్‌ను కేంద్రం ఏ విధంగా నీరుగారుస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఐదేళ్ళలో 75 వేల మెడికల్ సీట్లను పెంచుతామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తే రాష్ట్రానికి 2500 మెడికల్ సీట్లు అవకాశం వస్తే తమకు ఆ సీట్లు వద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రానికి లేఖ రాయడం దారుణమన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.3200 కోట్లు కేంద్రం నిధులు ప్రకటించిందని, అవి కనీసం జీతాలకు కూడా సరిపోని పరిస్థితి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వివరించారు.

# నేడు నియోజక వర్గ పట్టభద్రుల ఆత్మీయ సమావేశం

**చిలకలూరిపేట,ఫిబ్రవరి3, ప్రభాతవార్త:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికలకు తెలుగుదేశం జనసేన, బిజెపి కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి అలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ పట్టభద్రుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా మాజీమంత్రి,నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్ధి ఆలపాటి రాజేంద్రప్రసాద్, చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, దాసరి ఉషారాణి,పాలడుగు సురేందర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పట్టభద్రులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

# అమరవీరుల స్మారకస్థూపం నిర్మించడం అభినందనీయం

**చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమాలలో అమరులైన వారిని, పార్టీకోసం త్యాగం చేసినవారిని స్మరించుకోవడమనేది కమ్యూనిస్టుల ముఖ్య కర్తవ్యమని సిపిఐ నాయకులు మద్దుకూరి రవీంద్రబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని గౌడ కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్పూర్తిగా,



నిదర్శనంగా అమరవీరుల స్మారకస్థూపం నిర్మించడం, మాజీ శాసనసభ్యులు కరణం రంగారావు, బొంతా దానియెల్‌ల విగ్రహలను వేలూరు గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం వారికి అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పేలూరి రామారావు, నాగబైరు రామసుబ్బాయమ్మ,షేక్ బుడే, నాయుడు శివకుమార్, తన్నీరు వెంకటేశ్వర్లు, ఆరాధ్యుల రామకృష్ణ, గాత్రం భగత్‌సింగ్, బెల్లంకొండ భారతి, కాసా సాంబయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను సోమవారం నిర్వహించారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీవో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఎన్జీవో సభ్యులు ఆర్.బంగారయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చిత్రలేఖనం పోటీలకు సంబంధించిన ప్రత్యేక చార్ట్‌లను అందజేశామన్నారు. విద్యార్థులు ప్రత్యేక అవగాహనతో భద్రతా నియమాలను పాటించాలన్నారు. సమాజంలోనూ, తల్లిదండ్రులలోనూ రోడ్డు భద్రతపై వారే ప్రచారం నిర్వహించాలన్నారు.

# యడ్లపాడు-1 విఆర్వోగా చారీ

**యడ్లపాడు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామ ఒకటవ సచివాలయ పరిధిలోని విఆర్‌వోగా కె ఎ చారీ నియమితులైనారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించుతున్న విఆర్‌వో సయ్యద్ మహబూబ్ సుభాని విధులకు రాకుండా మరియు వివిధ సమస్యలపై అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందిన మీదట సదరు జిల్లా కలెక్టర్ అతనిని విధుల నుండి తప్పించటం జరిగింది. అయితే మండల పరిధిలోని కారుచోల గ్రామ విఆర్‌వోగా విధులు నిర్వహించుతున్న కె ఎ చారీని యడ్లపాడు ఒకటవ విఆర్‌వోగా పరిపాలన సౌలభ్యం కోసం అదనపు బాధ్యతలు ఇవ్వటం జరిగిందని తహశీల్దార్ విజయశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను అందజేసామన్నారు.



# గుండె పోటుతో సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ మృతి

**యడ్లపాడు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** మండల పరిధిలోని సొలస గ్రామానికి చెందిన సిఆర్పిఎఫ్(2006వ బ్యాచ్) కానిస్టేబుల్ చిన మూర్తయ్య(40)మృతి చెందటం జరిగింది. ఒడిశాలో పనిచేస్తున్న అయన ఇటీవల స్వగ్రామం సొలస రావటం జరిగిందని, ఉదయం ఇంటి వద్ద కాలకృత్యాలు పూర్తయిన అనంతరం గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందటం జరిగిందన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



# చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

**యడ్లపాడు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన అదివారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై వి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నల్లబండ్ల బజారు, గిద్దలూరు, ప్రశాశం జిల్లాకు చెందిన సింహంశెట్టి బాల ఉగ్ర(36) ఈ నెల 25వ తేదిన కారులో గుంటూరు వెళుతున్న సమయంలో మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవ శాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, ఇతను ప్రకాశం జిల్లా దొనకొండ పోలీస్ స్టేషన్‌లో 2011బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించుతున్నాడని, ఇతనికి భార్య మంజులా దేవి, ఇరువురు మగ సంతానం ఉన్నారని తెలిపారు.

# ఘనంగా సరస్వతీదేవి పూజ

**నూజెండ్ల,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** వసంత పంచమి పురస్కరించుకొని మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సరస్వతీదేవి పూజ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవి విగ్రహాన్ని విద్యార్థులు పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం టి. శ్రీనివాసరావు, ఎల్. అంజిరెడ్డి, ఏఎస్ఎస్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ

**వినుకొండ,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** కృష్ణ-గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ పురపాలక సంఘ, వార్డు సచివాలయ నోటీసు బోర్డుల నందు ప్రచురించడం జరిగిందని సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్ సోమవారం తెలియజేశారు.



# విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవోగా డాక్టర్ కూరపాటి మేఘన

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం,వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా డాక్టర్ కూరపాటి మేఘన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన



బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ డాక్టర్ కూరపాటి మేఘన గడిచిన 10సంవత్సరాల నుంచి కంటి స్పెషలిస్ట్ డాక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ మంచి పేరు సాధించుకున్నారని తెలిపారు. ఇక నుంచి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవోగా తన బాధ్యతలను చక్కగా నిర్వహించి యూనివర్సిటీని మరింత ముందుకు తీసుకెళ్ళాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి మేగన మాట్లాడుతూ సీఈవోగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. యూనివర్సిటీలోని అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని సమర్థవంతంగా పనిచేయడానికి కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీ నియమ నిబంధనలు, నైతిక విలువలు పాటిస్తూ వర్సిటీని మరింత ఉన్నత స్థానాలకు తీసుకెళ్తానన్నారు. యూనివర్సిటీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తానన్నారు. విద్యార్థుల కోసం నూతన పథకాలను రూపొందించడం, సౌకర్యాలను మెరుగుపరచడానికి మరింత కృషి చేస్తానన్నారు. అనంతరం విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆయా విభాగల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశమయ్యారు. తొలుత యూనివర్సిటీలోని సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తన ఛాంబర్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

# లింగారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

## -సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ


**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వేజండ్ల గ్రామానికి చెందిన మున్నంగి లింగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. లింగారెడ్డి మరణ వార్త విన్న అంబటి వేజండ్ల గ్రామానికి వెళ్ళి లింగారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. అంబటి పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.



# చదువుల తల్లి సరస్వతీదేవి ఆశీస్సులు పొందండి

## -అర్చకస్వామి భట్టిప్రోలు రామకృష్ణ

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుల తల్లి సరస్వతీదేవి ఆశీస్సులు పొందాలని అర్చకస్వామి భట్టిప్రోలు రామకృష్ణ సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతీదేవి పూజ నిర్వహించారు. తొలుత అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సరస్వతీదేవి అనుగ్రహం ఉంటే తప్పని సరిగా విజయం సాధిస్తారని చెప్పారు. వసంత పంచమి నాడు అమ్మవారిని ప్రత్యేకంగా పూజించి ఆమె ఆశీస్సులు అందుకున్నట్లయితే అంతా మంచే జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాద వినియోగం జరిగింది.



# కారును ఢీకొట్టిన బస్సు

తాడేపల్లి,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త : స్థానిక ఉండవల్లి సెంటర్లో విఐటి కాలేజీ బస్సు కారును కారును ఢీకొట్టింది.దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోయింది.స్కూల్స్,కాలేజీ,ఉద్యోగాలకు వెళ్ళాల్సినవారికి తీవ్ర స్థాయిలో ఇబ్బంది ఎదురైంది.కాలేజీ బస్సులు మితిమీరిన వేగంగా నడపడంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.బస్సులకు స్పీడ్ కంట్రోల్ లాక్స్ లేకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజు ఇక్కడ ఎక్కువగా ట్రాఫిక్ ఉన్న సమయంలో ఒక్క పోలీస్ కూడా లేకపోవడం గమనార్హం.. విఐపిలు వస్తున్నారంటే రోడ్డంతా ఆక్రమించి ట్రాఫిక్ క్లియర్ చేసే పోలీసులు పిల్లలు,విద్యార్థులు,ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారంటే ఎందుకు పట్టించుకోరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.దీనిపై స్థానిక ఆర్టీవో స్పందించి విద్యాసంస్థల బస్సులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలలో భారీ మెజారిటీ కూటమి నేతల ప్రధాన లక్ష్యం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికలలో భారీ మెజారిటీనే లక్ష్యంగా కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి



పుల్లారావు అన్నారు. నరసరావుపేటలోని నవయుగ కన్వెన్షన్ నందు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సమీక్షా సమావేశంలో పాల్గొని ప్రత్తిపాటి మాట్లాడారు. సమావేశానికి పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేయడం అందరం గర్వించదగిన విషయం అని చెప్పారు. రాజేంద్రప్రసాద్‌కు పల్నాడు జిల్లాలో ఎక్కువ మెజారిటీ వచ్చేలా అందరం కృషి చేయాలని అన్నారు. కూటమి పార్టీలను ప్రజలు ఆదరించి భారీ మెజారిటీ ఇచ్చినందుకే స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు మరో పది సంవత్సరాలు అధికారంలో ఉండాలన్నదే ప్రజల ఆకాంక్ష అని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మినారాయణ, జి.వి ఆంజనేయులు, భాష్యం ప్రవీణ్, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


# వాట్సాప్ సేవలపై వైకాపా విష ప్రచారం తగదు

## -జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ

**చిలకలూరిపేట,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి పాలనకు సాంకేతిక అనుసంధానంతో ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు విషం చిమ్ముతున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కోకన్వీనర్ పెంటేల బాలాజీ ఆరోపించారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా కూటమి ప్రభుత్వం మెరుగైన పౌరసేవలు అందించటానికి వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తే అభినందించాల్సిన విషయం అయితే దానికి వైసిపి విమర్శించడం తీవ్ర విచారకరమని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నాయకులకు ప్రజలకు సత్వరసేవలు అందించడం ఇష్టంలేదా అని బాలాజీ ప్రశ్నించారు. వైసిపి ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని బాలాజీ పిలుపునిచ్చారు.

# జ్ఞాన సరస్వతీ దేవాలయంలో ఘనంగా అక్షరాభ్యాసాలు

**నరసరావుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** స్థానిక వినుకొండ బైపాస్ జంక్షన్‌లో వేంచేసియున్న శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి దేవాలయంలో సోమవారం వసంతపంచమిని పురస్కరించుకొని అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ అన్నపూర్ణయ్య సిద్ధాంతి, కమిటీ సభ్యులు డాక్టర్ కె.జె.మోహన్‌రెడ్డి, గుంటూరు సీతా రామాంజనేయులు (రాము) పాల్గొని మాట్లాడారు. అమ్మవార్లకు చీర,సారె భక్తులు సమర్పించారు. రూ.60 వేలు విలువ చేసే బంగారు మంగళసూత్రాలను అందజేశారు. ఉదయం



నుండి సాయంత్రం వరకు పట్టణ, సమీప గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు అక్షరాభ్యాస కార్యక్రమాల్లో వారి చిన్నారులతో కలిసి పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు. మార్కాపురంకు చెందిన డాక్టర్ కనకదుర్గ అమ్మవారికి బంగారు మంగళసూత్రాలను అందజేశారు.

# పిడుగురాళ్ళ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం

**నరసరావుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** పిడుగురాళ్ళ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచవరం మండలం పిల్లుట్ల జిల్లా పరిషత్‌హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసిపిఓ ప్రశాంతి, ఎస్‌డబ్ల్యూ కె.శైలజా, సూపర్‌వైజర్లు కె.కోటేశ్వరి, బి.అన్నపూర్ణ, వెంకటలక్ష్మమ్మ, అంజలి పాల్గొని మాట్లాడారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం ప్రత్యేకంగా అందిస్తున్న వివిధ పథకాలను తెలియజేశారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను తెలియజేశారు. బాలికల విద్యా ప్రాముఖ్యతను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల విజేతకు సత్కారం

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి చుక్కా వెంకటేశ్వరరావును సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు స్వర్ణ చిన్నరామిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. 58 సంవత్సరాల వయస్సులో 25వ కృష్ణా రివర్ క్రాసింగ్ కాంపిటీషన్స్‌లో పాల్గొని వెంకటేశ్వరరావు ప్రశంసాపత్రాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. 32 నిమిషాల్లో కృష్ణా రివర్‌ను దాటి అవార్డును స్వీకరించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు స్విమ్మింగ్ మంచి వ్యాయామం అని స్వర్ణ రామిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంచాల శ్రీనివాసరావు, రాజు, ప్రభాకర్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మాచవరం ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలగా మార్చేందుకు వివరాలు సేకరణ

**రొంపిచర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మాచవరం ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలగా మార్చేందుకు గ్రామంలోని 6,10 తరగతుల విద్యార్థుల వివరాలను సోమవారం అధికారులు సేకరించారు. ఉన్నత పాఠశాలలో చేరుటకు తల్లిదండ్రులు డిక్లరేషన్‌ను మండల విద్యాశాఖాధికారికి సమర్పించారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పోతిరెడ్డి అబ్రహం ఆధ్వర్యంలో గ్రామంలో వివరాలను సేకరించారు. 150 మంది విద్యార్థుల తల్లిదండ్రులు 9,10 తరగతులను ప్రారంభించి హైస్కూల్‌గా మార్చాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి బ్రహ్మేశ్వరరావు ఈ ప్రతిపాదనలను విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు పంపుతామని తెలియజేశారు. గ్రామ పెద్దలు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, యాంపాటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

# పల్సెస్ అసోసియేషన్ నూతన కమిటి ఎన్నిక

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** పొన్నూరు పల్సెస్ ఎక్స్‌పోర్ట్స్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కనమర్లపూడి సత్యనారాయణ, కార్యదర్శిగా వక్కలగడ్డ మోహనరావు, కోశాధికారిగా నారాయణం మేఘనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అపరాల వ్యాపారానికి పొన్నూరు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని మినుములు,




పెసలు, మొక్కజొన్నలు తదితర పంటలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అసోసియేషన్‌కు ఎన్నికయ్యేందుకు చాలా మంది ఉత్సాహం చూపించినప్పటికీ అసోసియేషన్ సజావుగా సాగాలనే సదుద్దేశంతో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక్కడి నుండి మినుములు, పెసలు, మొక్కజొన్నలు తదితర పంటలు వివిధ రాష్ట్రాలకు దేశాలకు కూడా ఎక్స్‌పోర్టు అవుతుంటాయి. ఈ ప్రాంతం అపరాల వ్యాపారానికి అనువైన ప్రాంతం కావడంతో పెద్ద ఎత్తున సరుకును రవాణా చేస్తుంటారు. ఈ నూతన కమిటిని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, అన్నవరపు నాగ వెంకటకృష్ణారావు, కొత్తూరి ఆనంద్, అవ్వారు సురేష్, పలువురు అపరాల వ్యాపారస్తులు తదితరులు అభినందించారు.

# ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుందాం: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: కూటమిలో ప్రతిపార్టీ బాధ్యతగా తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం కృషి చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై తెలుగుదేశం, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం నరసరావుపేటలో సోమవారం



జరిగింది. తెలుగుదేశం పార్టీ పల్నాడు అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చదలవాడ అరదవిందబాబు, జనసేన, బీజేపీ నాయకులు, ఏడు నియోజకవర్గాల తెదేపా పరిశీలకులు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన జిల్లా పోలీసు వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

**బాపట్ల,ఫిబ్రవరి03,ప్రభాతవార్త:** పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ లో అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి అన్నారు.జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఫిబ్రవరి 2న ఆదివారం రాత్రి జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని



ప్రదర్శించారని ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలన్నారు. జిల్లా ఎస్పీక్రికెట్, వాలీబాల్ విభాగంలో స్వయంగా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచిన డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టు.అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు.ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి అన్నారు. యానువల్ స్పోర్ట్స్ మీట్ కి నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పోలీస్ అంటేనే నిరంతరాయంగా విధులు, ప్రముఖుల రాకపోకలు, ముఖ్యమైన సమావేశాలు, ర్యాలీలు , బందోబస్తు, ఇతరత్రా డ్యూటీలతో క్షణం తీరిక లేకుండా ఉంటారన్నారు. ఆ సమయంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ లోపిస్తుందనీ, ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం వల్ల పని ఒత్తిడితో నలిగిపోతున్న పోలీసు అధికారులకు సిబ్బందికి కాస్తంత ఊరట లభిస్తుందన్నారు. మరీ ముఖ్యంగా విధులతో పాటు నిరంతరాయంగా వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ, వ్యాయామం మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. మంచి ఆరోగ్యంగా ఉంటేనే, విధులను సమర్థవంతంగా నిర్వహించగలమని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతలేన్నారఉ జయాప జయాల గూర్చి చింతించకుండా, వాటిని సంతోషంగా స్వీకరించాలనీ సూచించారు. ఈ పోటీల్లో విజేతలైన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్ ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. ఈ స్పోర్ట్స్ మీట్ లో ఓవర్ ఆల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా ఎఆర్‌పిసి 2236 జీ. కృష్ణ నిలిచారు. మహిళల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా డబ్ల్యుపిసి179 జీ. సునీత నిలిచారు. వాలీ బాల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్, రన్నర్ అప్ చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచాయి. కబడ్డీ విజేతగా బాపట్ల డివిజన్, రన్నర్ అప్ చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ విజేతగా చీరాల సబ్ డివిజన్ రన్నర్ అప్ డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టులు నిలిచాయి.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విటలేశ్వర్, చీరాల, బాపట్ల, రేపల్లె డిఎస్పి మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావులు, సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్, ఏ.ఆర్ డీఎస్పీ విజయ సారథి, ట్రైనీ డిఎస్పి అభిషేక్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. .

# పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించండి : పల్నాడు కలెక్టరు

**నరసరావుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాశాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. రీ ఓపెన్ అర్జీలకు సంబంధించి నాణ్యమైన పరిష్కారాలు చూపాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేయడం జరిగిందన్నారు. నూతన



అర్జీలను స్వీకరించడం లేదన్నారు. అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను మొత్తం పరిష్కరించాలన్నారు. కలెక్టర్ స్వయంగా 40 రీ ఓపెనింగ్ అర్జీదారులతో వ్యక్తిగతంగా ఫోన్‌లో మాట్లాడారు. తమ దరఖాస్తులకు సంతృప్తికరమైన పరిష్కారాలు అందాయా లేదా అని అడిగి కలెక్టర్ అరుణ్‌బాబు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, డిఆర్ఓ మురళీ, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్,ఎస్పీను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డిఎస్పీ ఆర్ అభిషేక్

బాపట్ల,ఫిబ్రవరి03,ప్రభాతవార్త: బాపట్ల ట్రైనీ డి.ఎస్.పి ఆర్.అభిషేక్ సోమవారం కలెక్టర్ జె.వెంకట మురళీని మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాపట్ల జిల్లాలో శిక్షణ పొందే నిమిత్తం కేటాయించబడిన 2023 వ బ్యాచ్ కు చెందిన ట్రైనీ డి.ఎస్.పి రావూరి అభిషేక్ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ దూడి ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహించి, విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. పశ్చిమ గోదావరికి చెందిన ట్రైనీ డిఎస్పి అనంతపురం పీటీసీ లో శిక్షణ పూర్తి చేసినారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో 6 నెలల పాటు ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారన్నారు.




# జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన గన్‌మెన్ నాగరాజు

**బాపట్ల,ఫిబ్రవరి03,ప్రభాతవార్త:** జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో ప్రతిభ కనబరిచిన గన్‌మెన్ నాగరాజును జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అభినందించారు.జిల్లా పోలీస్ గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్ లో ఆదల్టిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి గన్‌మెన్ నాగరాజు ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అబిందించారు. ఆదల్టిక్స్‌లో నాగరాజు 4 బంగారు పథకాలు ఒక సిల్వర్ పథకాన్ని గెలుపొందారు..1500 మీటర్ 800 మీటర్, 4 100 మీటర్, 4 400 లెటర్, 400 మీటర్ సిల్వర్ మెడల్స్‌ను గెలుపొందారు.



# నరపరావుపేట డిఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు కుమారుని వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఫిబ్రవరి3, ప్రభాతవార్త:** నరసరావుపేట పట్టణంలోని మేఘ కన్వెంషన్ నందు ఆదివారం రాత్రి నరసరావుపేట డిఎస్‌పి కొమ్మనబోయిన నాగేశ్వరరావు కుమారుని వివాహ వేడుకలు జరిగాయి. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి వర్యులు నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ



నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ తోట రాజారమేష్, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, కంచర్ల శ్రీనివాసరావు, ఆరె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టీ అధికారి శ్రీనివాసరెడ్డికి సత్కారం

**నాదెండ్ల,ఫిబ్రవరి3,ప్రభాతవార్త:** నాదెండ్ల గ్రామంలో శ్రీవిఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న జాతీయస్థాయి



వృషభరాజముల బండలాగుడు బల ప్రదర్శన తిలకించటానికి విచ్చేసిన సెంట్రల్ జిఎస్‌టి కష్టమ్స్ అధికారి గాదె శ్రీనివాసరెడ్డిని టిడిపి నాయకులు నల్లమోతు కోటేశ్వరరావు, ఆలయకమిటి సభ్యులు ఘనంగా సత్కరించారు. కాగా పోటీలను ఆసాంతం శ్రీనివాసరెడ్డి తిలకించారు.పోటీలలో పాల్గొన్న యడ్లజతల యజమానులను ఆయన అభినందించారు. గ్రామీణ వాతావరణంలో రైతులకు సంబదించిన ఇలాంటి పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న కమిటి సభ్యులను ఆయన అభినందించారు.

# తెదేపా శాశ్వత సభ్యత్వం తీసుకున్న వెల్లంపల్లి రవిశంకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి


**చిలకలూరిపేట, ఫిబ్రవరి3, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలకు విశేష ఆదరణ లభిస్తోందని మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం ప్రత్తిపాటి నివాసంలో టిడిపి శాశ్వత సభ్యత్వం



తీసుకున్న పల్నాడు జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు వెల్లంపల్లి రవిశంకర్, బైరా శ్రీనివాసరావులు ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిశారు. ఈ సందర్భంగా వారిని ప్రత్తిపాటి అభినందించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ నియోజక వర్గంలో టిడిపి సభ్యత్వాలు, ముఖ్యంగా శాశ్వత సభ్యత్వాలకు మంచి స్పందన ఉందని తెలిపారు. కార్యక్రమంలో మురకొండ మల్లిబాబు, బైరా కోటేశ్వరరావు, కొత్త కోటేశ్వరరావు, పిల్లి కోటి, అమరా మణికుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బగళాముఖి ఆలయంలో అక్షరాభ్యాసముల కార్యక్రమం

**పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి03,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలంలో చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో శ్రీ పంచమి సందర్భంగా బాలబాలికలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు ఎంతో వైభవముగా నిర్వహించామని ఆలయ నిర్వహణ అధికారి నరసింహామూర్తి తెలిపారు. శ్యామలనవరాత్రులలో 5వ రోజు వచ్చేటువంటి శ్రీ పంచమీ రోజు అక్షరాభ్యాసాలు చేయడం చాలా విశేషం అనిఅన్నారు. ఈ కార్యక్రమానికి తమ తమ చిరంజీవులను తీసుకొని అనేక ప్రాంతాల నుండి వచ్చిన చిన్నారుల పేరు మీద



సరస్వతీ పూజ జరిపించి, పూజా కంకణాలు, పలకా,బలపములు, బిస్కెట్లు, స్వీట్లు దేవస్థానం తరపున అందచేశామని ఆలయ ఇవో జి నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలియపరిచారు.

# కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు పాల్పడడం పద్ధతి కాదు

## -వైకాపా మాజీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య

**పొన్నూరు, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** రాజ కీయాలు తనకు అనుకూలంగా మలుచుకు నేందుకు దుర్మార్గపు చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురంలో నయానా, బయానా వైకాపాకు చెందిన కౌన్సిలర్లను లోబరచుకుఒని తక్కువ సంఖ్యాబలం ఉన్న టిడిపికి పట్టం కట్టడంలోని మర్మాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. హిందూపురం



మునిసిపాలిటీలో మొత్తం 38మంది కౌన్సిలర్లకు గాను 30మంది వైకాపాకు, ఆరుగురు టిడిపి, ఒకరు బిజెపి, ఒకరు ఎంఐఎం కౌన్సిలర్లు ఉన్నారన్నారు. ఆరుగురు బలం ఉన్న టిడిపి ఏ విధంగా మునిసిపల్ ఛైర్మన్ పదవిని పొందుతుందో చెప్పాలన్నారు. అంటే ఇతర పార్టీల కౌన్సిలర్లను భయపెట్టి అధికారాన్ని కౌవసం చేసుకొందన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ అవార్డు ఇటువంటి వ్యక్తులా ఇచ్చేది అని విమర్శించారు. సోమవారం జరిగిన మునిసిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి నాయకులు వారి ఇష్టానుసారం వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేసే విధంగా వ్యవహరించారన్నారు. తిరుపతిలో వైకాపాకు చెందిన పార్లమెంట్ సభ్యుడు, ఎమ్మెల్సీలకు సంబంధించిన బస్సు అద్దాలు పగులకొట్టడం, వైకాపా నాయకులను, కార్యకర్తలను అడ్డుకోవడాన్ని బట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ దశలో ఉన్నాయో అర్థమవుతుందన్నారు. మునిసిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగినంత సంఖ్యాబలం లేకున్నా దౌర్జన్యంగా కౌన్సిలర్లను, కార్పోరేటర్లను భయపెట్టి, కిడ్నాప్‌లు చేసి కూటమి ప్రభుత్వం అధికారాన్ని కౌవసం చేసుకోవాలని అనుకోవడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. గతంలో కూడా టిడిపి అధికారంలో వున్నప్పుడు ప్రతిపక్ష పార్టీ అయిన వైకాపా కౌన్సిలర్లపై దాడులు చేసి వివిధ పురపాలక సంఘాల్లో అధికారాన్ని కైవసం చేసుకొందన్నారు. ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తుందన్నారు. ప్రజా స్వామ్యంలో ఇది సరైన విధానం కాదన్న విషయాన్ని కూటమి నాయకులు తెలుసుకోవాలన్నారు. కూటమి అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలపై వైకాపా పోరాటం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇలాంటి దుర్ఘటలను మానుకోవాలని హితువు పలికారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు

**కర్లపాలెం,ఫిబ్రవరి03,ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం అధికారులను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు మండల పరిధిలోని పెద పులుగు వారి పాలెం గ్రామంలో సోమవారం సచివాలయం ప్రభుత్వ పాఠశాలను అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు



ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందరూ అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను అందించాలన్నారు ఆయన వెంట కార్యదర్శి సమీర్ సచివాలయ సిబ్బంది అంగన్వాడీ ఆశ కార్యకర్తలు ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది ఉన్నారు

# మాచర్లలో ఘనంగా వసంతపంచమి వేడుకలు

**మాచర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని పలు పాఠశాలల్లో వసంతపంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓక్ బ్రిడ్జి స్కూల్‌లో జరగిన వేడుకల్లో ఛైర్మన్ కొమ్మారెడ్డి చలమారెడ్డి



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడఉతూ వసంత పంచమి జ్ఞానానికి అధిదేవత సరస్వతీదేవికి ప్రతీపాత్రమైన రోజున సమూహ అక్షరాభ్యాసం చేయడం వల్ల చదువుల్లో రాణించి, విజయాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు వేద పండితులు, ఉపాధ్యాయులు, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ దరియావలి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కృష్ణవేణి పాఠశాలలో అక్షరాభ్యాసం**

పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో జరిగిన వసంత పంచమి వేడుకల సందర్భంగా చిన్నారులకు పలక, బలపం ఇచ్చి అక్షరాభ్యాసం



చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అర్చకులు భరత్‌కుమారాచార్యులు, పాఠశాల ప్రిన్సిపల్, యాజమాన్యం మాట్లాడుతూ వసంతపంచమి రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం వల్ల త్వరగా పురోగమిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జిలు గౌరీ, నాగజ్యోతి, శ్రీలక్ష్మీరెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అంజయ్యనాయక్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సోలార్ ప్యానెల్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాచర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని సాగర్‌రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ దుకాణాన్ని మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధికి, వ్యాపార అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో



కృషి చేస్తుందన్నారు. మాచర్లలో వ్యాపార సముదాయాలు అభివృద్ధి చెందాలని కాంక్షిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, ఎనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ప్రమాదకరం : ఎస్సై సంధ్యారాణి

**మాచర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని ఎస్సై సంధ్యారాణి అన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ఓవర్‌టేక్ చేసే సమయాల్లో ఏకాగ్రత పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాలకే ప్రమాదమన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.



# 7న 'తండేల్' భారీ రిలీజ్

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ రోజు




'తండేల్' జాతర ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. తండేల్ జాతర ఈవెంట్‌లో హీరో అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ, అతిథులకు ప్రేక్షకులకు, అక్కినేని అభిమానులందరికీ నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన సందీప్ రెడ్డి వంగాకి థ్యాంక్. అరవింద్ వాసు లేకుండా నెక్స్ట్ సినిమా ఎలా ఫినిష్ చెస్తాననే భయం పట్టుకుంది. వారు సినిమాలో అంతలా కాంట్రిబ్యుట్ చేస్తారు. గీత ఆర్ట్స్ పేరు నా కెరీర్‌లో టాప్‌లో వుంటుంది. తండేల్ నా కెరీర్‌లో చాలా స్పెషల్ మూవీ. తండేల్ రాజుకి నాకు రియల్ లైఫ్‌లో చాలా డిఫరెన్స్ వుంటుంది. ఈ క్యారెక్టర్ నేను చేయగలనని నమ్మిన వాసు, చందుకి థాంక్ యూ. క్యారెక్టర్‌లోకి ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడానికి చాలా టైం ఇచ్చారు. చందుతో ఇది మూడో సినిమా. నన్ను పాజిటివ్ పర్సన్. ఈ సినిమాకి ట్రూ రాక్ స్టార్ దేవి. చార్ట్ బస్టర్ సాంగ్స్ ఇచ్చారు. డీవోపీ శాం, ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర లిరిక్ రైటర్స్ టీం అందరికీ థ్యాంక్ యూ. శ్రీకాకులం వచ్చిన మత్స్యకారుల కుటుంబాలకి ధన్యవాదాలు. వారి వలనే నా క్యారెక్టర్‌కి ఒక ఐడియా వచ్చింది. వారికి సముద్రం తప్పితే మరొకటి తెలీదు. వారు లేకపోతే ఈ సినిమా లేదు. వారి నుంచి చాలా నేర్చుకున్నాను. ఫిబ్రవరి 7 థియేటర్స్‌లో దుల్లకొట్టేద్దాం అన్నారు. హీరోయిన్ సాయి పల్లవి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆయన డ్యాన్స్ చేస్తూనే సాంగ్స్ కంపోజ్ చేస్తారు. అందుకే పాటల్లో అంత ఎనర్జీ వుంటుంది. ఇందులో బ్యూటీఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. శ్యాం దత్ విజువల్స్ ఫెంటాస్టిక్ విజువల్స్ ఇచ్చారు. నాగేంద్ర ప్రతి సెట్‌కి లైఫ్ తీసుకొచ్చారు. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా థాంక్స్. అరవింద్ నాకు తండ్రిలాంటి వారు. బన్నీవాసు చాలా పాషన్ తో సినిమాని చేశారు. వారి నిర్మాణంలో వర్క్ చేయడం చాలా ఆనందంగా వుంది. సందీప్ రెడ్డి వంగా ఫిల్టర్ లేకుండా మాట్లాడతారు. ఫిలిం మేకర్‌కి ఆ వాయిస్ వుండాలి. ఆయన ఈ వేడుకకు రావడం ఆనందంగా వుంది. చైతన్య ఈసినిమా కోసం చాలా ట్రాన్స్ ఫార్మ్అయ్యారు. ఈ సినిమా కోసం ఆయనలో ఓ ఆకలి కనిపించింది. చాలా హార్డ్ వర్క్ చేశారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన అందరికీ థ్యాంక్ యూ. మేము మీ సినిమానే తీశాం. చాలా మంచి సినిమా ఇది. మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, 'తండేల్' ట్రైలర్ టీజర్ సాంగ్స్ ఏది చూసి సినిమాలో ఎమోషనల్ కనెక్ట్ కనిపిస్తోంది. సాయి పల్లవి చైతన్య కెమిస్ట్రీ చాలా రియల్‌గా అనిపిస్తోంది. బన్నీ వాసు ఆల్ ది వెరీ బెస్ట్. కేడీ సినిమాకి వర్క్ చేసినప్పుడు చైతన్య సెట్స్‌కి వచ్చేవారు. అప్పుడే ఆయన నాకు చాలా నచ్చారు. ఆయన బయట వేసుకునే కాస్ట్యూమ్స్ నా సినిమాలకి రిఫరెన్స్‌గా చూపిస్తాను. దేవిశ్రీ సర్ మ్యూజిక్‌కి హ్యాట్సప్ అన్నారు. చాలా డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తాడు. సాయి పల్లవి అద్భుతమైన నటి. తనని అందరూ ఇష్టపడతారు. తను చాలా

# 'కన్నప్ప' నుంచి ఎక్సైటింగ్ ప్రభాస్ లుక్

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' సినిమాను మోహన్ బాబు అత్యంత భారీ ఎత్తున నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. కన్నప్ప చిత్రాన్ని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో ప్రమోషన్స్ పెంచేశారు. ప్రతీ సోమవారం కన్నప్ప చిత్రంలోని పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా సోమవారం నాడు కన్నప్ప నుంచి ప్రభాస్ పాత్రను రివీల్ చేశారు. రుద్రుడిగా ఈ చిత్రంలో ప్రభాస్ అద్భుతంగా కనిపించబోతున్నాడు. ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు.. శివాజ్ఞ పరిపాలకుడు అంటూ ప్రభాస్ పోషిస్తున్న పవర్ ఫుల్ పాత్రను అందరికీ పరిచయం చేశారు. ప్రభాస్ వేషధారణ, లుక్ చూస్తుంటే దైవత్వం ఉట్టి పడేలా కనిపిస్తోంది. ఇప్పటికే కన్నప్ప నుంచి శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ ఫస్ట్ లుక్ పోస్టర్లను చిత్రయూనిట్ రివీల్ చేసింది. కన్నప్ప చిత్రంలో మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం వంటి మహామహులెందరో నటిస్తున్నారు. ఇది వరకు రిలీజ్ చేసిన టీజర్ అందరిలోనూ అంచనాలు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కన్నప్ప టీం ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శించే పనిలో పడింది. సినిమా విడుదలయ్యే లోపు పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించుకుంటామని విష్ణుమంచు తెలిపారు.



# లాంఛనంగా 'సతీ లీలావతి' ప్రారంభం

ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో వైవిధ్యమైన పాత్ర లతో కథానాయికగా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించు కున్న లావణ్య త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నం.1గా భీమిలీ కబడ్డీజట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి)తదితర విభిన్న చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి నిర్మాతలుగా రూపొందుతోన్న చిత్రం 'సతీ లీలావతి'. సోమవారం ఉదయం ఈ సినిమా పూజా కార్యక్రమాలు రామోజీ ఫిల్మ్ సిటీలోని సంఘి హౌస్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, చిత్ర సమర్పకులు జెమినీ కిరణ్, నిర్మాతలు హరీష్ పెద్ది, వి.ఆనంద ప్రసాద్, అన్నే రవి, డైరెక్టర్ తాతినేని సత్య తండ్రి, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ సహా పలువురు సినీఇండస్ట్రీ ప్రముఖులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీష్ పెద్ది క్లాప్ కొట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు తాతినేని సత్య 'ఆహ్లాదాన్ని కలిగించే చక్కటి ఎంటర్‌టైనర్‌గా 'సతీ లీలావతి' రూపొందుతుంది. మనస్ఫూర్తిగా నవ్వుకునే రొమాంటిక్ డ్రామాగా అన్నివర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలతో సినిమా తెరకెక్కు తుంది. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ జోడీ ఫ్రెష్ లుక్‌తో మెప్పించనున్నారు.



# 'ప్రొడక్షన్ నం.7' నుంచి 'కె-ర్యాంప్'

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం గతేడాది 'క' సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశారు. ఆయన కెరీర్‌లోనే 'క' సినిమా హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. అలాంటి డిఫరెంట్ సబ్జెక్ట్ తరువాత కిరణ్ అబ్బవరం ఎలాంటి సినిమా చేస్తారు? ఎలాంటి సబ్జెక్టులు ఎంచుకుంటారు? అన్న కుతుహలం ఆడియెన్స్‌లో పెరిగిపోయింది. ఈ క్రమంలో కిరణ్ అబ్బవరం 11వ ప్రాజెక్ట్ అప్డేట్ వచ్చింది. 'సామజవరగమన', 'ఊరుపేరు భైరవకోన' వంటి బ్లాక్ బస్టర్‌ల తరువాత హాస్య మూవీస్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నంబర్ 7గా సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ నిర్మిస్తున్న కొత్త ప్రాజెక్ట్‌కి 'రీర్యాంప్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ మూవీని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ 'రీర్యాంప్' సినిమాకు కొత్త డైరెక్టర్ జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం జరిగిన ఈ సినిమాకు పూజా కార్యక్రమానికి దిల్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి క్లాప్ కొట్టారు. నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచ్చాన్ చేశారు. డైరెక్టర్స్ విజయ్ కనకమేడల, రామ్ అబ్బురాజు, యదు వంశీ, రైటర్ ప్రసన్న స్క్రిప్ట్ అందజేశారు. యోగి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి, సీనియర్



నరేష్ పాల్గొన్నారు. తాజాగా రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్ చూస్తుంటే నిజంగానే ర్యాంప్ ఆడించేలా ఉన్నారు. ఇదేదో యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన స్టిల్‌లా కనిపిస్తోంది. కిరణ్ అబ్బవరంను పూర్తిగా చూపించలేదు గానీ.. చుట్టూ ఆ మందిని చూస్తుంటే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసినట్టుగానే ఉన్నారు. టైటిల్ లోగోలో ఉన్న ఆ బొమ్మ, ఆ మందు సీసా, ఆ ఫుట్ బాల్‌ను చూస్తుంటే అందరిలోనూ ఆసక్తిరేకెత్తించేలా ఉన్నాయి.




# త్వరలోనే 'అసుర సంహారం' షూటింగ్

క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలని చూసేందుకు ఆడియెన్స్ ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ క్రమంలో 750 చిత్రాలకు పైగా నటించి మెప్పించి తనికెళ్ల భరణి ప్రస్తుతం ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రాన్ని చేస్తున్నారు. ఈ మూవీని శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ళ సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యూలాయిడ్స్ బ్యానర్ మీద సాయి శ్రీమంత్, శబరిష్ బోయెళ్ళ నిర్మించనున్నారు.



ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం ఇలా అన్నిం టిని కిషోర్ శ్రీకృష్ణ హ్యాండిల్ చేయనున్నారు. అసుర సంహారం సినిమాలో తనికెళ్ల భరణితో పాటుగా.. మిధున ప్రియ ప్రధాన పాత్రలో నటించనున్నారు. విలేజ్ క్రైమ్ డ్రామాగా రూపొం దుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాలో ఇతర తారాగణం గురించి, ఇతర వివరాల గురించి త్వరలోనే ప్రకటించనున్నారు. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. నటీనటులు: తనికెళ్ల భరణి, మిధున ప్రియ తదితరులు.

# 'ప్రేమిస్తావా'కు భారీ రెస్పాన్స్

ఆకాష్ మురళి, అదితి శంకర్(స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె) జంటగా 'పంజా'ఫేం విష్ణు వర్ధన్ తెరకెక్కించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలై బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ 'ప్రేమిస్తావా' అనే టైటిల్‌తో జనవరి 31న తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసిన ఈ సినిమా అందరినీ అలరించి సూపర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. సక్సెస్ మీట్‌లో హీరో ఆకాష్ మురళి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ముందుగా ఆడియన్స్ సపోర్ట్‌కి థ్యాంక్. నన్ను తెలుగు ఇండస్ట్రీలోకి ఎంతో ప్రేమతో వెల్ కమ్ చేయడం ఆనందంగా వుంది. చాలా మంది ఆడియన్స్ ఇది నా డెబ్యు సినిమాలా అనిపించడం లేదని చెప్పడం గొప్ప కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. సినిమాకి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందంగా వుంది. తెలుగులో సినిమాలు చేయాలని వుంది. ఇంత ప్రేమని అందించిన ఆడియన్స్‌కి థాంక్ యూ సో మచ్. ఇందులో లవ్ స్టొరీ అందరూ రిలేట్ చేసుకునేలా వుందనే కాంప్లిమెంట్స్ రావడం ఆనందంగా వుంది. చేజ్ సీన్స్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా మీ అందరికీ నచ్చడం చాలా సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. డైరెక్టర్ విష్ణు వర్ధన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. తెలుగు లో సినిమా చాలా అద్భుతంగా రీచ్ అయ్యింది. స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీ వారు చెప్పడం చాలా ఆనందంగా అనిపించింది. మాకు సపోర్ట్ చేసిన మీడియాకు, ఆడియన్స్‌కు థాంక్ యూ సో మచ్. మీ సపోర్ట్ ఎప్పుడూ ఇలానే వుండాలని కోరుకుంటున్నాను. రిలేషన్షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. పోర్చుగల్ లొకేషన్ తీసిన సీన్స్ చాలా భారీ ఖర్చుతో తీయడం జరిగింది. జైలు సెటప్ కూడా అద్భుతంగా వుంది. యాక్షన్ సీన్స్ చేయడం చాలా డిఫికల్ట్. ఇందులో వుండే క్రైమ్ ఎలిమెంట్ అందరినీ సర్ప్రైజ్ చేస్తోంది. ఆకాష్ చాలా ట్యాలెంటెడ్. చాలా చక్కగా నటించాడు. తనే రియల్‌గా స్టంట్స్ చేశాడు. అదితి శంకర్ అద్భుతంగా నటించింది. కల్కి నటన ఈ సినిమాకి మరో ఆకర్షణ. చాలా నేచురల్‌గా చేసింది. లవ్ జోనర్ నాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. రాబోయే సినిమా మరో కొత్త జోనర్ ట్రై చేయాలని వుంది. నిర్మాత స్నేహ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మీ అందరి సపోర్ట్‌కు థాంక్ యూ. సినిమాకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మంచి రివ్యూలు వచ్చాయి. మా టీం తరపున ఆడియన్స్‌కి థాంక్ యూ సో మచ్ అన్నారు. తారాగణం: ఆకాష్ మురళి, అదితి శంకర్, ఆర్ శరత్ కుమార్, ప్రభు, కుష్బూ సుందర్.



# 14న 'ఇట్స్ కాంప్లికేటెడ్'

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ కామెడీ చిత్రం కృష్ణ అండ్ హిస్ లీల. 2020లో కరోనా మహమ్మారి సమయంలో నేరుగా విడుదలైన ఈ సినిమా ఇన్సంట్ హిట్ సాధించింది. రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం లవ్ స్టోరీ పై ఒక రిఫ్రెషింగ్ టేక్, ఇందులో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు, రానా దగ్గుబాటి ఈ పాపులర్ చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నారు. డిజిటల్ లో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఫిబ్రవరి 14న కొత్త ట్విస్ట్‌తో థియేటర్లలోకి వస్తుంది ఈ సినిమా టైటిల్‌ను ఇట్స్ కాంప్లికేటెడ్‌గా మార్చారు. ఈ కొత్త టైటిల్ మరింత ఆసక్తిని జోడించడమే కాకుండా, సినిమా కంటెంట్‌కి పర్ఫెక్ట్‌గా యాప్ట్ అయ్యింది. రానా దగ్గుబాటి, సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పెరెపు ఓ హిలేరియస్ వీడియోతో ఈ అనౌన్స్మెంట్ చేశారు. ప్రమోషనల్ యాక్టివిటీస్ గురించి కూడా హింట్ ఇచ్చారు. ట్యాలంటెడ్ శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ సినిమాకి షానియల్ డియో, సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు డీవోపీగా పని చేశారు, ఇట్స్ కాంప్లికేటెడ్ హ్యూమర్, ఎమోషనల్ హై అందిస్తుందని ప్రామిస్ చేస్తోంది.



# సిసిఎల్ జెర్సీ లాంచ్ ఈవెంట్

సిసిఎల్ 11వ సీజన్ అండ్ తెలుగు వారియర్స్ థ్రిల్లింగ్ గేమ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. సెలబ్రీటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) ఫిబ్రవరి 8న బెంగళూరులో 11వ సీజన్‌ను ప్రారంభం కానుంది, ఇది మైదానంలో మరపురాని క్షణాలను అందిస్తోంది. ఈ సీజన్‌లో నాలుగుసార్లు ఛాంపియన్‌లుగా తమ లెగసీ కంటిన్యూని చేయడానికి వారి ప్రతిష్టాత్మకమైన 5వ టైటిల్ గెలుపు కోసం సిద్ధమవుతున్న బలమైన జట్టు తెలుగు వారియర్స్‌పై అందరిదృష్టి ఉంది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ జెర్సీ లాంచ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది.తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సిసిఎల్ అందరి డ్రీం క్రికెట్. ఆ డ్రీం మాకు సిసిఎల్ రూపంలో తీరింది. ఈక్రెడిట్ విష్ణుకి ఇస్తాను. తన ఆలోచన గొప్ప విజయం సాధించింది. వెంకటేష్‌కి థాంక్ యూ. ఆయన సపోర్ట్‌ని మర్చిపోలేను. మా టీం అంతా నా ఫ్యామిలీ. అన్ని సమయంలో చాలా సపోర్ట్ చేశారు. అఖిల్ పాషనేట్ క్రికెటర్. వండర్ ఫుల్ పర్సన్. తమన్ టీంలో స్పిరిట్‌ని తీసుకొస్తుంటారు. మాస్పాన్సర్స్ అందరికీ థాంక్ యూ అన్నారు. అశ్విన్ మాట్లాడుతూ, విష్ణు అన్న చాలా సక్సెస్



14 ఏళ్ల జర్నీ. గ్లింప్స్‌లో చూస్తే ఓ చోట మరీ చిన్నపిల్లాడిలా కనిపించాను. సిసిఎల్ ఆడుతూ పెరిగాను. విష్ణు, సచిన్ పాషన్‌తో ఇది సాధ్య పడిందని భావిస్తున్నాను. మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈ సారి కూడా టైటిల్ కొట్టి ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలుస్తామనే నమ్మకం వుంది. అన్నిటికంటే అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే పాషన్‌తో వస్తున్నాం. 14, 15 ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. అందరూ వచ్చి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాము అన్నారు. ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ, క్రికెట్ అనేది నా చైల్డ్ వుడ్ డ్రీం. సిసిఎల్ ఫార్మెట్ నా డ్రీంనితీర్చింది. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ ఆడటం ఓ అదృష్టం. అఖిల్ అగ్రెసివ్ కెప్టన్. తన ఎత్తుగడలు అద్భుతంగా వుంటాయి. తనలో చాలా ఫైర్ వుంది. క్రికెట్ మాకు చాలా ఎనర్జీ ఇస్తోంది. మాది చాలా క్రేజీ టీం. సచిన్ టీంకి ఓనర్‌తో పాటు ఆటగాడిగా బిగ్గెస్ట్ స్ట్రెంత్. మూడు నెలలుగా చాలా ప్రాక్టీస్ చేశాం. ఈసారి తప్పకుండా కప్ కొడతాం. విష్ణు చాలా పాషన్‌తో సీజన్స్‌ని ముందుకు తీసుకుతీసుకెళ్తున్నారు. అందరికీ థాంక్ యూ సో మచ్ అన్నారు. సచిన్ జోషి మాట్లాడుతూ, ఇండియాలో ఫుల్‌గా సీజన్ రన్ చేస్తున్నారు.మేమంతా చాలా పాషన్‌తో ఆడుతున్నాం. ఐదోసారి కప్ తీసుకొస్తామని మా టీం అందరి తరపున చెబుతున్నాను. రఘు మాట్లాడుతూ, సిసిఎల్‌ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో నిర్వహిస్తున్న విష్ణు థ్యాంక్ యూ. నాలుగు స్టార్లు కప్పుకొట్టాం. ఈసారి మళ్ళీ కప్పు కొడతాం అన్నారు. ఆది మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. తెలుగు వారియర్స్ కెప్టన్ అఖిల్ మాకు విరాట్ కోహ్లి లాంటి ప్లేయర్, చాలా పాషన్‌తో ఆడుతున్నాం.

4-2Pg5.qxd:4-2Pg5.qxd 01/01/01 8:11 AM Page 1




# మన నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌వి‌ఎస్-2 క్షేమం


## కక్ష్య పెంచడంలో ఇస్రోకు ఇబ్బందులు

## త్వరలోనే సరిదిద్దుతామన్న శాస్త్రవేత్తలు

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** భారత ప్రతిష్టాత్మక 100వ రాకెట్ జిఎస్ఎల్‌వి-ఎఫ్15 ద్వారా జనవరి 29న ప్రయోగించిన ఎన్‌విఎస్2 నావిగేషన్ ఉపగ్రహంలో సాంకేతిక లోపం ఇస్రోకు కొరకరాని కొయ్యగా మారింది. అయితే ప్రస్తుతానికి ఈ ఉపగ్రహం క్షేమంగా ఉన్నట్లు ఇస్రో ప్రకటించింది. ఉపగ్రహంలోని ప్రధానమయిన లిక్విడ్ అపోజి మోటార్ (ఎల్ఎఎం) ఇంజన్ మాత్రం ఉపయోగించలేని స్థితిలో ఉన్నట్లు చెబుతున్నారు. అందువలన ఇస్రో ఇప్పుడు దాని పెరిజీని కొద్దిగా పెంచడానికి ఉపగ్రహంలోని యాటిట్యూడ్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను ఉపయోగించాలని ప్రయత్నిస్తోంది. 200 కిలోమీటర్ల కంటే తక్కువ పెరిజీ ఉన్న (భూమికి తక్కువ దూరం) ఏదయినా ఉపగ్రహం అస్థిర కక్ష్యలోనే ఉంటుందని, ప్రస్తుతానికి ఈ ఉపగ్రహం భూమికి 170 కిలోమీటర్ల దూరంలో కోడిగుడ్డు ఆకారంలో పరిభ్రమిస్తోందని తెలుస్తోంది. దీన్ని వృత్తాకార కక్ష్యలోకి మార్చడం ఇప్పుడు అత్యవసర పరిస్థితి. ఈ పెరిజీని 200 కిలోమీటర్ల కంటే కొంత ఎక్కువగా పెంచడానికి శాస్త్రవేత్తలు భూకేంద్రాల నుంచి ప్రయత్ని స్తున్నారు.



ప్రయోగానికి ముందు రాకెట్ హీట్ షీల్డ్ మధ్య ఎన్‌విఎస్2 ఉపగ్రహం




గత నెల 29న జిఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశించిన ఎన్‌విఎస్-2

దాన్ని వృత్తాకార జిఎస్ఓ కక్ష్యలోకి చేర్చడం కొంత సందేహాస్పదంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రైజింగ్ ఆపరేషన్ దీర్ఘ వృత్తాకార కక్ష్య నుంచి ముందుగా ఉద్దేశించిన ప్రకారం నావిగేషన్ ప్రయోజనాల కోసం ఇతర శాటిలైట్ల దగ్గర చేర్చడానికి ఇస్రో పరిష్కార మార్గాన్ని వెతుకున్నట్లు కూడా చెబుతున్నారు. జిఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ నిర్దేశించిన కక్ష్యలోకి దూసుకెళ్లి నావిగేషన్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టింది. జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ఈ ఉపగ్రహాన్ని విడిచిపెట్టింది. అన్ని ప్రయోగ వాహన దశలు సక్రమంగా పనిచేయడంతో పాటు ప్రయోగం ముగిసిన తర్వాత కూడా ఉపగ్రహంలోని సోలార్ ప్యానళ్లు విజయవంతంగా విచ్చుకున్నాయి. విద్యుత్ ఉత్పత్తితో పాటు గ్రౌండ్ స్టేషన్‌తో కమ్యూనికేషన్ ఏర్పాటు చేయబడింది. కక్ష్యను రైజింగ్ చేయడానికి సాధారణంగానే ఉపగ్రహాల్లో ఉండే థ్రస్టర్లను మండిస్తారు. ఈ ఉపగ్రహంలోని ఆక్సిడైజర్‌ను అనుమతించే వాల్వులు తెరుచుకోకపోవడంతో ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్య దిశగా పెంచే కార్యక్రమాలు ఆశించిన రీతిలో జరగడం లేదు. అయితే ఇస్రో సోమవారం సాయంత్రం ఉపగ్రహ వ్యవస్థలు క్షేమంగా ఉన్నాయని, ఉపగ్రహం ప్రస్తుతం దీర్ఘ వృత్తాకార కక్ష్యలో ఉందని, నావిగేషన్ కోసం ఉపగ్రహాన్ని వినియోగించడానికి ప్రత్యామ్నాయ మిషన్ వ్యూహాలు రూపొందిస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది.



# విద్యార్థులే టార్గెట్

## ఉచితాలను వల్లె వేస్తున్న ప్రధాన పార్టీలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** అసెంబ్లీ ఎన్నికలకు తేదీలు దగ్గరపడుతున్నకొద్దీ దేశ రాజధాని ఢిల్లీలో నాయకుల ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఒకరిపై ఒకరు విమర్శలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు మరింతపెంచారు. బిజెపి ఎక్కువగా ఆమ్ ఆద్మీపార్టీనే టార్గెట్‌చేస్తూ లిక్కర్ కుంభకోణం, విద్యారంగంపైనే విమర్శలు ఎక్కుపెడుతుంటే బిజెపి అధికారంలోకి వస్తే మొత్తం మురికవాడలను ధ్వంసం చేస్తుందని, తనకున్న మిత్రులకు మాత్రమే బిజెపి ఉపయుక్తంగా ఉంటుందని, ఢిల్లీప్రజలు గతంలో ఒకసారిచూసారని ఆతప్పులుమళ్లీచేయవద్దంటూ ఆప్ ప్రతి విమర్శలు చేస్తోంది. మరోపక్క కాంగ్రెస్ కూడా ఢిల్లీ అభివృద్ధిచెందాలంటే షీలాదీక్షిత్ హయాం నాటి పాలన రావాలని కాంగ్రెస్ వస్తే సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందంటూ ప్రచారాన్ని ముమ్మరంచేస్తున్నారు. ఇపుడు ఢిల్లీ ఓటర్లంతా కూడా బిజెపి ఆప్ కాంగ్రెస్ పార్టీలచుట్టూనే రాజకీయం నడుస్తోంది. అటు ప్రధానిమోడీతోపాటు ఇటు హోంమంత్రి అమిత్‌షాకూడా ఆప్ టార్గెట్‌గా ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ సీఎం పనిచేసిన వ్యక్తి పాట్‌పర్ నియోజకవర్గం ఎందుకు వదిలేసారో అడగండంటూ ధ్వజమెత్తారు. వాడవాడలా మద్యంషాపులు తెరిచారని, మందిరం, మసీదు, సిక్కు,జైనదేవాలయాలవద్ద మందిరాలను ఏర్పాటుచేసారని ఇందుకోసమా మీరు ఆప్‌ను ఎన్నుకున్నదంటూ ధ్వజమెత్తారు. లిక్కర్ అక్రమాలవల్లనే సిసోడియా, కేజ్రీవాల్‌లు ఇద్దరూ జైలు ఊచలు లెక్కపెట్టారని ఆరోపించారు. ప్రధానిమోడీ అయితే ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం చిన్నపిల్లలు అంటే విద్యార్థులు పదోతరగతికి మించి వెళ్లకూడదన్న లక్ష్యంత ఉన్నట్లుగా కనిపిస్తోందని, పాస్ గ్యారంటీ ఉన్నవారిని మాత్రమే ఆప్ అనుమతిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫలితాలు తక్కువ వస్తే వారి ప్రతిష్ట దెబ్బతింటుందన్న భయంతో ఇలా పరిమితులు విధించి విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్నాయని ప్రధానిఆరోపించారు. జంగ్‌పుర నియోజకవర్గంలో అమిత్‌షా మాట్లాడుతూ డిప్యూటీసీఎం ఇక్కడకు వచ్చారని ఆయన పాట్‌పర్‌గంజ్ ఎందుకు వదిలేసారో అందరికీ తెలుసునని అన్నారు. ఈ విమర్శల దాడితో పాటు మూడు పార్టీలుకూడా విద్యార్థులనే టార్గెట్ చేస్తున్నాయి. కొత్త ఓటర్లు చేరి మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకునే వారు కూడా సంఖ్యాపరంగా ఎక్కువ మంది రావడంతో పార్టీలన్నీ వారికి చేరువయ్యేందుకు హామీలు కుమ్మరిస్తున్నాయి. మెట్రోలో రాయితీలు, ఆర్టీసీ బస్సుల్లోఉచిత ప్రయాణం, చదువులో వారికి ఆర్థికసాయం ఉపకార వేతనాలు ఎక్కువ మొత్తం అందిస్తామంటూ తాయిలాలతో ఓటర్లపై మమకారం కురిపిస్తున్నాయి. పోలింగ్‌కు ముందు 48గంటలకల్లా ప్రచారం సమాప్తంచేయాల్సి రావడంతో సోమవారం ప్రచారాన్ని రాజకీయ పార్టీలు మరింతగా ఉధృతంచేసాయి. ఢిల్లీ వీధుల్లో ఆప్, కాంగ్రెస్, బిజెపి జెండాలే ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి.

# అదో అతివాద మూర్ఖుల నేర సంస్థ




## యుఎస్ ఎయిడ్‌పై డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మండిపాటు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 3:** యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యుఎస్ఎఐడి)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. అదో నేర సంస్థ అని మస్క్ దుయ్యబట్టగా.. దానిని రాడికల్ మూర్ఖులు నడుపుతున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారిని తొలగించి, సంస్థ భవిష్యత్ కార్యాచరణపై తాను నిర్ణయం తీసుకుంటానని అధ్యక్షుడు వెల్లడించారు. అమెరికా ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో యుఎస్‌ఎయిడ్ విదేశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం చేస్తుంటే.. వారు ఆ డబ్బుతో కొవిడ్ వంటి ప్రమాదకర వ్యాధులను పుట్టించడానికి పరిశోధనలు చేస్తున్నారని మస్క్ ఆరోపించారు. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశాలకు అమెరికా అందించే అన్నిరకాల సాయాన్ని 90రోజులపాటు సస్పెండ్ చేస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై సంతకం చేసిన విషయం తెలిసిందే. విదేశాలకు అందించే సాయం అమెరికా విధానాలకు అనుగుణంగా ఉందా? లేదా? అనేది వారు సమీక్షిస్తున్న నేపథ్యంలో యుఎస్‌ఎయిడ్ పనితీరుపై వారు విమర్శలు గుపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ఏర్పడిన డోజ్ విభాగానికి.. వేతనాలకు సంబంధించిన ట్రెజరీ యాక్సెస్ విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే యుఎస్‌ఎయిడ్‌కు ప్రభుత్వం నుంచి అందే నిధులపై కత్తెర వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు దీనిని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కిందకు తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కాగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ను ప్రభుత్వానికి సంబంధించి అన్ని విషయాల్లో భాగం చేయడాన్ని డెమోక్రటిక్ సెనెటర్ క్రిస్ మర్ఫీ ఖండించారు. దేశ రహస్య సమాచారాన్ని మస్క్‌చేతిలో పెట్టడం, డోజ్‌కు ఎక్కువ హక్కులు ఇవ్వడం వల్ల జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అది 'వన్‌వే స్ట్రీట్' వంటిది..** కెనడాపై 25 శాతం సుంకాలు విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకున్నారు. అమెరికా విషయంలో చాలా యేళ్లుగా కెనడా దారుణంగా ప్రవర్తిస్తోందని అన్నారు. 'మా బ్యాంకులను వారు అనుమతించలేదు. వ్యవసాయ ఉత్పత్తులనూ అనుమత్తించలేదు. కానీ మేం మాత్రం కెనడా నుంచి అన్నీ అనుమతించాం. ఇది వన్ వే స్ట్రీట్‌లా ఉంది' అని ట్రంప్ మండిపడ్డారు. తాము ప్రతి యేడాది కెనడాకు 200 బిలియన్ డాలర్ల రాయితీ ఇస్తున్నామని.. అయినా దీనివల్ల తమ దేశానికి ఎటువంటి లాభం ఉండట్లేదని పేర్కొన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



## బ్లాక్ మెయిల్ తట్టుకోలేక శృంగారానికి పిలిచి హత్య!

**బరేలి(యుపి),ఫిబ్రవరి 3:** తనను తరచూ బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులను భరించలేని 32 యేళ్ల మహిళ ఆతడితో శృంగారంలో పాల్గొంటూనే ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. ఈ సంఘటన యుపిలోని బరేలిలో సంచలనం కలిగించింది. తనను తరచూ కోరికలు తీర్చాలంటూ వేధిస్తూ రాసాగాడని, రానురాను ఆతని వేధింపులు పెరిగిపోయని ఇక ఆతడని మట్టుబెట్టే లక్ష్యంతోనే ఈ మహిళ ఆతడని తనతో గడపేందుకు ఆహ్వానించి ఆసమయంలోనే ఆతడికి ఊపిరాడకుండాచేసి చంపేసింది. జరిజర్దోసీ కళాకారుడిగా ఇక్బాల్ తరచూ తన గ్రామానికి వచ్చేవాడని ఆతడితో పరిచయం పెరిగి మొబైల్ నంబర్లు ఇచ్చిపుచ్చుకోవడం తరచూ మాట్లాడుకోవడం జరిగేదని వివరించింది. ఒకరోజు తనుంటున్న నివాసానికి రావాలని కోరాడని అక్కడే ఇక్బాల్ తనకోరిక తీర్చాలంటూ బలవంతపెట్టాని లేనిపక్షంలో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరించి నా భర్తకు చెపుతానని బ్లాక్‌మెయిల్ చేసేవాడన్నారు. ఇక్బాల్ తన కాల్ రికార్డింగ్ మొత్తం భర్తకు ఇస్తానని బెదిరించేవాడని ఆమె పోలీసులకు వివరించింది. తనకు చిన్న పిల్లలు కూడా ఉన్నారని తాను భయంతో దూరం జరిగినా వెంటపడి వేధించాడని, దీనితో విసిగిపోయి ఈచర్యకు పాల్పడినట్లు తెలిపింది. ఇక్బాల్ తన భార్యను ఆమె తల్లితండ్రుల ఇంటివద్ద వదిలిపెట్టి వచ్చి తనను కలవాలని వచ్చాడని వివరించింది. అంతేకాకుండా ఇక్బాల్ తన భర్తకు రెండు మాత్రలు ఇచ్చి నిద్రపోయేలా చేసాడని, రాత్రి ఎనిమిది గంటలకు తనభర్తకు టీ ఇచ్చానని, ఈ మాత్రలను టీకప్‌లో వేసి ఇచ్చానని ఫోన్ చూస్తూనే నిద్రలోకి వెళ్లాడని, రాత్రి 11.40 గంటలకు ఇక్బాల్‌కు ఫోన్‌చేసి రమ్మని పిలిచానని, తాను ఒక్కడే ఉన్నాను రమ్మని చెప్పాడని, ఆతడిని చంపాలన్న లక్ష్యంతోనే ఆతడి ఇంటికి వెళ్లానన్నారు. ఆతడి రెండు చేతులు పట్టుకుని ఛాతిపై కూర్చుని ఆతడి నోరు, ముక్కుమూసి అదిమిపట్టానని, చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత ఆతడి శరీరాన్ని మెట్ల మీదికి లాగిపడేసి ఇంటికి వచ్చేసానన్నారు. ఆతడి బ్లాక్‌మెయిలింగ్, వేధింపులకు ఇదే సరైన చర్య అని వేరే దారిలేక ఇలా చేసానని చెపింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక్బాల్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించామని తెలిపారు.

# తొక్కిసలాటలో వెయ్యిమంది చనిపోయారు!

## యుపి మహాకుంభ్ ఘటనపై రాజ్యసభలో ప్రతిపక్షనేత ఖర్గే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** మహాకుంభ్‌మేళాలో జరిగిన తొక్కిసలాటలో వాస్తవాలను యుపి ప్రభుత్వం తొక్కిపెడుతోందని, వెయ్యిమందికిపైగా చనిపోయినట్లు మావద్ద సమాచారం ఉందని రాజ్యసభాపక్ష కాంగ్రెస్‌నేత ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఆరోపించారు. యుపి ప్రభుత్వం మాత్రం 30 మంది చనిపోయారని, మరో 60 మంది గాయపడినట్లు ప్రకటించిందని వాస్తవానికి అంచనాలకు మించి చనిపోయినట్లు తెలుస్తోందని యుపి ప్రభుత్వం దాచిపెడుతోందని ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో శనివారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైజరిగిన చర్చను ప్రారంభించిన ఖర్గే ముందుయుపి తొక్కిసలాటపై చర్చించాలని పట్టుబట్టారు. మౌని అమావాస్యరోజున మహాకుంభ్‌నగర్‌లో చనిపోయినవారికి నా ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నానని కాని ప్రభుత్వ లెక్కలతో ఏకీభవించనని వెయ్యిమందికిపైగా చనిపోయినట్లు తెలుస్తోందని అన్నారు. ఎవరినో విమర్శించేందుకు తాను వెయ్యి సంఖ్యను చెప్పడంలేదని అయితే వాస్తవిక సమాచారాన్ని ఇప్పటికైనా అందించాలనే తాను కోరుతున్నట్లు చెప్పారు. తాను చెప్పింది తప్పని భావిస్తే క్షమించాలని కోరారు. దీనితో అధికారపార్టీ సభ్యులనుంచి తీవ్ర నిరసన వ్యక్తం అయింది. ప్రతిపక్షనేతసభలో వేలసంఖ్యలో చనిపోయారని చెపుతున్నారని విపక్షనేతగా ఆయన చెప్పింది అత్యంత విలువలతో కూడి ఉంటుందని ఇపుడు మీరు చెప్పిన సంఖ్య అందరినీ ఆశ్చర్యపరుస్తోందని ఛైర్మన్ దన్‌కడ్ అన్నారు. కేంద్రం, యుపి ప్రభుత్వం మహాకుంభ్‌లో ఎలాంటి సంఘటనలు జరక్కుండా భద్రతాచర్యలు తీసుకోవడంలో అశ్రద్ధ చూపించాయని ఘోరంగా విఫలం అయ్యాయని ఖర్గేతోపాటు వివిధ విపక్ష పార్టీలనాయకులు ఆరోపించారు. సోమవారం వసంతపంచమి సందర్భంగా లక్షలాదిమంది భక్తులు త్రివేణి సంగమంలో స్నానాలుచేసారని మహాకుంభ్‌లో మూడో అమృత్‌స్నాన్‌సందర్భంగా కోట్లాది భక్తులు తరలివచ్చినట్లు సభ్యులు వెల్లడించారు. మూడుకోట్లమందికిపైగా పవిత్ర స్నానాలు చేసినట్లు యుపి ప్రభుత్వం ప్రకటించింది. 270 మంది ట్రైనీ ఐపిఎస్ అధికారులు, 77 మంది మహిళా అధికారులు ప్రయాగరాజ్‌లో నియమించామని వివిఐపిల రాకను కట్టడి చేసామని అన్నారు. ఏఘాట్‌లో అయినా సరే పవిత్రస్నానం చేయవచ్చని భక్తులకు హితబోధ చేస్తున్నట్లు యూపి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.అయితే రాజ్యసభలో ఖర్గే చేసిన వ్యాఖ్యలకు విపక్ష నేతలు కూడా తోడు కావడంతో అధికారపక్ష సభ్యులు అడ్డుకున్నారు.



# సోనియాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసారని పేర్కొంటూ బిజెపికి చెందిన కొందరు ఎంపిల బృందం ఎంపి సోనియాగాంధీపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంటుఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించిన సంగతి తెలిసిందే. తర్వాత పార్లమెంటు బయట ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి తన ప్రసంగంతో అలిసిపోయినట్లుగా కనిపించారని వ్యాఖ్యలు చేసారు. దేశ అత్యున్నత వ్యవస్థను సోనియా కించపరిచారంటూ బిజెపిఎంపిలు సోమవారం ఆమెపై నోటీసులు జారీచేసారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కించపరిచేవిధంగా దేశ ప్రథమ మహిళాపై వ్యాఖ్యలు చేసారని, అందువల్ల ఆమెపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు ఎంపిలు వెల్లడించారు. దేశ రాష్ట్రపతి అత్యున్నత పదవిని అవమానించడంతోపాటు అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థను సైతం అగౌరవ పరిచినట్లుగా భావిస్తున్నట్లు బిజెపి ఎంపిలు సభా ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్‌కు చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యలు సీనియర్ నాయకురాలు గతంలో యుపిఎ ఛైర్‌పర్సన్‌గా చేసిన విశేషానుభవం ఉన్ననేత చేయడం తగదని కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి ఎంపిలు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్‌కు లేఖరాసారు. సోనియా చేసిన వ్యాఖ్యలు పార్లమెంటరీప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం తగవని అన్నారు. పార్లమెంటరీ నైతిక విలువలు, నియమావళి కూడా సభ్యులు ఎవ్వరూ కూడా ఇతర సభ్యులపైనా ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయకూడదని సూచిస్తున్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు ఒక ఆదివాసి మహిళపట్ల ఆమెకున్న వైఖరిని స్పష్టంచేస్తున్నదని గిరిజన వ్యతిరేక వైఖరితోనే ఈ వ్యాఖ్యలుచేసారని,నిరుపేద గిరిజనులపై ఆపార్టీకి, ఆపార్టీ సీనియర్ నేతకున్న ధోరణి తేటతెల్లంచేస్తుందని అన్నారు. శుక్రవారం పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి చూడటానికి బాగా అలిసి పోయినట్లు కనిపిస్తున్నారని ఎక్కువసేపు మాట్లాడలేకపోయినట్లు తెలుస్తోందని అన్నారు. వెనువెంటనే రాష్ట్రపతి కార్యాలయం కూడా స్పందించింది. ఇలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. రాష్ట్రపతి ఆరోగ్యంపై ఆందోళన వలదని ఆమె కార్యాలయం స్పష్టం చేసింది. సోనియా వ్యాఖ్యలను ప్రధానిమోడీ, బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అనేక మంది సీనియర్ బిజెపి నేతలు కూడా సోనియా వ్యాఖ్యలు నిరాకరించారు. సోనియాపై బిజెపి నేతలుచేసిన వ్యాఖ్యలను ఆమె కుమార్తె వాయనాడు ఎంపి ప్రియాంకగాంధీ వాద్రా ఖండించారు. రాష్ట్రపతి ముర్ము అంటే తన తల్లి సోనియాకు ఎంతో గౌరవమని ఆమె వ్యాఖ్యలను వక్రీకరించి బిజెపి నేతలు విమర్శిస్తున్నారని ప్రత్యారోపణలు చేసారు. తన మాతృమూర్తికి ఇపుడు 78 ఏళ్ల వయసు అని రాష్ట్రపతి అన్నా ఆమె కార్యాలయం అన్నా అత్యున్నత గౌరవం ఉందన్నారు.

# గ్రామీ వేడుకల్లో దుస్తుల్లేకుండా ఫొటోలకు ఫోజులిచ్చిన ర్యాపర్ భార్య

**వాషింగ్టన్, ఫిబ్రవరి 3:** సంగీత రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న గాయనీ గాయకులు, మ్యూజిక్ డైరెక్టర్లు హాజరై సందడి చేస్తున్నారు. రెడ్ కార్పెట్‌పై నడుస్తూ ఫొటోలకు ఫోజులిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేడుకల్లో షాకింగ్ ఘటన ఒకటి చోటుచేసుకుంది. అమెరికన్ ర్యాప్ సింగర్ భార్య ఫొటో షూట్‌లో దుస్తులు తీసేయడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ఆమె చేసిన పనికి అక్కడున్న వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు.

గ్రామీ వేడుకలకు అమెరికన్ ర్యాపర్ కాన్యే వెస్ట్ 2025లో బెస్ట్ ర్యాప్‌సాంగ్‌కు నామినేట్ అయ్యాడు. ఈసందర్భంగా ఫంక్షన్‌కు తన భార్య, మోడల్ బియాంకా సెన్సోరీతో కలిసి వచ్చారు. అవార్డు ఫంక్షన్‌లోకి రాగానే రెడ్ కార్పెట్‌పై నడుస్తూ వెళ్లారు. ఇంతలో బియాంకా ఉన్నట్టుండి తన దుస్తులు తీసేసీ న్యూడ్‌గా ఫొటోలకు ఫోజులిచ్చారు. దీంతో అక్కడున్న వారంత షాక్ అయ్యారు. నిర్వాహకులు వెంటనే ఆ జంటను అక్కడి నుంచి బయటకు పంపించేశారు. అయితే, బియాంక ఎందుకు అలా ప్రవర్తించారో తెలియరాలేదు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరిన అయోధ్య రామాలయ పూజారి

**లక్నో, ఫిబ్రవరి 3:** అయోధ్య రామాలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్రదాస్ (85) ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో లక్నోలోని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. సత్యేంద్రదాస్ మధుమేహం, బిపితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన పరిస్థితి విషమంగాఉన్నట్లు పేర్కొన్నారు. తాము అందిస్తున్న వైద్యానికి ఆయన స్పంది స్తున్నారని వైద్యులు తెలిపారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ సత్యేంద్రదాస్ తాత్కాలిక రామమందిరానికి పూజారిగా



ఉన్నారు. 20ఏళ్ల వయసులో నిర్వాణి అఖాడాలో చేరి ఆధ్యాత్మిక దీక్ష తీసు కున్నారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్స వం, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమ యంలో ముఖ్య పాత్ర పోషించారు. ప్రస్తుతం రామాలయ ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు.

# ప్రచారం సమాప్తం: ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

## పోలింగ్‌కు సిద్ధం చేస్తున్న ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** ఢిల్లీఅసెంబ్లీ ఎన్నికలతోపాటు యూపి, తమిళనాడుల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌ను ఈనెల 5వ తేదీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పోలింగ్‌కుముందు ఢిల్లీ ఎన్నికలపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను వెల్లడించకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ఎగ్జిట్‌పోల్స్, పోలింగ్‌కు ముందు సర్వేలపై ఎన్నికలసంఘం పూర్తినిషేధం ప్రకటించి నోటిఫికేషన్ జారీచేసింది. ఫిబ్రవరి ఐదున ఉదయం ఏడు గంటలనుంచి సాయంత్రం 6.30 గంటలవరకూ ఎగ్జిట్‌పోల్స్ ప్రచురణ చేయకూడదని ప్రసారం చేయకూడదని నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే పోలింగ్‌ముగింపుసమయానికి 48 గంటల ముందు ఎలాంటి వార్తలు వెల్లడించకూడదని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటు యుపిలోని మిల్కిపూర్ అసెంబ్లీ స్థానం, తమిళనాడులోని ఈరోడ్ అసెంబ్లీ స్థానానికి ఈనెల ఐదున పోలింగ్ జరగనున్నది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. గడచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ పూర్తిమెజార్టీతోగెలిచింది. 70 సీట్లలో 2015లో 67 స్థానాలను గెలుచుకోగా, బిజెపికేవలం మూడుసీట్లకే పరిమితం అయింది. కాంగ్రెస్ అసలు ఖాతాయే తెరవలేదు. 2020లో కూడా ఆప్ తనహవా కొనసాగించింది. ఆ పార్టీ 62 స్థానాలు గెలుచుకోగా బిజెపి మిగిలిన 8 స్థానాలు దక్కించుకుంది. వరుసగా రెండోసారి కూడా కాంగ్రెస్‌కు రిక్తహస్తమే మిగిలింది. ఇదిలా ఉంటే ఐదో తేదీ జరిగిన పోలింగ్‌కు సంబంధించి ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. చివరిరోజు రాజకీయ పార్టీల అధినేతలంతా కూడా ఢిల్లీలోని నియోజకవర్గాల్లో తమతమ ప్రచారంతో హోరెత్తించారు. ప్రధాని మోడీ సైతం విద్యార్థులతో గ్రూప్ ముచ్చట్లు నిర్వహించి ఆప్‌పై విమర్శలు సంధించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ ఆమ్ ఆద్మీపార్టీనే టార్గెట్ చేసుకుని తమతమ ప్రచారాన్ని నిర్వహించాయి. కాగా ఢిల్లీ ఎన్నికలకోసం మొత్తం 42వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించారు. 150 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు, 70 కంపెనీలు పదిరాష్ట్రాలనుంచి ఆర్మీ బలగాలను నియమిస్తున్నారు. పోలీసులు 43 మేజర్, 100కు పైగా చిన్న సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసారు. పొరుగు రాష్ట్రాలపైనా నిఘా పెంచారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. క్రైమ్ స్పెషల్ సిపి దేవేష్ చంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ మద్యం, నగదును పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడువేల పోలింగ్‌కేంద్రాలు సమస్యాత్మకమైనవి




ఉన్నాయని ఆయన అన్నారు. 196 కిలోల డ్రగ్స్, 78 కోట్ల నగదు, 1008 లీటర్ల అక్రమ మద్యం జప్తుచేసినట్లు తెలిపారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా పొరుగురాష్ట్రాలతో కూడా కలిపి సంయుక్త కార్యాచరణ సమావేశం నిర్వహించారు. మొత్తం 600కిపైగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసారు. నాన్‌బెయిలబుల్ వారంట్లు పెండింగ్‌లో ఉన్న 30 వేలమందిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేసామన్నారు. 85శాతం పెండింగ్ వారంట్లు కూడా క్లియర్ చేస్తామన్నారు.

4-02Pg6exHMNWJQE.qxd:4-02Pg6exHMNWJQE.qxd 01/01/01 9:52 AM Page 1



# కాణిపాకంలో వేడుకగా అక్షరాభ్యాస కార్యక్రమం


పిల్లల చేత ఓనమాలు దిద్దిస్తున్న ఆలయ ఈఓ పెంచల కిషోర్.

**కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మాఘ శుద్ధపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత సోమవారం 500 మంది భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. విఘ్ననాధుడైన వినాయకుని చెంత తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే అంతా శుభమే కలుగుతుందని భక్తుల ప్రగాడ విశ్వాసం. ఈమేరకు సోమవారం వసంతపంచమి సరస్వతీదేవి జన్మించిన శుభఘడియలు కావడంతో కాణిపాకం దేవస్థానం ఆస్థాన మండపంలో భక్తులు పెద్దఎత్తున అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ పిల్లలకు విఘ్ననాధుని చెంత ఓనమాలు దిద్ధించి అక్షరాభ్యాసం చేయించారు. ప్రతిరోజూ ఆలయంలో పదుల సంఖ్యలో మాత్రమే అక్షరాభ్యాసంలు జరుగుతుంటాయి. అయితే ఆదివారం వసంత పంచమి మంచి ముహూర్తం కావడంతో గణనాధుని చెంత అక్షరాభ్యాసం చేయించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆస్థానం మండపం పూర్తిగా నిండిపోయింది. ఈమేరకు ఆదివారం సుమారు 250 మంది భక్తులు టిక్కెట్‌లు కొనుగోలు చేసి తమ పిల్లలకు అక్ష్యరాభ్యాసం చేయించగా సోమవారం 500 మంది భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈమేరకు అర్చకులు అలంకరించిన సరస్వతీ దేవి అమ్మవారిని ప్రధానప ఆలయం నుండి మంగళవాయిద్యాల నడుమ ఆస్థానం మండపంకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పిల్లల చేత ఓనమాలు దిద్దించారు. దీనితో ఆస్థాన మండపం భక్తులతో కిక్కిరిసింది. ఈసందర్భంగా ఆలయ ఈఓ పెంచల కిషోర్ పిల్లల చేత స్వయంగా ఓనమాలు దిద్దించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావులతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, పిల్లలు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్‌గా డిఇ రమేష్ ప్రమాణస్వీకారం

## ఓటింగ్ కు హాజరైన ఎమ్మెల్యే బాలయ్య, ఎంపి పార్థసారథి


ఓటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

**హిందూపురం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** హిందూపురం స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత డి.ఇ.రమేష్ కుమార్ ఎన్నికయ్యారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు హిందూపురం తెలుగుదేశం పార్టీ పార్టీలో చురుకైన నేతగా, అజాత శత్రువుగా గుర్తింపు పొందిన రమేష్ కు ఎట్టకేలకు న్యాయం జరిగింది. పెనుకొండ రిసార్ట్స్ లో క్యాంపు నుంచి సోమవారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్న మున్సిపల్ కౌన్సిలర్లు స్థానిక శాసనసభలో బాలకృష్ణను కలిశారు. తదుపరి ఉదయం 10:30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం చేరుకున్నారు. ఎన్నికల అధికారి, ఆర్డిఓ ఆనంద్ కుమార్, సహాయ అధికారి మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు నేతృత్వంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగానే తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థిగా రమేష్ కు మద్దతు ఇచ్చే కౌన్సిలర్లు చేతులెత్తాలని ఆర్డిఓ కోరారు. ఎక్స్ అఫీషియో హోదాలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి సహా మొత్తం 23 మంది మెజారిటీ సభ్యులు చేతులెత్తి మద్దతు ఇవ్వడంతో చైర్మన్ గా రమేష్ ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. మరోవైపు వైసీపీ ప్రతిపాదిత చైర్పర్సన్ అభ్యర్థి లక్ష్మికి మద్దతుగా 14 మంది చేతులెత్తారు. కౌన్సిలర్ గుర్తింపు కార్డు తీసుకు రాలేదన్న కారణంతో వైసిపి కౌన్సిలర్ మారుతి రెడ్డిని పోలీసులు అనుమతించకపోవడంతో ఆయన ఓటును అధికారులు ఓటింగ్ పరిగణన లోకి తీసుకోలేదు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఐదు నిమిషాల్లో ముగిసింది. జై బాలయ్య నినాదాలతో కౌన్సిల్ హాల్ మారుమోగింది. హిందూపురం మున్సిపల్ 22వ చైర్మన్ గా రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి డిక్లరేషన్ ఫారం ను అధికారులు అందజేశారు. ఎమ్మెల్యేకు రమేష్ పాదాభివందనం చేయగా బాలయ్య ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు తెస్తున్నట్లు మరోసారి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా హిందూపురం పై సానుకూలంగా ఉన్నారని ఆనందం వ్యక్తం చేశారు. రోడ్లు,డ్రైన్లు, తాగునీటి సరఫరా కోసం రూ. 200 కోట్లతో పాటు అదనంగా మరో 100 కోట్లు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనకు పద్మభూషణ్ అవార్డు రావడంపై బాలయ్య స్పందించారు. అవార్డులు తనకు అలంకారం కాదని తానే అవార్డులకు అలంకారమని అభివర్ణించారు. తన తండ్రి ఎన్టీఆర్ కు భారతరత్న రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏలు శ్రీనివాసరావు, బాలాజీ, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, అంజలి, అయూబ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్, నెట్టప్ప,లేపాక్షి ఆలయం ట్రస్ట్ చైర్మన్ రమానందన్, పట్టణ మాజీ అధ్యక్షులు అమర్నాథ్, భాస్కర్, మంగేష్, ప్రియా గంగాధర్ తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రమేష్ ను సత్కరించారు. వైసీపీ కౌన్సిలర్ల నిరస న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కౌన్సిల్ హాల్లో జరుగుతున్న సమయంలో ఉత్కంఠ నెలకొంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో గెలుపొంది టిడిపి శిబిరంలో కూర్చున్న కౌన్సిలర్లను ఉద్దేశించి వైసిపి కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమి ప్రజాస్వామని విమర్శిస్తూ, జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ కౌన్సిల్ నుంచి బయటకు వెళ్లిపోయారు. మున్సిపల్ చైర్మన్ గా నిన్నటి వరకు వ్యవహరించిన బలరామిరెడ్డి, వైస్ చైర్మన్ జబీవుల కౌన్సిలర్లు శివకుమార్, ఆసిఫ్, నాగేంద్రబాబు తదితర 14 మంది కౌన్సిలర్లు ఎన్నికను బహిష్కరిస్తూ వెళ్లిపోయారు.

# ఉన్నత విద్యావ్యవస్థలో ప్రక్షాళన

## - విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేష్



**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా, ఉన్నత విద్యావ్యవస్థలో ప్రక్షాళన చేపడతామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఏపి ప్రైవేట్ డిగ్రీ కాలేజి మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ గుడ్డిగా వ్యతిరేకించడం తమ ప్రభుత్వ అభిమతం కాదని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసి స్టేక్ హోల్డర్లతో చర్చించిన తర్వాత ఏకాభిప్రాయంతో మాత్రమే కీలకాంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని భావిస్తున్నా... విద్యాశాఖలో ఇన్ని సమస్యలు ఉంటాయని నేను ఊహించలేదు... సవాల్ గా స్వీకరించి ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నా. ప్రజాప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవు... అయితే ఒకసారి నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి ఉండాల్సిందే. రాష్ట్రంలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్దామని మంత్రి లోకేష్ అన్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజి యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు డిగ్రీ కళాశాలలకు ప్రతిఏటా అఫ్లియేషన్ స్థానంలో అయిదేళ్ల అఫ్లియేషన్ విధానాన్ని తెచ్చేందుకు మంత్రి లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యాజమాన్యాల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రతినెలా ఉన్నత విద్యాశాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని చెప్పారు.ఏపి ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలను విన్నవిస్తూ... గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిఏటా అఫ్లియేషన్ విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అయిదేళ్లకోసారి అఫ్లియేషన్ విధానాన్ని అమలుచేయాలి. అఫ్లియేషన్ ఫీజు ఒక్కో యూనివర్సిటీ పరిధిలో ఒక్కొక రకంగా ఉంటోంది. రాష్ట్రమంతటా కామన్ ఫీజు విధానాన్ని అమలుచేసే అంశాన్ని ప్రవేశపెట్టండి. పాత డిగ్రీ కాలేజిలతోపాటు కొత్త కళాశాలలకు కూడా నిర్ణీత సమయంలో అదనపు కోర్సులకు అనుమతి ఇచ్చేలా జిఓ నెం.36ని సవరించండి. రెగ్యులేటరీ కమిషన్ పరిధిలో ఫీజుల నిర్ణయం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. దీనివల్ల క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించలేకపోతున్నాం. వయబిలిటీ ఆధారంగా బేసిక్ ఫీజు నిర్ణయం జరగాలి. డిగ్రీ కళాశాలల్లో ఆన్ లైన్ అడ్మిషన్ విధానంలో మార్పులు తేవాలి. ఇంటర్మీడియట్ అడ్మిషన్ తరహాలో డిగ్రీ అడ్మిషన్లు చేపట్టే విధానాన్ని పరిశీలించండి. గత ప్రభుత్వంలో తెచ్చిన 70:30 మేనేజ్ మెంట్ కోటా విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఈ విధానం స్థానంలో ఆప్షనల్ విధానాన్ని అమలుచేయండి. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంవల్ల రాబోయే రోజుల్లో ఉన్నత విద్యారంగం పెనుసవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది.

దీనివల్ల విద్యార్థులు వివిధరకాల అవకాశాలను అందిపుచ్చుకునే స్కోప్ తగ్గిపోతుంది. ఇప్పటికే డిగ్రీ కాలేజిల్లో ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా ఉంది.

సింగిల్ మేజర్ విధానం వల్ల ఈ కొరత మరింత తీవ్రతరం అవుతుంది. టీచింగ్ ఫీల్డ్ కు వెళ్లే వారికి ఖచ్చితంగా కాంబినేషన్ సబ్జెక్ట్స్ ఉండాలి. సిలబస్ రీ స్ట్రక్చర్ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయండి.

# సరస్వతిమాతగా దుర్గమ్మ

## - వైభవవంగా వసంత పంచమి ఉత్సవాలు




**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ వసంత పంచమి సందర్భంగా భక్తులను శ్రీ సరస్వతిమాతగా అభయ ప్రధానం చేశారు. దుర్గమ్మ ఆలయంలో సోమవారం పవిత్ర వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ సరస్వతి యాగంలో పూర్ణాహుతులు సమర్పించారు. ఇఓ కె రామచంద్ర మోహన్ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈ సందర్భంగా శ్రీమహాసరస్వతి యాగంలో వుంచిన కలములు, కంకణములు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను పంపిణీ చేశారు. విద్యాధిదేవతగా ప్రసన్న వదనంతో దర్శనమిచ్చే దుర్గమ్మవారిని వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. పవిత్ర మాఘమాసం సందర్భంగా దుర్గమ్మవార్ల ఆలయంలో సూర్యోపాసన సేవలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు. అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 4వ తేదీ రథసప్తమి, 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం,

24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్ధశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు.

# రాష్ట్రంలో మెడికల్ ఫెసిలిటి అభివృద్ధి చేయడంలో మా వంతు కృషి చేస్తాం

## -సినీ నటుడు సోనూసూద్

**సచివాలయం,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య సౌకర్యాలు కల్పించడంలో నావంతు సహాకారం అందిస్తానని సినీనటుడు సోనుసూద్ అన్నారు.సోమవారం ఏపి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చాలామంది అంబులెన్స్‌లు కావాలని అడిగారు.దానిలో భాగంగా అంబులెన్స్‌లు ఎమర్జెన్సీలైఫ్ సేవింగ్ కోసం ఇస్తున్న ఏపి ప్రజలు నా హృదయానికి చాలా దగ్గర సీఎం సారధ్యంలో ఏపి ప్రభుత్వం అవసరం అయినవారికి ఉద్యోగాలు కల్పనలో కృషిచేస్తున్నారు.ఏపి నా రెండవ ఇల్లు,ఇక్కడి ప్రజలు నన్ను ఇలా నిలబెట్టారు.నాభార్య ఏపికి చెందిన వ్యక్తి,ఆమె తెలుగు వ్యక్తి ఎవరికి ఏ అవసరం వచ్చినా ఒక ఫోన్ కాల్ దూరంలో ఉంటాను.ఇక్కడి వారు గొప్పవాళ్లు అయ్యాక నేమ్,సినిమాల్లో సంపాదించి నేమ్,ఫేమ్ సాధించాక వారు తిరిగి సొసైటీకి ఇవ్వాలి,కోవిడ్ సమయం నుండి సీఎంతో టచ్‌లో ఉన్నా మొదటిసారిగా ఏపి కే అంబులెన్స్‌లు ఇచ్చాను.

# సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా రైతులకు అత్యాధునిక సేవలు

## - ఎపిఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం


శిక్షణ తరగతులకు హాజరైన వివిధ రాష్ట్రాల అధికారులు

**కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సిఓఇ)ద్వారా రైతులకు అత్యాధునిక సేవలు అందుబాటులో తెచ్చేలా సిఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కుప్పం మండలం బంగానత్తం వద్ద గల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (హార్టీకల్చర్ హబ్)లో జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల అధికారులకు మూడవ విడత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సిఎం చంద్రబాబునాయుడు రైతుల సౌకర్యార్థం కుప్పంలో 2019 జనవరిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించారన్నారు. ఇక్కడ వివిధ రకాలైన కూరగాయల నారు మొక్కలు, అంటుకట్టడం, పూలమొక్కలు రాయితీతో రైతులకు అందించడం జరుగుతోందన్నారు. ఇటీవలే ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిఓఇని మరింత అభివృద్ధి చేసి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రాజెక్ట్ అధికారి న్యూఢిల్లీ ఎంబసీ బ్రహ్మదేవ్ మాట్లాడుతూ కుప్పం సిఓఇలో అమలు చేస్తున్న పద్ధతులు రైతులకు ఉపయోగకర ంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా అంటుకట్టు విధానం జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు దేశంలోని 12 రాష్ట్రాలనుంచి వచ్చిన అధికారులకు ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఐడిహెచ్ పథకంలో యాంత్రీకరణలో భాగంగా రైతులకు యాభైశాతం రాయితీతో పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, స్ప్రేయర్లు అందించడం జరుగుతోందన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ కుప్పం సిఓఇలో మూడో విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఉన్న అన్ని సిఓఇలకంటే కుప్పం సిఓఇలో కూరగాయల అంటు కట్టే విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. కుప్పం సిఓఇ దేశంలోని మిగతా సిఓఇలకన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తూ రైతులకు ఉపయోగపడుతూ జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు సాధించిందన్నారు. అనంతరం రైతులకు రాయితీతో పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, ఎడిహెచ్‌సిఓ కోటేశ్వరరావు, కుప్పం, శాంతిపురం ఉద్యానవన అధికారులు డింపుప్రియశ్రీ, వింధ్య, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, వివిధ రాష్ట్రాలవారు ఉన్నారు.

# టిడ్కో ఇళ్ల పూర్తికి రూ.6వేల కోట్లు అవసరం


## హడ్కో రుణం రూ.4500 కోట్లు సాధించాం

## టిడ్కో రాష్ట్ర చైర్మన్ అజయ్‌కుమార్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** రాష్ట్రంలో టిడ్కో ఇళ్ళను పూర్తి చేయుటకు రూ. 6వేల కోట్లు కావాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో హడ్కో నుంచి రూ.4,500 కోట్లు రుణం సాధించారని టిడ్కో ఛైర్మెన్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం రాజీవ్‌నగర్ సమీపంలో సుమారు 6వేల ఇళ్ళను గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు నిర్మించారని అజయ్‌కుమార్ వివరించారు. సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు.

ఇళ్ల పూర్తి చేసి ఐదేళ్ళు గడచినా . . .

శ్రీకాళహస్తిలో 2019లో టిడ్కో ఇళ్ళను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించి టోకెన్లు జారి చేసినట్లు ఛైర్మెన్ అజయ్ కుమార్ వివరించారు. అయితేఐదేళ్ళు పరిపాలించిన వైకాపా పాలకులు ఇళ్ళకు రంగులు మార్చారు.కానీ లబ్ధిదారులకు అందించలేదన్నారు.తమ వారికి కట్టబెట్టుకోవటానికి లబ్ధిదారులను తప్పు దారి పట్టించి జగనన్న కాలనీల్లో ఇళ్ళ స్థలాలు అందించి మోసం చేసారన్నారు.తెలుగుదేశం హయాంలోనే డబుల్ బెడ్‌రూం, సింగిల్ బెడ్‌రూంలు నిర్మించామని అయితే మౌళిక సదుపాయాలు కల్పించే దశలో ప్రభుత్వం మారిందన్నారు. 3 చదరపు ఇళ్ళను కేవలం రూపాయికి నిజమైన లబ్ధిదారుల స్థానంలో వైకాపా బినామిలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకొని నిరుపేదలకు అన్యాయం చేసారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6వేల కోట్లు


శ్రీకాళహస్తిలో టిడ్కో లబ్దిదారులతో మాట్లాడుతున్న చైర్మెన్ అజయ్‌కుమార్

కావాలి: రాష్ట్రంలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన ఇళ్ళనుపూర్తి చేయుటకు మౌళిక సదుపాయాలు కల్పించుటకు రూ.6వేల కోట్లు నిధులు అవసరం అని అయితే చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హడ్కోతోచర్చించి రూ.4500 కోట్లు రుణం సాధించారన్నారు. మరో 1200కోట్లు ఇళ్ళపై ఇచ్చిన బ్యాంకు రుణాలున్నాయని వివరించారు.ఈ ఏడాదిడిసెంబర్ నాటికి డబుల్, సింగిల్‌బెడ్ రూంలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం పక్కాగా ముందడుగు వేస్తుందని వివరించారు. లబ్ధిదారుల పేరుతో గత ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని నిధులు మళ్ళించుకొని జల్సాలు చేసుకున్నారని వివరించారు.

లబ్ధిదారులను ఆదుకొనుటకు . . .

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కేటాయించిన ఇళ్ళపై రుణాలను బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని అయితే లబ్ధిదారులకు ఇళ్ళు అప్పగించకుండా పోవటంతో బ్యాంకులు వత్తిడి తెస్తున్నారని వారిని ఆదుకొనుటకురూ.145కోట్లు మంజూరు చేసి బ్యాంకులకు చెల్లిస్తున్నట్లు ఛైర్మెన్ వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఆయన లబ్ధిదారులతో మమేకమయ్యారు.ఈ సమావేశంలో స్థానిక అధికారులు పూర్తి చేయుటకు రూ.50కోట్లు కావాల్సి ఉందని ఛైర్మెన్ దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట, సాయి,తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, బిజెపికి చెందిన అమర్‌నాథ్, మున్సిపల్ కమిషనర్ బియస్ గిరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.లబ్ధిదారులు పోలోమని తాము తమ ఆస్తుల్ని తాకట్టు పెట్టి డిపాజిట్‌చేసామని కొందరు తన భార్య తాళిబొట్టులను తాకట్టు పెట్టి మున్సిపాలిటికి డిపాజిట్‌చేసామని మరి కొందరు ఛైర్మెన్‌కు మొరబెట్టుకున్నారు.

# నూతన ఈద్‌గాహ్ నిర్మాణానికి శ్రీకారం

**తొట్టంబేడు,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఈదుల గుంటలో పురాతన ఈద్‌గాహ్‌లో అభివృద్ధికి సోమవారం ఉదయం ముఫ్తి నయిం సాహెబ్ ప్రార్థనలతో శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కంటిచూపు మేరలో ఉన్న స్థలాన్ని కేటాయించారు.సుమారు పాతిక సంవత్సరాల తరువాత ఆయన తనయుడు ఇక్కడ ప్రార్థనలకు ప్రశాంత వాతావరణం కల్పించుటకు చొరవ తీసుకున్నారు.ఇక్కడ ఈద్‌గాహ్ అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరుకు ప్రకటించారు.ఈ నేపథ్యంలో రంజాన్ ప్రార్థనలు జరుపుటకు ఇంకా 50రోజులు ఒడటంతో పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం ముస్లిం పెద్దలు హాజరై పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టారు.ఇక్కడ ఆధునిక శైలిలో ఈద్‌గాహ్ గోడను నిర్మించుటకు ప్రార్థనలుజరిపారు.ఈద్‌గాహ్ గోడను గురించి చరవాణిలో శాససభ్యుడు వెంకట సుధీర్‌రెడ్డి మత పెద్దలతో పార్టీ నాయకులతో చర్చించారు. ఇక్కడ ఉత్తరదక్షిణంగా వంద అడుగుల గోడను మినార్‌ల నమూనాలను రూపకల్పన చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ముస్లింలు ప్రార్థనలుచేసారు.

# సూర్యగమనానికి సూచిక రథసప్తమి

**తొట్టంబేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** తెలుగుప్రజలు సూర్యుడిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగల్లో రథసప్తమి ముఖ్యమైనది. సూర్యుడిని జగత్తుకు వెలుగునిచ్చే దైవంగా హిందువులు ఆరాధిస్తారు. మాఘమాసంలోని శుక్లపక్షంలోని ఏడవ రోజును రథసప్తమిగా పాటిస్తారు. సూర్యుడి రథాన్ని ఏడు గుర్రాలు లాగుతుంటాయని, ఆ గుర్రాల గమనం ఈరోజు దక్షిణం నుంచి ఉత్తరానికి మళ్లుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఇలా సూర్యుడి గమనం దక్షిణం నుంచి ఉత్తరానికి మారేది రథసప్తమి రోజునే అని అంటారు. రథసప్తమి రోజు నుండే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది.దక్షిణ భారతదేశంలో ఈరోజున మకరసంక్రాంతి పండుగను జరుపుకుంటారు.నేటి నుంచి చలిక్రమంగా తగ్గి, ఎండ పెరుగుతుంది. ఈవిధంగా ఎండపెరగడం అనేది వ్యవసాయానికి కూడా కొంత ఉపయోగంగా ఉంటుంది కాబట్టే రైతులు కూడా రథసప్తమిని పాటిస్తారు. ఇలా వ్యవసాయంతో సంబంధం ఉన్న హిందువులు పండుగలు రెండే..ఒకటి సంక్రాంతి, మరొకటి ఈ రథసప్తమి. రథసప్తమిని సూర్యుడి జన్మదినంగా కూడా హిందువులుపాటిస్తారు. రథసప్తమి రోజున సూర్యుడి దేవాలయాలు ఉన్న ఒరిస్సాలోని కోణార్క్‌లోను, ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా అరసవెల్లిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అరసవెల్లిలోని సూర్యుడి ఆలయంలో రథసప్తమి రోజు సూర్యకిరణాలు ఆలయంలోని సూర్యుడి విగ్రహం పాదాలను స్పృశిస్తాయని చెబుతారు.


# కేంద్ర బడ్జెట్ 2025-26 అన్ని వర్గాల వారికి మేలుచేసేలా ఉంది

## - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని

**విజయవాడ.ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర బడ్జెట్ 2025-26 అన్ని వర్గాల వారికి మేలుచేసేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు వికసిత భారత్ ఫలాలు అందేలా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వైకాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. జగన్ పాలనలో కేంద్ర పథకాలకు స్టిక్కర్లు వేసుకున్నారని వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లల్లో అద్భుతమైన పాలన అన్న వారు.. ఇప్పుడు తప్పు పడుతున్నారని తెలిపారు.మేము ప్రజల కోసం, రాష్ట్రం కోసం పని చేస్తుంటే... తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్‌లు మా పై బురద జల్లుతున్నాయి. ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తే... వైసీపీకి ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు. ఆత్మ, పరమాత్మ అనుకున్న వాళ్లు కూడా వైకాంగ్రెస్ పార్టీని వీడుతున్నారు.

# గత ఐదేళ్లలో అధ్వాన్నంగా మారిన క్రీడా వ్యవస్థ : శాప్ చైర్మన్ రవినాయుడు

## - పరిటాల ఘాట్ వద్ద నివాళి.. ఎమ్మెల్యే సునీతతో భేటి


ఎమ్మెల్యే పరిటాల సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

**అనంతపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త బ్యూరో** గత ఐదేళ్లలో క్రీడా వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారిందని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ రామగిరిలోని పరిటాల రవీంద్ర స్టేడియం అని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఆయన సోమవారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం పరిటాల నివాసంలో ఎమ్మెల్యే సునీతతో బేటి అయ్యారు. క్రీడా పరంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సునీత వివరించారు. పాఠశాలల్లో క్రీడల పరంగా ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. గతంలో తాము ఏర్పాటు చేసిన వాటిని కూడా పర్యవేక్షణ లేక నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్పోర్ట్స్ స్టేడియంల గురించి చర్చించారు. వైసిపి హయాంలో అవి ఎలా మరుగున పడ్డాయన్నది ఎమ్మెల్యే సునీత వివరించారు. అనంతరం రామగిరి ఎంజేపి పాఠశాలకు చెందిన జూడో టీం విద్యార్థులు శాప్ ఛైర్మన్‌ను కలిశారు. ఇటీవల రాష్ట్రంలో సాధించిన పతకాలతో ఎమ్మెల్యే సునీత సమక్షంలో శాప్ ఛైర్మన్‌ని కలిశారు. ఒక మారు మూల ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు ఇలా జూడో వంటి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాలల్లో క్రీడలు ఆడుతున్న వారిని ప్రోత్సహించాలని, ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అక్కడి నుంచే నేరుగా రవినాయుడు రామగిరిలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ స్టేడియంకు వెళ్లారు. స్థానిక టిడిపి నాయకులు, శాప్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులతో కలిసి స్టేడియంను పరిశీలించారు. టిడిపి హయాంలో 2 కోట్ల 20లక్షలతో స్టేడియం నిర్మిస్తే.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో దీనిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి ప్రాంతంలో నాయకులు వివరించారు. వెంటనే వీటి మరమ్మత్తులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

4-2pg7exHMNWJQE.qxd:4-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:56 AM Page 1



# గందరగోళం మధ్య ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు!

## సిజిజి, ఇంటర్ బోర్డు మధ్య సమన్వయ లోపం

### 4 విడతల్లో కొనసాగనున్న పరీక్షలు

### 2008 కేంద్రాలు ఏర్పాటు చేసిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు గందరగోళంగా మొదలయ్యాయి. విద్యార్థులకు ఒక దగ్గర ప్రాక్టికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి.. ఎక్స్‌టర్నల్‌కి మరోచోట సెంటర్‌ను వేశారు. ఇంటర్ బోర్డు, సీజీజీ మధ్య సమన్వయ లోపంతో మొదటి రోజు ప్రాక్టికల్ పరీక్షలు గందరగోళంగా ప్రారంభమయ్యాయి. అయితే ఇంటర్ విద్యార్థులకు మొదటి రోజు ప్రాక్టికల్ పరీక్షలు జరిగిన నేపథ్యంలో.. ఎక్స్‌టర్నల్స్‌గా నియమించబడిన లెక్చరర్లకి ఆ కాలేజీలో పరీక్షల నిర్వహణ కోసం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని మిక్స్‌డ్ అక్యూపెన్సీ కాలేజీలకు ఫైర్ ఎన్‌ఓసీ లేకుండానే ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో వాటిలో కూడా కొన్ని కాలేజీలకు ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదట నిర్ణయించిన సమయంలో మిక్స్‌డ్ అక్యూపెన్సీ కాలేజీలకు సెంటర్లు లేకపోవడంతో.. ఆయా కాలేజీల విద్యార్థులకు ఇతర కాలేజీల్లో ప్రాక్టికల్ సెంటర్లను వేశారు.. కానీ ప్రభుత్వ అనుమతి తరువాత ఆయా కాలేజీలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఆ కాలేజీ విద్యార్థులు బయటికి వెళ్ళాల్సిన అవసరం లేకుండా అదే కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారు. మొదట వీరికి ఇతర కాలేజీలో సెంటర్ వేసిన నేపథ్యంలో వారి కోసం ఎక్స్‌టర్నల్‌గా నియమితులైన లెక్చరర్లు విద్యార్థుల కోసం ఎదురు చూశారు. పరీక్ష టైం వరకు వారు రాకపోవడంతో.. విషయం తెలుసుకొ.. జరిగిన విషయాన్ని బోర్డు అధికారులు చెప్పారు. దీంతో ఎక్స్‌టర్నల్ ఎగ్జామ్ సెంటర్ నుంచి వెళ్లి పోయారు. మరికొన్ని చోట్ల మధ్యాహ్నం ప్రాక్టికల్ పరీక్షల్లో కొంత సేపు సర్వర్ సమస్య కావడంతో పరీక్షలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలు ముందుగానే ఫైనల్ అయితే ఇటువంటి సమస్య తలెత్తేది కాదని సంబంధిత లెక్చరర్లు చెబుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు నాలుగు స్పెల్స్‌లో కొనసాగుతూ 22 వరకు కొనసాగనున్నాయి. మొదటి స్పెల్ ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, సెకండ్ స్పెల్ ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు, మూడో స్పెల్ ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు చివరగా నాలుగో స్పెల్ ఫిబ్రవరి 18 నుంచి 22 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 4,29,052 మంది హాజరు కానున్నారు. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2008 కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మరో సెషన్ నిర్వహించనున్నారు. సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలకు 1812 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఒకేషనల్ విద్యార్థుల కోసం 463 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,33,052 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానుండగా.. 95,247 మంది ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు.

# మహిళల సుస్థిర భవిష్యత్తు ప్రభుత్వం లక్ష్యం

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో తెలంగాణ ముందంజ : మంత్రి శ్రీధర్‌బాబు



సోమవారం వి హబ్ (ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్)ను సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి చాలా ముఖ్యమైనదని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. సోమవారం మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం స్థాపించిన ప్రాముఖ్యమైన సంస్థ వి హబ్‌ను (వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్), తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేము అన్నారు. సమాన అవకాశాలు కల్పించేందుకు, మహిళలకు సుస్థిర భవిష్యత్తును అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రాముఖ్యమైన భాగస్వాములు అని గవర్నర్ అన్నారు. ఐటీ, పరిశ్రమ, వాణిజ్యశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిం చారు. 'మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉంది. మహిళా శక్తి, మహాలక్ష్మి పథకాలు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు, వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చుకు నేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుండి వచ్చిన మహిళలకు మరింత ప్రోత్సాహం అందించడం మా ప్రాధాన్యత అని అన్నారు.

మహిళా పారిశ్రా మికవేత్తల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పడానికి ఈ సందర్శన సూచిస్తుంది. మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిని ప్రోత్సహించే సమగ్ర వ్యవస్థను రూపొం దించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది మరో మైలురాయి అన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా వ్యాపారవేత్తల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి వి హబ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అవసరమైన వనరులను అందించడంతో పాటు, మహిళలందరికీ వ్యాపా రాన్ని అభివృద్ధి చేసుకునే సమగ్ర అవకాశాలను అందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోందన్నారు. వి హబ్ సిఈఓ సీతా పల్లచోల్లా మాట్లాడుతూ భారతదేశంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన మొట్టమొదటి సంస్థగా, మేము మా బాధ్యతను చాలా ప్రాముఖ్యంగా చూస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాదు, తెలంగాణలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు మా సేవలు అందాల్సిందేనని, ఇది మా అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్, మంత్రి మహిళా పారిశ్రామికవేత్తలతో పరస్పర చర్చలు జరిపి, వారి వ్యాపారాభివృద్ధికి అవసరమైన మద్దతు అందించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. వి హబ్ మహిళా పారిశ్రామికవేత్తలకు మెంటార్షిప్, క్రెడిట్ లింకేజీ సహాయంతో పాటు మార్కెట్ అనుసంధానం, టెక్నాలజీ వనరులను అందించేందుకు నిరంతరం కృషి చేస్తుంది. ఈ సందర్శన రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యత ఇస్తుందో తెలియజేస్తుందన్నారు.

## బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

# చిత్తశుద్ధి ఉంటే కెసిఆర్ సభకు రావాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 3:** కులగణన సర్వేపై బిఆర్ఎస్ పార్టీ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. కులగణన నివేదికను ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీకి అందించారని, పలు అంశాలు చర్చించి కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. తాము ఎన్నికల ముందు చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పూర్తి చేసిందని, ఇప్పటికీ వివరాలు ఇవ్వనివారు ఎవరైనా ఉంటే వివరాలు అందించవచ్చని మంత్రి పొన్నం సూచించారు. ప్రధాన రాజకీయ పార్టీల పెద్దనేతలు కూడా సర్వేకు వివరాలు ఇవ్వలేదని, కవిత ఒక్కరే సర్వే బృందానికి వివరాలన్నీ అందించారన్నారు. బీసీలకు న్యాయం జరిగే సమయం వచ్చిందని, దానిని ఎవరు అడ్డుకోవాలని చూసినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్య క్రమానికి అడ్డుపడే శక్తులు ఉంటే వారిని అడ్డుకొని ముందుకు పోవాలని కోరుతున్నట్లు మంత్రి పొన్నం సూచిం చారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాలు ప్రభుత్వానికి ధన్య వాదాలు చెబుతూ అభినందిస్తూ సంబరాలు చేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. నాడు ప్రభుత్వ ఉద్యోగులు సర్వేల కోసం వస్తే దాడులు చేసి అవమానించారన్నారు. నేడు అదే సర్వే విజయవంతం కావడంతో సైలెంట్ అయ్యారన్నారు. గతంలో మాదిరిగా సర్వేకు సం బంధించిన అన్ని వివరాలను ఫ్రిజ్ లో పెట్టే రకం తాము కాదని, తప్పనిసరిగా అన్ని వివరాలను సమాజం ముందు ఉంచుతామన్నారు. ఇంకా సర్వేపై ఎవరికైనా అనుమానాలు ఉంటే తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వివరాలు ఇవ్వనివారు ఎందుకు ఇవ్వలేదో కవిత ప్రశ్నించాలని మంత్రి అన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ రావాలని, తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. అందుకు ప్రత్యేక ఆహ్వానం




ఆయనకేమీ అందజేయమని మంత్రి అన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి హాజరవుతారని.. లేకుంటే వేరేలా ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. సర్వే గురించి సర్వేకు సహకరించని వారు కూడా మాట్లాడడం అర్ధరహితంగా ఉందని, రాష్ట్రంలో 96.9 సర్వే పూర్తిగా జరిగిందన్నారు.

## టాలీవుడ్ నిర్మాత కెపి చౌదరి గోవాలో ఆత్మహత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి, 3, ప్రభాతవార్త:** టాలీవుడ్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సుంకర కృష్ణప్రసాద్ చౌదరి, అలియాస్ కెపి చౌదరి (48) గోవాలో సోమ వారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చౌదరి మృతదేహం గోవాలోని సియోలిమ్‌లో గల అతని నివాసంలో వుండగా ఇంట్లో పని మనుషులు కనుగొని దీనిపై పోలీసులకు సమా చారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగు చూసింది.




ఖమ్మం జిల్లాకు చెందిన కెపి చౌదరి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బిటెక్ చదివి పలుచోట్ల ఉద్యోగం కూడా చేశాడు. 2016లో తెలుగు సినీ రంగంలో డిస్ట్రిబ్యూటర్‌గా ప్రయాణం ప్రారంభించిన కెపి చౌదరి ఆ తరువాత పలు తెలుగు, ఇతర భాషల సినిమాలకు నిర్మాతగా వ్యవహరిం చాడు. రజనికాంత్ నటించిన కబాలి తెలుగు వర్షన్‌కు ఇతను నిర్మాతగా వున్నాడు. దీంతో పాటు సర్దార్ గబ్బర్ సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె పువ్వు, అర్జున్ సుర వరం సహా పలు చిత్రాలు నిర్మించాడు. అయితే కెపి చౌదరి నిర్మించిన సినిమాల్లో కొన్ని ఆర్థికంగా నష్టం కలిగించడంతో అతను తన మకాంను గోవాకు మార్చి అక్కడ ఒక క్లబ్‌ను తెరిచాడు. అయితే క్లబ్ ఆశించినంత మేరకు లాభాలు తేకపోవడంతో టాలీవుడ్‌లో తనకు పరిచయం వున్న ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేశాడని పోలీసు లు చెబుతున్నారు. 2023లో రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్ వద్ద కారులో వంద ప్యాకెట్ల కొకైన్‌తో వస్తుండగా ఇతను పోలీసులకు దొరికిపో యాడు. ఈ ఘటన తరు వాత పలు ఇతర కేసులు కూడా ఇతని మెడకు చుట్టుకున్నాయి. దీంతో కెపి చౌదరి పూర్తిగా గోవాకు పరిమితమయ్యాడు. అయితే గోవాలో ప్రారంభించిన క్లబ్ నష్టాలు తేవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. గోవాలో డ్రగ్స్ డాన్ ఎడ్విన్ సహా పలువురు డ్రగ్స్ సరఫరా దారులతో కెపి చౌదరికి సంబంధాలున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో వున్న కెపి చౌదరి గోవాలోని సియోలిమ్‌లో తాను వుంటున్న ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా ఇతని మృత దేహాన్ని గోవా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా కెపి చౌదరి ఆత్మహత్యపై సియోలిమ్ పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు గోవాకు వెళ్లారు.



మస్తాన్‌సాయి (ఫైల్)

## నగ్న విడియోల కేసు..

# మస్తాన్ సాయి అరెస్టు

### 300 విడియోల హార్డ్‌డిస్క్‌ను పోలీసులకిచ్చిన లావణ్య

### మస్తాన్ వల్లే హీరో రాజ్‌తరుణ్ తననుంచి విడిపోయాడని ఆరోపణ

**హైదరాబాద్ (నార్సింగి), ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** హీరో రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు సోమవారం మస్తాన్ సాయిని అరెస్టు చేశారు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం... యూట్యూబర్ మస్తాన్ సాయి ఇతరుల ప్రైవేటు వీడియోలు తీసి బ్లాక్ మేయిల్ చేస్తున్నాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ 300.వరకు వీడియోలున్న హార్డ్‌డెస్క్‌ను లావణ్య పోలీసులకు అందజేసింది. నా భర్త రాజ్ తరుణ్ పలువురు అమ్మాయిలతో గడిపిన వీడియోలు, ఇతరులకు చెందిన ప్రైవేటు వీడియోలు ఈ హార్డ్‌డిస్క్‌లో ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గండిపేట మండలం కోకాపేట్‌లో మస్తాన్ సాయిని అరెస్టు చేసి, గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి, న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. కోర్టు 14.రోజులు రిమాండ్‌కు తరలించింది. మస్తాన్‌తో పాటు మరో యువకుడిని సైతం అరెస్టు చేశారు. మస్తాన్ గతంలో వరలక్ష్మీ టిఫిన్‌సెంటర్ డ్రగ్స్ కేసులో అరెస్టు అయ్యాడు. ఓ తెలుగు హీరోకు సంబంధించిన ప్రైవేటు వీడియోలు, వందలాది మంది మహిళలకు సంబంధించిన నగ్న విడి యోలు ఈ హార్డ్ డెస్క్‌లో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. లావణ్య ఇచ్చిన వీడియోలు ఒరిజి నలా? కాదా? అన్నది కూడా విచారిస్తామని పోలీ సులు తెలిపారు. హార్డ్‌డెస్క్‌లోని వీడియోలు పరిశీ లించి మస్తాన్ సాయిపై చట్ట పరిధిలో కఠినంగా వ్యవమరిస్తామని పోలీసులు వివరించారు.

**హార్డ్‌డిస్క్ కోసం నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నారు : లావణ్య**

మస్తాన్‌సాయి అమ్మాయిలను సీక్రెట్ కెమెరాలు పెట్టి, ఫోన్ స్క్రీన్‌తో రికార్డులు చేస్తూ వఇడియోలు తీస్తుంటాడు. ఇలా తీసిన వీడియోలున్న ఓ హార్డ్ డిస్క్‌ను నేను నార్సింగి పోలీసులకు అప్పగించాను. ఈ విషయం తెలుసుకున్న మస్తాన్ సాయి, అతడి తల్లిదండ్రులు నన్ను చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. 2.సంవత్సరాల నుంచి సాక్ష్యాలు లేనందున ఆగాను, ఇప్పుడు వీడియోలు లభించాయి, దీంతో మళ్లీ నార్సింగి పోలీసులకు వీడియోలున్న హార్డ్‌డిస్క్‌ను అందించి, కేసు పెట్టాను. నాపై కూడా అత్యాచారం చేసి, తీసిన వీడియోలు కూడా ఇందులో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. రాజ్ తరుణ్ నానుంచి విడిపోవడానికి మస్తాన్ సాయే ప్రధాన కారణమని లావణ్య ఆరోపించింది. ఈ విధంగా రికార్డు చేసిన ప్రైవేటు వీడియోలను చూపించి బాధితులను శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వేధించాడని తెలిపింది. 2.పేజీల పిర్యాదును లావణ్య పోలీసులకు అందజేసింది. ఇతరుల ఫోన్‌లను హ్యాక్ చేసి, అందులోని వీడియోలు, కాల్ రికార్డ్స్, ఫొటోలు డౌన్‌లోడ్ చేసి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ హార్డ్ డిస్క్‌లో సినిమా, యాంకరింగ్, సాఫ్ట్‌వేర్ రంగం, బడా పారిశ్రామిక వేత్తలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, కాల్ రికార్డింగ్‌లు ఉన్నాయని వివరించింది. వినార్సింగి పోలీసు స్టేషన్ వద్ద మీడియా మస్తాన్ సాయిని ఈ విషయంపై ప్రశ్నిస్తే నన్ను మళ్లీ ట్రాప్ చేసిందని, కావాలని ఇరికిస్తున్నారని ఆరోపించాడు.

### నేరగాళ్లు దోచుకున్న నగదు రూ. 13 వేల కోట్లు

### కొత్తతరహా నేరాలపై నేరగాళ్ల ఫోకస్

### సైబర్ నేరాలపై ఐసిసిసిసి నివేదికలో విస్తుపోయే అంశాలు

# భారత్‌లో గతేడాది 12 లక్షల సైబర్ నేరాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి, 3, ప్రభాతవార్త:** భారత్‌లో సైబర్ నేరగాళ్లు 50కి పైగా కొత్త తరహా నేరాలపై ఫోకస్ పెట్టినట్లు సైబర్ నేరాలపై నిరంతరం అధ్యయనం చేసే ఇండియన్ సైబర్ క్రైం కో..ఆర్డినేషన్ సెంటర్ (ఐసిసిసిసి) పరిశీలనలో తేలింది. ఈ సంస్థ తాజాగా వెల్లడించిన నివేదికలో సంచలన విషయాలను పేర్కొంది. 2024లో భారత్‌లో మొత్తం మీద 12 లక్షలకు పైగా సైబర్ నేరాలు జరగగా వీటి ద్వారా 13 వేల కోట్ల రూపాయలను నేరగాళ్లు దోచుకున్నారని ఐసిసిసిసి తన నివేదికలో వెల్లడి ంచింది. భారత్‌లో జరిగిన మొత్తం నేరాలలో 45 శాతం నేరాలు కాంబోడియా, మియన్మార్, లావోస్ దేశాలు కేంద్రంగా జరిగినట్లు ఆ నివేదిక తెలిపింది. సైబర్ నే రాలకు సంబంధించి గోల్డెన్ ట్రయంగల్‌గా పిలువబడే ఈ మూడు దేశాలలో వేల సంఖ్యలో సైబర్ నేరగాళ్లు వున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇందులో భారతీయులు కూ డా వున్నారని, వీరిలో కొందరు ఇష్టంతోనే పనిచేస్తుండగా మరికొందరు నిర్బంధంలో వుంటూ బలవంతంగా నేరాలు చేస్తున్నారని ఆ సంస్థ పేర్కొంది. 2024 సెప్టెంబర్ నెల వరకు 11, 333 సైబర్ నేరాలు జరిగినట్లు ఐసిసిసిసి తెలిపింది. ఇందులో ఆన్‌లైన్ నేరాలు మొదటి స్థానంలో వున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదులు రెండు లక్షల 28 వేల 094 వుండగా ఈ నేరాల వల్ల బాధితులు పోగొట్టుకున్న డబ్బు 4636 కోట్ల రూపాయలుగా తేలింది. దీని తరువాత పెట్టుబడులకు సంబంధి ంచి లక్షా 360 ఫిర్యాదులు రాగా వీటి వల్ల బాధితులు పోగొట్టుకున్న డబ్బు 3216 కోట్ల రూపాయలు. దీని తరువాత డిజిటల్ అరెస్టుకు సంబంధించి 64,481 నే రాలు జరగగా దీనివల్ల బాధితులు పోగొట్టుకున్న డబ్బు 1616 కోట్ల రూపాయలుగా తేలింది. భారత్‌లో వెలుగు చూసిన సైబర్ నేరాలలో 45 శాతం గోల్డెన్ ట్రయంగ ల్ కేంద్రంగా జరిగినట్లుగా ఐసిసిసిసి తెలిపింది.

**ప్రజలను హెచ్చరిస్తున్న పోలీసులు**

ఇదిలావుండగా సైబర్ నేరగాళ్లు కొత్త తరహా నేరాలపై ఫోకస్ పెట్టినట్లు తేలడంతో అప్రమత్తమైన పోలీసులు దీనిపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందుకోసం సె ల్‌ఫోన్లలో డయల్ టోన్‌ల రూపంలో వివరిస్తున్నారు. దీంతో పాటు సోషల్ మీడియా, టివిలు, మీడియా ద్వారా ప్రజలను హెచ్చరించ సాగారు. ఇక సైబర్ నేరగాళ్ల కొ త్త తరహా మోసాల గురించి పరిశీలిస్తే ట్రేడింగ్ అరెస్టు, బ్యాంకింగ్‌కు సంబంధించిన పెట్టుబడుల స్కాం, చైన్ లింక్ షాపింగ్, ఫేక్ ఈ కామర్స్ సైట్, పార్శిల్ డెలివరి, రెంట్ ఆన్ అకౌంట్, విమాన, రైల్వే, బస్ టికెట్ల ఫ్రాడ్స్, క్యూ ఆర్ కోడ్ ఫ్రాడ్స్, ఈవెంట్ ప్రోగ్రాం స్కాం, డిపి ఫేక్, వాయిస్ క్లోనింగ్, ఓటిపి రిలేటెడ్ స్కాం, ఫిషిం గ్ లింక్స్, ఈకెవైసి, యుపిఐ ఫ్రాడ్స్, పిఎం కిసాన్ ఫ్రాడ్స్, తదితర 50 కొత్త తరహా నేరాలను సైబర్ నేరగాళ్లు కొత్తగా ఎంచుకున్నట్లు ఐసిసిసిసి పరిశీలనలో తేలింది. వీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్ ద్వారా వంద రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు పంపుతూ ఒక లింకును దాని వెంట పంపుతున్నారు. ఈ లింక్‌లో నేరగాళ్లు మాల్వేర్ టెక్నాలజిని పంపుతున్నారు. దీనివల్ల మనకు తెలియకుండా నే సెల్‌ఫోన్‌లో వున్న వ్యక్తిగత సమాచారం నేరగాళ్లకు క్షణాల వ్యవధిలో తెలిసిపోతోందని, ఒకవేళ ఎవరైనా లింక్‌ను క్లిక్ చేస్తే బ్యాంకులో నగదును నేరగాళ్లు ఖాళీ చే స్తారని పోలీసులు చెబుతున్నారు. లింకులపై అందరు జాగ్రత్తగా వుండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా పంపే నగదు విషయంలో అప్రమత్తంగా వుండాల ని పోలీసులు కోరుతున్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..

### - ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

**అనంతపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త బ్యూరో:** కార్మికచట్టాలు అమలు చేయాలని, లేబర్ కోడ్సు రద్దు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. సోమవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐటియుసి జిల్లా సమితి సమావేశంజిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రావులపల్లిరవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి నయాపైసా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను సవరణలు చేసి నాలుగు లేబర్‌కోడ్లను తీసుకొచ్చి కార్మికులను ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కార్మికులు, ఉద్యోగుల ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. అధికారంలోకి రాక మునుపు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని చెప్పి హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌లకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన అన్ని బుట్ట దాఖలవుతున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పున ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న క్లైములు వెంటనే ఇవ్వాలన్నారు. అసంఘటిత కార్మికులు హమాలి, ఆటో వీధి విక్రయదారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల ఉద్యోగుల సమస్యలుపరిష్కరించాలన్నారు.

## పరువు హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు

**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఒకరిపై పరువు హత్యయత్నాన్ని పోలీసులు చాకచక్యంగా భగ్నం చేసారు, ఈ కేసులో నలుగురు కిరాయి హంతకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన కుమార్తెకు ప్రేమ వివాహం దగ్గరుండి చేశాడని ఒక యువకుడిపై కోపం పెంచుకున్న ఓ తండ్రి. అతన్ని హత్య చేసేందుకు పథకం రచించాడు. పక్కా ప్రణాళిక ప్రకారం సుపారీ ఇచ్చి హత్య చేసేందుకు మనుషులను రంగంలోకి దింపాడు. వారి ప్రయత్నాలను ముందుగానే కనిపెట్టిన నందిగామ పోలీసులు హత్య కుట్రను అడ్డుకున్నారు.నందిగామ శివారు ఐతవరం గ్రామానికి చెందిన నరసింహారావు అనే వ్యక్తికి ఓ కుమార్తె ఉంది. ఆమె 14 నెలల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తన పరువు పోయిందని నరసింహారావు రగిపోయాడు. కనీ పెంచిన తమను వదిలేసి వెళ్లిపోయిందని, గ్రామంలో సూటిపోటి మాటలు అంటున్నారని ఆగ్రహానికి గురయ్యాడు. దీని మెత్తానికి మువ్వా గోపి అనే యువకుడే కారణమని తెలుసుకున్నాడు. తన కుమార్తెను ప్రేమికుడు వద్దకు చేర్చి పెళ్లి విషయంలో వారికి సహకరించాడని, అందువల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని భావించాడు. మువ్వా గోపిని ఎలాగైనా చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు గతేడాది చివరిలో హైదరాబాద్ కొత్తపేటకు వెళ్లాడు. అక్కడి నివాసం ఉంటున్న పాలంపల్లి విజయ్ కుమార్ అనే వ్యక్తిని కలిసి రూ.లక్ష సుపారీ ఇచ్చాడు. తాను చెప్పిన వ్యక్తిని హత్య చేయాలని ఒప్పందం చేసుకున్నాడు.నిజానికి ఈ ప్రేమ వివాహానికి సహకరించిన మువ్వ గోపి కోలా నరసింహారావుకు సమీప బంధువు అతను ఏ కొండూరు మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో విద్యుత్ శాఖలో జూనియం గా పని చేస్తున్నాడు. దీంతో తన కూతురి ప్రేమ వివాహానికి సొంత బంధువే సహకరించాడనే కారణంతో మువ్వ గోపిని హత్య చేసేందుకు రమ్యశ్రీ తండ్రి కోలా నరసింహారావు ప్రణాళిక వేశాడు.

## గోమాతను రక్షించుకోవడం సనాతన ధర్మం

### - పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్యషిర్డిసాయిబాబా మందిరంల వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు

**మంగళగిరి,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** సనాతన ధర్మంలో గోమాతను పూజించడం,రక్షించడం,కాపాడడం,పెంచుకోవడం ద్వారా సేవ చేయడం పుణ్య కార్యక్రమంతోపాటు ఆరోగ్యవంతంగా మెలుగుతామని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.గోమాతను రక్షించుకునేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలో అవగాహన కల్పిస్తుందన్నారు.గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో భగవాన్ శ్రీసత్యషిర సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి నిమ్మల షిర్డిసాయిబాబా ఆశీసులు పొందారు.ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలోని గోమాత ఆర్గానిక్ డైరీ ఫామ్‌ను సందర్శించిన మంత్రి స్వయంగా గోవులకు గ్రాసం అందించారు.తాను ఒక రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినేనని,గోమాత విలువ తనకు బాగా తెలసని గోవులరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ పాతూరి నాగభూషణం నేతృత్వంలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి,భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రధానమంత్రి నరేంద్రమోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ల సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగుతు పెడుతుందన్నారు.విజన్ 2047లక్ష్యసాధన దిశగా అమరావతి నిర్మాణం,పోలవరం ప్రాజెక్ట నిర్మాణ పనులు పూర్తయ్యి,ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకొని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సాయిబాబాను ప్రార్థించానని మంత్రి నిమ్మల తెలిపారు.భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ,19ఏళ్ళు గా దేవస్థాన వారి ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య

## చావు డప్పులు మోగించాల్సింది ప్రధాని మోడీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపైనే

### కృష్ణమాదిగకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును పెట్టించాలి: మాల సంఘాల జెఎసి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈ నెల 7న చేపట్టనున్న లక్ష డప్పులు-గొంతుకలు కార్యక్రమం సందర్భంగా మాలలకు చావు డప్పులు కొడతున్నామని చేస్తున్న ప్రచారాన్ని మాల సంఘాల జెఎసి తీవ్రంగా ఖండించింది. కృష్ణమాదిగ చావు డప్పులు కొట్టాల్సింది ఆయనకు ప్రియమిత్రులైన ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి, నిత్యం కాళ్లుమొక్కే మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడుకు కొట్టాలని జెఎసి నాయకులు సూచించారు. సోమ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య, నాయకులు బేర బాలకృష్ణ, బూర్గుల వెంకటేశ్వర్లు, మందాల భాస్కర్, గోపతి రమేష్, జంగా శ్రీనివాస్ తదితరులు మాట్లా డుతూ.. ఎస్సీ వర్గీకరణ అడ్డుకుంటున్నది మాలలు కాదని, నీవు నమ్ము కున్న నరేంద్రమోడీ, జి.కిషన్‌రెడ్డి, ఎం.వెంకయ్యానాయుడేనని ఆరో పించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదిం చాలని వారు డిమాండ్ చేశారు. కృష్ణమాదిగ బిజెపికి డప్పు కొడుతూ మాలలకు చావు డప్పు కొడతా మంటే మాలలు చూస్తు ఊరుకోరని, కృష్ణమాదిగ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని వారు హెచ్చరించారు. వర్గీకరణ కావాలంటే పార్లమెంట్ ఎదుట నిరాహారదీక్షలు చేసి పార్లమెంట్‌లో బిల్లు పెట్టించుకోవాలన్నారు.

4-2pg10.qxd:4-2pg10.qxd 01/01/01 8:17 AM Page 1



# ప్రపంచ ఛాంపియన్.. భారత్ మహిళలకు నజరానా నై



## ట్రోఫీతోనే సరిపెట్టిన క్రికెట్ కౌన్సిల్

### పురుషుల వరల్డ్ కప్‌కు భారత్‌కు రూ.1 కోటి ప్రైజ్

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక అండర్ 19 మహిళల టీ20 ప్రపంచ కప్‌ను భారత జట్టు గెల్చుకుంది. అయితే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) నుంచి ఎలాంటి ప్రైజ్ మనీ అందలేదు. కేవలం ట్రోఫీతోనే సరిపెట్టింది. అదే సమయంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) మాత్రం భారీ నజరానా 5 కోట్ల రూపాయలను ప్రకటించింది. జూన్ 29, 2024న బార్బడోస్‌లో జరిగిన టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో, రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా దక్షిణాఫ్రికాను ఓడించి రెండవసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు అండర్19 మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టును ఓడించి నిక్కీ ప్రసాద్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు వరుసగా రెండోసారి వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. అయితే ప్రపంచకప్ గెలిచిన పురుషుల జట్టుకు రూ.1 కోటి ప్రైజ్ ఇచ్చిన ఐసిసి, ఇప్పుడు అదే వరల్డ్ కప్ గెలిచిన మహిళా జట్టుకు మాత్రం నయా పైసా ఇవ్వకపోవడం విశేషం. ఈ నెల 2న కౌలాలంపూర్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో ఓడించిన భారత మహిళలు ఏకపక్షంగా ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకున్నారు. తద్వారా 2023 తర్వాత వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. నిజానికి ఐసిసి ఈవెంట్‌లో గెలిచిన ప్రతి జట్టుకు డబ్బు రూపంలో రివార్డ్ ఇస్తుంది. కానీ అండర్19 మహిళల టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల జట్టుకు ఐసిసి నుంచి ఎలాంటి రివార్డు లభించకపోవడం విమర్శల పాలవుతోంది. కానీ ప్రపంచ ఛాంపియన్ భారత మహిళల జట్టుకు ఐసిసి చైర్మన్ జైషా ప్రపంచకప్ ట్రోఫీని అందించి అందరికీ పతకాలు అందజేసి వాటితోనే సరిపెట్టారు. అయితే జట్టుకు మాత్రం ఎలాంటి పారితోషికం అందలేదు. నిజానికి అండర్19 ప్రపంచ ఛాంపియన్ జట్టుకు రివార్డు రాకపోవడం ఇది మొదటి సారి కాదు. రెండేళ్ల క్రితం ఈ టోర్నీలో భారత జట్టు తొలిసారి టైటిల్ గెలిచినప్పుడు కూడా నగదు బహుమతి లభించలేదు. ఐసిసి నుంచి ఎలాంటి బహుమతి రాకపోయినా, ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) నుంచి భారీ బహుమతి అందనుంది. గత సారి ప్రపంచ కప్ గెలిచిన అండర్19 జట్టుకు బిసిసిఐ స్వయంగా 5 కోట్ల బహుమతి ప్రకటించింది. అదేవిధంగా 2022లో అండర్19 పురుషుల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత జట్టుకు బిసిసిఐ భారీ ప్రైజ్ మనీని కూడా ప్రకటించింది. అందువల్ల ఇప్పుడు చాంపియన్‌గా నిలిచిన మహిళల జట్టుకు బిసిసిఐ నుండి మాత్రం భారీ నగదు బహుమతి లభించనుంది.




## మాస్టర్స్ చెస్ టోర్నీ విజేత ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్-2025కు ఎండ్ కార్డ్ పడింది. ఈ టోర్నీ విజేతగా భారత గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద నిలిచాడు. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ వేదికగా జరిగిన టై బ్రేకర్‌లో వరల్డ్ ఛాంపియన్ డి గుకేశ్‌పై విజయం సాధించాడు. అంతకు ముందు చివరి రౌండ్లో గుకేశ్, ప్రజ్ఞానంద ఇద్దరూ తమ మ్యాచ్‌లో ఓటమి చవిచూశారు. జర్మన్ గ్రాండ్ మాస్టర్ జీఎమ్ విన్సెంట్ ప్రగ్నం దందాను ఓడించగా, గుకేష్‌ను ఎరిగైసి అర్జున్ ఖంగుతిన్పించాడు. దీంతో 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్న గుకేశ్, ప్రజ్ఞానంద టైటిల్ కోసం టైబ్రేకర్లో తలపడ్డారు. టైబ్రేకర్‌లో తొలి గేమ్‌లో గుకేష్ విజయం సాధించగా, రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద గెలుపొందాడు. ఫలితంగా విజేతను తేల్చేందుకు సడన్ డెత్ నిర్వహించాల్సి వచ్చింది. ఇందులో ప్రజ్ఞానంద విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీ చివరి రౌండ్ (13వ రౌండ్)లో ప్రజ్ఞానంద 2741 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, దొమ్మరాజు గుకేశ్ (2777) రెండో స్థానంలో నిలిచాడు.


సోఫీ డివైన్


కేట్ క్రాస్


సోఫీ మోనాలిక్స్

## రాయల్ ఛాలెంజెర్స్‌కు మహిళా స్టార్లు షాక్

### సోఫీ, కేట్, మోలినిక్స్ గుడ్ బై

**న్యూఢిల్లీ:** డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు వరుస షాకులు తగులుతున్నాయి. మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025 టోర్నీ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. వడోదర, బెంగళూరు, లక్నో, ముంబై నగరాల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ తరుణంలో ముగ్గురు మహిళా స్టార్ ప్లేయర్లు ఈ టోర్నీకి గుడ్ బై చెప్పారు. కేవలం గంటల వ్యవధిలోనే ఇద్దరు స్టార్ ప్లేయర్లు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టోర్నీ నుండి తప్పుకున్నారు. ఇంగ్లండ్ ఆల్ రౌండర్ కేట్ క్రాస్, న్యూజిలాండ్ వెటరన్ ఆల్ రౌండర్ సోఫీ డివైన్ వ్యక్తిగత కారణాల రీత్యా టోర్నీ నుండి వైదొలొగుతున్నట్లు ఫ్రాంచైజీకి తెలియజేశారు. దాంతో, వీరిద్దరి స్థానంలో ఆర్సీబీ యాజమాన్యం ఆస్ట్రేలియా ద్వయం హీథర్ గ్రహమ్, కిమ్ గార్లను భర్తీ చేయనుంది. గ్రహమ్ రెండేళ్ల క్రితం భారత్తో జరిగిన ఓ టీ20 మ్యాచ్‌లో హ్యాట్రిక్‌సాధించింది. మరోవైపు, గార్త్ ఇటీవల కాలంలో భీకర ఫామ్ కనబరుస్తోంది. వీరిద్దరు రూ.30లక్షల కనీసధరకు రాయల్‌ఛాలెంజర్స్ బెంగుళూరు ఫ్రాంచైజీలో చేరారు. అంతకు ముందు గాయం కారణంగా సోఫీ మోలినిక్స్ దూరమవ్వడం ఆర్సీబీకి మరో దెబ్బ. ఈ ఆసీస్ ఆల్ రౌండర్ ఒంటి చేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చగలదు. పవర్‌ప్లే సహా ఆఖరి ఓవర్లలోనూ పరుగులు రాకుండా కట్టడి చేయగల సమర్థురాలు. మోలినెక్స్ స్థానంలో ఆర్సీబీ యాజమాన్యం చార్లీడీన్‌ను ఎంపిక చేయనుంది. కాగా మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జోయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబైఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, యూపీవారియర్జ్ ఫ్రాంచైజీలజట్లు పాల్గొంటున్నాయి.



## డేవిస్ కప్ ..ప్లే ఆఫ్‌లో భారత్ హ్యాట్రిక్

**న్యూఢిల్లీ:** డేవిస్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ జట్టు హ్యాట్రిక్ కొట్టింది. టోగో జట్టుతో జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ 4-0తో విజయం సాధించింది. ఇక డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో సైతం భారత జట్టు వరల్డ్ గ్రూప్-1లోనే కొనసాగనుంది. ఇక టోగో జట్టు తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లో భారతఆటగాళ్ల శశికుమార్ ముకుంద్, రామ్కుమార్ రామనాథన్ గెలుపొందగా, రెండోరోజుజరిగిన డబుల్‌లో బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ- శ్రీరామ్ బాలాజీ జంట 6-2, 6-1తో ఎంలాపా అకోమోలో-ఇసాక్ పాడియో (టోగో) ద్వయంపై నెగ్గింది. దాంతో భారత్ 3-0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. కాగా ఫలితం తేలిపోయినా ప్రాక్టీస్‌కోసం భారత జట్టు నాలుగోమ్యాచ్‌ను ఆడేందుకు సిద్ధమైంది. నాలుగో మ్యాచ్‌లో కరణ్ సింగ్ 6-2, 6-3తో పాడియోను ఓడించాడు.

## రంజీ ట్రోఫీలో.. హైదరాబాద్ ఓటమి



### 58 పరుగుల తేడాతో విదర్భ విజయం

**న్యూఢిల్లీ:** భారత జట్టు పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ బరిలోకి దిగినా, హైదరాబాద్ జట్టుకు నిరాశ తప్పలేదు. రంజీ ట్రోఫీ 2024-2025 దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు పరాజయంతో ముగించింది. మాజీ ఛాంపియన్ విదర్భ జట్టుతో నాగపూర్‌లో ముగిసిన గ్రూప్ బి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చామా మిలింద్ నాయకత్వంలోని హైదరాబాద్ జట్టు 58 పరుగుల తేడాతో ఓడిపోయింది. విదర్భ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 23/1తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ జట్టు 38.5 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటై పరాజయాన్ని చవిచూసింది. రాహుల్‌రాదేశ్ (77 బంతుల్లో 48 పరుగులు, 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలువగా, చివర్లో మిలింద్ (32 బంతుల్లో 20 పరుగులు, 2 ఫోర్లు, 1 సిక్స్), సిరాజ్ (14 బంతుల్లో 26 పరుగులు, 3ఫోర్లు, 2 సిక్సు) కాసేపు అలరించారు. ఎడంచేతివాటం స్పిన్నర్ హర్ష్ దూబె 57 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి విదర్భ జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. చివరి రోజు హైదరాబాద్ బ్యాటర్లు తడబడి మూల్యం చెల్లించు కున్నారు. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 355 పరుగులు, హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 326 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేసింది. ఈ పరాజయంతో ఓవరాల్‌గా గ్రూప్ బి లో హైదరాబాద్ జట్టు 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

# వడ్డీరేట్లు తగ్గించనున్న ఆర్‌బిఐ!

## రూపాయి గురించి ఆందోళన లేదు: ఫైనాన్స్ సెక్రటరీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రోజురోజుకూ క్షీణిస్తున్న వేళ ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే దీనిపై స్పందించారు. విలువ క్షీణించడంపై ఆందోళన చెందడం లేదని, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దీని గురించి చూసుకుంటోందని విలేకరులతో అన్నారు. రూపాయి విలువ అనేది ఎవరూ నియంత్రించేది కాదని, దానికంటూ ఒక స్థిరమైన ధర అంటూ ఉండదని పేర్కొన్నారు. విదేశీ ఇన్వెస్టర్ల నిధులు తరలుతుండడం కూడా రూపాయి విలువ క్షీణతకు ఓ కారణమని పాండే అన్నారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. ముఖ్యంగా కెనడా, మెక్సికో, చైనా దేశాలపై ట్రంప్ సుంకాలు విధిస్తూ తీసుకున్న నిర్ణయం కారణంగా రూపాయి విలువ తాజాగా మరో 67 పైసలు క్షీణించి 87.29 వద్ద జీవనకాల కనిష్టానికి చేరింది. 2024 డిసెంబరు 31న 85.61గా ఉన్న రూపాయి విలువ కొత్త యేడాదిలోనే దాదాపు 1.8 శాతం మేర క్షీణించింది.



ముఖ్యంగా ఈక్విటీ మార్కెట్లలో విదేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు, అమెరికా కరెన్సీ అయిన డాలరు బలపడడం వంటివి రూపాయి విలువ పతనానికి కారణంగా నిలుస్తున్నాయి.

**ముంబై, ఫిబ్రవరి 2:** గతవారం అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ తన వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించగా, ఈయూ సెంట్రల్ బ్యాంక్ మాత్రం రేట్ల తగ్గింపును కొనసాగించింది. అయితే ఒకపక్క గ్లోబల్ సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లలో ఊరటను కలిగిస్తుండగా, భారతీయులు సైతం ఇప్పుడు అదే కోరుకుంటున్నారు. వడ్డీ రేట్ల తగ్గింపు తర్వాత భారతీయ మధ్యతరగతి ప్రజలకు రిజర్వు బ్యాంక్ నుంచి మరో శుభవార్త రానున్నట్లు తెలుస్తోంది. నేటినుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనున్న మానిటరీపాలసీ సమావేశంలో దాదాపు 5ఏళ్ల తర్వాత తొలిసారి వడ్డీరేట్ల తగ్గింపు ప్రకటన ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రిజర్వు బ్యాంక్ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా వడ్డీ రేట్ల కోత ప్రకటిస్తారని చాలా మంది అంచనా వేస్తున్నారు. జీడీపీ వృద్ధి మందగమనం మధ్య శక్తికాంత దాస్ పదవీ కాలం ముగిసింది. నిపుణుల అంచనా ప్రకారం ఈసారి మానిటరీ పాలసీ సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర గవర్నర్ తగ్గింపు ప్రకటనచేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే జరిగితే ప్రస్తుతం ఉన్న రెపో రేటు 6.5 శాతం నుంచి 6.25శాతానికి తగ్గించబడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ద్రవ్యోల్బణం రిజర్వు బ్యాంక్ టార్గెట్ రేటు 4 శాతం కంటే ఎక్కువగా కొనసాగటం రిజర్వు బ్యాంకుకు పెద్ద సవాలుగా మారింది. దేశంలో ఆర్థిక వృద్ధి మందగమనం, ప్రభుత్వం ముందస్తు అంచనాల నడుమ కేంద్రప్రభుత్వం తన బడ్జెట్లో ప్రజల వద్ద లిక్విడిటీని పెంచే చర్యలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ చర్యలు వడ్డీరేట్ల తగ్గింపుకు తగిన మద్దతు అందిస్తాయని నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో గతవారం రిజర్వు బ్యాంక్ దేశీయ బ్యాంకుల్లోకి అదనంగా రూ.1.5 లక్షల కోట్ల డబ్బును ఇన్‌ఫ్యూజ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఇది డిసెంబరులో రూ.1.16 లక్షల కోట్ల నిధులను అందించిన తర్వాత రావటం గమనార్హం. క్యాష్ రిజర్వు రేషియోలో ఈ మేరకు మార్పులు చేసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో వడ్డీరేట్ల కోత చాలా ముఖ్యమైన, అనివార్యమైన చర్యగా నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో భారతదేశంలో రేటు తగ్గింపు ఉంటుందని భావిస్తున్నట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ గౌరా సేన్‌గుప్తా పేర్కొన్నారు.



## ట్రంప్ ఉత్తర్వుల వల్లే బిట్‌కాయిన్ భారీ క్రాష్

**ముంబై, ఫిబ్రవరి 3:** ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీలకు భారీగా డిమాండ్ కనిపించింది. ప్రధానంగా ట్రంప్ ఎన్నికల్లో విజయంతో బిట్ కాయిన్ సూపర్ వేగంతో దూసుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం క్రిప్టోలు భారీ నష్టాలతో పెట్టుబడిదారులకు నష్టాలను కలిగిస్తున్నాయి. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే క్రిప్టోల క్రాష్‌కి కూడా ట్రంపే కారణం కావటం. వివరాల్లోకి వెళితే అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఒకటి తర్వాత మరొకటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ ప్రభుత్వం గతంలో హెచ్చరించినట్లుగానే వాణిజ్య యుద్ధానికి తెరలేపింది. ప్రధానంగా కెనడా, మెక్సికో, చైనాలపై సుంకాలను ప్రకటించింది. ఈ క్రమంలో కెనడా, మెక్సికోలపై 25 శాతం చొప్పున పన్నులను ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్యలు ఈక్విటీ మార్కెట్లనే కాకుండా క్రిప్టో మార్కెట్లను కూడా తీవ్రంగా దెబ్బ తీశాయి. సోమవారం ట్రేడింగ్ ఇంట్రాడే సమయంలో ప్రముఖ క్రిప్టో కరెన్సీగా కొనసాగుతున్న బిట్‌కాయిన్ తన 3 వారాల కనిష్టాన్ని తాకింది. ఇదే క్రమంలో మరో క్రిప్టో అయిన ఈథర్ గత ఏడాది సెప్టెంబరు ప్రారంభంలో ఉన్న ధర కంటే తక్కువకు దిగజారింది. మధ్యాహ్నం సమయంలో బిట్ కాయిన్ ధర 94,395.4 డాలర్ల వద్ద ట్రేడింగ్ కొనసాగింది. గడచిన 24 గంటల సమయంలో ఇది దాదాపు 4.46 శాతం పతనాన్ని నమోదు చేసింది. ఇదే క్రమంలో మరో క్రిప్టో కరెన్సీ ఈథర్ ప్రస్తుతం 2570.41 డాలర్ల వద్ద ఉండగా, గడచిన 24 గంటల సమయంలో దాదాపు 17.38 శాతం పతనాన్ని నమోదు చేసింది. క్రిప్టోల గత పనితీరును పరిశీలిస్తే.. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన జనవరి 20న బిట్‌కాయిన్ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 1,07,071 డాలర్ల మార్కును తాకింది. బిట్‌కాయిన్ లక్ష డాలర్ల మార్కును దాటేయటంతో భవిష్యత్తులో ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని చాలా మంది భావించారు. దీంతో అనేక మంది తమ కష్టార్జితాన్ని ట్రంప్ గెలుపుతో క్రిప్టోలపై బెట్టింగ్ వేసి ప్రస్తుతం భారీ నష్టాలను చూస్తున్నారు. కేవలం ట్రంప్ బాధ్యతలు చేపట్టిన ఒక్కరోజే బిట్ కాయిన్ దాదాపు 40 శాతం పెరుగుదలను చూసింది. ప్రస్తుతం డాలర్ విలువ పెరుగుదలతో ఒక్కసారిగా క్రిప్టో కరెన్సీలు ఢమాల్ అంటూ కిందపడ్డాయని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో చాలా మంది చూపు ట్రంప్ తీసుకొచ్చిన క్రిప్టో కరెన్సీ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందనే దానిపై కొనసాగుతోంది. ఆయన తీసుకొచ్చిన క్రిప్టో ధర 0.18 వద్ద ప్రారంభనప్పటికీ.. జనవరిలో ఏకంగా ఒక్కోటి 75 డాలర్లకి చేరుకుంది. అయితే కేవలం రెండు వారాల్లోనే దీని విలువ 17.56 డాలర్లకు దిగజారిన సంగతి తెలిసిందే. నేడు ఒక్కరోజే దీని ధర దాదాపు 17 శాతానికి పైగా పతనంతో కొనసాగుతోంది. అలాగే మెలినా ట్రంప్ క్రిప్టో విలువ దాని ప్రారంభంలోని ధర కంటే దాదాపు 82.19 శాతం తగ్గుదలతో ట్రేడింగ్ కొనసాగిస్తోంది. అయితే వాణిజ్య భయాలు పరిస్థితులను మరింతగా దిగజార్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.



## చైనా 'డీప్‌సీక్' ఎఫెక్ట్..ఓపెన్‌ఎఐ 'డీప్ రీసెర్చ్'

**చైనా, ఫిబ్రవరి 3:** కృత్రిమ మేధ రంగంలో పెను సంచలనం సృష్టించిన చైనా డీప్‌సీక్, దిగ్గజ ఎఐ సంస్థలకు సవాళ్లు విసురుతోంది. ఈ నేపథ్యంలోనే అమెరికా టెక్ సంస్థ ఓపెన్ ఎఐ కీలక ప్రకటన చేసింది. డీప్ రీసెర్చ్ పేరుతో కొత్త టూల్‌ను ఆవిష్కరించింది. మనిషి చాలా గంటల్లో చేసే పనిని ఈ కొత్త టూల్ 10 నిమిషాల్లోనే చేసిపెడుతుందని కంపెనీ వెల్లడించింది. ఓపెన్ ఎఐ తదుపరి ఏజెంట్ డీప్ రీసెర్చ్ స్వతంత్రంగా పని చేయగలదు. మీరు ప్రాంప్ట్ ఇస్తే, చాట్‌జిపిటినే వందలాది ఆన్‌లైన్ సోర్సులను విశ్లేషించి, రీసెర్చ్ అనలిస్ట్ స్థాయిలో సమగ్ర నివేదిక రూపొందిస్తుంది అని కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. టోక్యోలో ఉన్నతస్థాయి సమావేశానికి ముందు కంపెనీ ఈ టూల్‌ను ఆవిష్కరించింది. ఓపెన్‌ఎఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్ ప్రస్తుతం టోక్యోలో ఉన్నారు. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, టెక్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంకు గ్రూప్ అధినేత మసయోషి సన్‌తో ఆయన చర్చలు జరపనున్నారు. ఓపెన్‌ఎఐ, సాఫ్ట్ బ్యాంకు, ఒరాకిల్ కలిసి స్టార్‌గేట్ పేరుతో సంయుక్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విషయం విదితమే. ఈ సంస్థ కృత్రిమ మేధలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, చైనాకు చెందిన డీప్‌సీక్ ఇటీవల అమెరికా టెక్ స్టాక్స్‌ను కుదిపేసిన సంగతి విదితమే. హాంగ్జౌకు చెందిన ఈ ఎఐ రీసెర్చ్ సంస్థ, కొన్ని రోజుల కిందట ఆర్1 పేరిట ఎఐ మోడల్‌ను ఆవిష్కరించింది. ఇది పూర్తిగా ఉచితం. ఓపెన్‌ఎఐ, క్లాడ్ సోనెట్ వంటి సంస్థలు ఇందుకోసం సబ్‌స్క్రిప్షన్ రూపంలో కొంత మొత్తాన్ని వసూలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి అడ్వాన్స్ ఎఐ మోడల్‌ను ఇలా పూర్తిగా ఉచితంగా అందిస్తుండడంతో డీప్‌సీక్ పేరు నెట్టింట మార్మోగింది. అంతేకాకుండా టెస్ట్ ఎఐ మోడళ్ల తయారీ కోసం ఓపెన్‌ఎఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు బిలియన్ల కొద్దీ డాలర్లు వెచ్చిస్తున్న వేళ, డీప్‌సీక్ మాత్రం కేవలం 6 మిలియన్ డాలర్లతో లేటెస్ట్ ఎఐ మోడల్‌ను రూపొందించడం విశేషం.




# వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 3:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిసాయి. దేశీయంగా వినియోగం పెంచేలా బడ్జెట్‌లో కొన్ని నిర్ణయాలు వెలువడినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు సూచీలపై ఒత్తిడికి కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజేసిన వాణిజ్య యుద్ధ భయాలే దీనికి కారణం. కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25శాతం, చైనాపై 10శాతం సుంకం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. దాదాపు ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగిసాయి. యూరోపియన్ మార్కెట్లు కూడా నష్టాల్లో



కొనసాగాయి. ఉదయం సెన్సెక్స్ 77,063.94 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో దాదాపు 700 పాయింట్లకుపైగా నష్టపోయిన సూచి, 76,756.09 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి సెన్సెక్స్ 319.22 పాయింట్లు నష్టపోయి 77,186.74 పాయింట్ల వద్ద నిలిచింది. అటు నిఫ్టీ కూడా 121.10 పాయింట్లు నష్టపోయి 23,361.05 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 57 పైసలు క్షీణించి 87.19 శాతంగా ఉంది. ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏసియన్ పెయింట్స్, ఐటిసి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి సుజుకి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ చమురు 76.59 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2829 డాలర్ల వద్ద కొనసాగింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14